RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 21.01.2026 | సంపుటి :12 సంచిక : 182 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

చలాన్ల పేరుతో వెహికిల్ 'కీ'లాగొద్దు

పోలీస్ వేధింపులపై హైకోర్టు సీరియస్

హైదరాబాద్(జనంసాక్షి): వాహన చలాన్లపై వాహనదారులను వేధింపులకు గురి చేయవద్దని ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవ డం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నో టీసులు ఇవ్వా లని హైకోర్టు ఆదే శించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమి షనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి

మిగతా 2లో..

సినిమా టిక్కెట్ రేట్ల పెంపుపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్,జనవరి20(జనంసాక్షి): సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు హోం శాఖ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్ కు హైకోర్టు సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. గత ఆదేశాలను ధిక్కరి స్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ

మిగతా 2లో..

టికెట్ ధరల పెంపును 90 రోజుల ముందే ప్రకటించాలి

ఐదు నిమిషాల ఆలస్యానికి ఓకే..

- ఇంటర్‌బోర్డు ఆమోదం
- ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం

హైదరాబాద్(జనంసాక్షి): ఇంటర్ వార్షిక పరీక్షలకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించాలని నిర్ణయం తీసుకున్నది. ఇదే నిబంధన నిరుడు అమలుకాగా, ఈసారి అమలు చేయనున్నారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. 9లక్షలకు పైగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు.

మిగతా 2లో..

ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్‌కి తెలంగాణే వేదిక

- ఏఐతో సమర్ధవంతంగా పౌరసేవలు : సీఎం రేవంత్
- ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం
- జ్యూరిక్‌లో ముఖ్యమంత్రికి ప్రవాసుల ఘనస్వాగతం

దావోస్(జనంసాక్షి): దావోస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగించి తెలంగాణలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కంపెటిటివ్ నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వ్యవస్థలోని మేధస్సే ఒకవైపు సమస్యగా, మరోవైపు పరిష్కారంగా మారుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. అదునాతన ఏఐ యుగంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండలేవని, ముందస్తు చర్యలు తీసుకోవడం, వేగంగా నిర్ణయాలు అమలు చే యడమే కీలకమని ఏఐ ప్రభావం గురించి మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్ 2047'

మిగతా 2లో..

దావోస్‌లో తెలంగాణ బృందం బిజీ బిజీ

- భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు: యూఏఈ
- ఏఐ రంగంలో తెలంగాణతో భాగస్వామ్యానికి ఆసక్తి కనబర్చిన రాయల్ ఫిలిప్స్
- హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటుపై చర్చ
- ఇజ్రాయెల్ ఐఎ చైర్మన్ అలోన్ స్టోపెల్ తో రేవంత్ భేటీ
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యం
- సౌదీ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' ఆసక్తి
- తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి
- హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుపై యూనిలీవర్ పరిశీలన

2లో..

మున్సిపల్ ఎన్నికలకు ఈసీ కసరత్తు

24 లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్?

కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్(జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి బుధవారం నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు. గురువారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్ట ర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు. ఈనెల 24న లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా పురపాలక సంఘాల రిజర్వేషన్లు తేలడంతో ఆశావహుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఇప్పటికే కొందరు వార్డుల బాట పట్టారు. ఏ వార్డు అయితే మేలని అంతర్మథనంలో పడ్డారు. ఓటర్లు తమకు అనువుగా ఉన్నారా లేదా అన్న వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నాలు

మిగతా 2లో..

ఎందుకు అరెస్టు చేయట్లేదు?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

న్యూఢిల్లీ(జనంసాక్షి): సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది సమాన పాత్ర ఉందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణిలోని నైని బ్లాక్ వివాదంపై సీబీఐ లేదంటే ఏదైనా సంస్థతో దర్యాప్తు జరపాలన్నారు. ఇది ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరిగిన గొడవల వలనే బయటకు వచ్చింది. మీడియాలో

మిగతా 2లో..

హరీశ్‌పై ప్రశ్నల వర్షం

నాపై కక్ష సాధిస్తున్నారు • పైవాళ్లు రాసిచ్చినవే అడిగారు

- సిట్ ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తాం
- ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు
- సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చేందుకే కుట్ర
- విచారణ అనంతరం మీడియా సమావేశంలో హరీశ్
- బీఆర్ఎస్ నేతను 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్

హైదరాబాద్(జనంసాక్షి): కేసులు, అరెస్టులు మాకు కొత్త కాదని.. ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సిట్టు, లట్టు, పొట్టుకు మేం భయపడమని.. సిట్ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నాపై నిరాధార ఆరోపణలు చేశారని.. విచారణ పేరుతో సమయం వృధా చేశారని అన్నారు. నోటీసులు వస్తే పారిపోమని.. ఎన్ని విచారణలు అయినా ఎదుర్కొంటామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం సమైక్య రాష్ట్రంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెడుతున్నారని.. కేసులు, అరెస్టులు మాకు కొత్తేమి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు నిలయంగా మారిందని.. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు.

మిగతా 2లో..

సీఎంవి పాలి'ట్రిక్స్'

- హామీలు నెరవేర్చలేక నిలదీసిన వారిపై కేసులు
- న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకైనా వెళ్తాం
- సిట్ విచారణ కాదు.. పిచ్చి విచారణ: కేటీఆర్

2లో..

తప్పు చేయకపోతే భయమెందుకు?

- ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష తప్పదు
- చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే డ్రామాలు
- కాంగ్రెస్ నేతల విమర్శలు

కామారెడ్డి/హైదరాబాద్ (జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎవరున్నా విచారణ జరుగుతుందని అన్నారు. ఈ కేసుపై ఆయన స్పందించారు. సిట్ విచారణపై హరీశ్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ మండిపడ్డారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు అతిపెద్ద నేరమని వ్యాఖ్యానించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. తన ఫోన్, షబ్బీర్ అలీ సహా చాలామంది ఫోన్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మహేష్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలపై రాజకీయ వేధింపులకు పాల్పడే ఉద్దేశం సీఎం

మిగతా 2లో..

పేదల జీవితాలలో వెలుగు నింపడమే

ప్రభుత్వం లక్ష్యం

అందుకోసమే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

మహిళలకు ఆర్థిక భరోసా అందిస్తాం:మంత్రి ఉత్తమ్

నేరేడుచర్ల(జనంసాక్షి): రానున్న మూడేళ్లలో నేరేడుచర్ల మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తా. పేదల జీవితాలలో వెలుగు నింపడమే తన ధ్యేయం. మహిళల జీవితాలలో ప్రత్యేకించి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అందులో భాగంగానే వడ్డీ లేని రుణాల పంపిణీ ఇస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం అయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ ఆవరణలో నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని 404 స్వయం సహాయక మహిళా సంఘాలకు 52, 07,399 రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అం తే కాక ఇందిరా మహిళా శక్తి పథకం కింద 5498 మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తాను ప్రజా జీవితంలో తపస్సులా ముందుకెళ్తున్నానని పేదల జీవితాలు బాగుపడేలా చేయడమే తన ధ్యేయమని అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో వడ్డీ లేని రుణాల పంపిణీ తో పాటు 5498 మందికి ఇందిరమ్మ చీరలను

మిగతా 2లో..

కేంద్ర ప్రభుత్వోద్యోగుల అవినీతి కేసుల్లో..

రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయొచ్చు

సుప్రీం కోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతి, లంచం నేరారోపణ కేసులను.. అవినీతి నిరోధక చట్టం కింద రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయడంతోపాటు ఛార్జిషీట్ దాఖలు చేయొచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై కేసు నమోదు చేయడానికి సీబీఐ నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల ఈ తీర్పు వెలువరించింది. రాజస్థాన్‌లో ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై నమోదైన అవినీతి కేసును కొట్టివేసేందుకు ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. చట్టపరమైన

మిగతా 2లో..

గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుని తీరతాం

- ఆ ప్రాంతానికి చాగోస్ దీవుల పరిస్థితి రాకూడదు
- మరో కారణం చెప్పిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి): గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు కారణాలు చెబుతున్నారు. తాజాగా చాగోస్ దీవుల ప్రస్తావన తీసుకొచ్చారు. వాటిలా తాము గ్రీన్‌లాండ్‌ను వదులుకోలేమని వెల్లడించారు. "తెలివైన నాటో మిత్ర దేశం యునైటెడ్ కింగ్డమ్.. అమెరికాకు చెందిన కీలక సైనిక స్థావరం ఉన్న డియేగోగార్సియాను మారిషస్‌కు ఇచ్చేయాలని యోచిస్తోంది. ఇది తెలివితక్కువ పని. ఈ నిర్ణయం వల్లే గ్రీన్‌లాండ్ విషయంలో నేను కఠినంగా వ్యవహరిస్తున్నాను" అని ట్రంప్ పోస్టు చేశారు. చాగోస్ దీవులను మారిషస్‌కు అప్పగించాలన్న బ్రిటన్ విధానాన్ని ఆయన తప్పుబట్టారు. అయితే తమ రక్షణ దృష్ట్యా గ్రీన్‌లాండ్ అంశంలో అమెరికా అలాంటి నిర్ణయాలు తీసుకోబోదని ఈ పోస్ట్‌తో స్పష్టం చేసినట్లైంది. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్ ఇవి ఒకప్పుడు బ్రిటిషు పాలనలో మారిషస్‌కు అనుబంధంగా ఉండేవి. 1965లో మారిషస్ నుంచి ఈ దీవులను బ్రిటన్ 3మిలియన్ పౌండ్లకు కొనుగోలు చేసింది. వాటిని చట్టవిరుద్ధంగా ఇతరులకు (అమెరికాకు) ఇచ్చేశారని మారిషస్ వాదిస్తూ వచ్చింది. దీనిపై గతేడాది యూకే, మారిషస్ ఒప్పందానికి

మిగతా 2లో..

ఫ్రాన్స్‌పైనా వడ్డింపులే..

- వైన్, షాంపైన్‌పై 200 % టారిఫ్‌లు విధిస్తాం
- బెదిరించిన ట్రంప్

న్యూయార్క్(జనంసాక్షి): మిత్రుడు, శత్రువు అనే తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపులకు పాల్పడుతున్నారు. తను అనుకున్నది సాధించుకునేందుకు టారిఫ్‌లను ఆయుధంగా వాడుతున్నారు. తాజాగా ఫ్రాన్స్‌పై 200 శాతం టారిఫ్‌లు వేస్తానని బెదిరించారు. గాజా శాంతిమండలిలో చేరాలన్న ట్రంప్ ఆహ్వానాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తిరస్కరించడం..

మిగతా 2లో..

భారత్‌తో వాణిజ్య ఒప్పందం..

మదర్ ఆఫ్ ఆల్ డీల్స్

ఈయూ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్

లండన్(జనంసాక్షి): భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఆ డీల్ దాదాపు ఖరారయ్యే దశలో ఉంది. దీనిని ఉద్దేశించి యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఒప్పందం దిశగా ఇంకా చేయాల్సిన పని ఉంది. మనం చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా పయనిస్తున్నాం. కొందరు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలుస్తారు. దీనివల్ల కోట్లాదిమంది ప్రజలకు వస్తువులు, సేవలు ఎగుమతి-దిగుమతి చేసుకొనే సౌలభ్యం కలుగుతుంది. ఇది ప్రపంచ

మిగతా 2లో..

ఇజ్రాయెల్‌లో ఐరాస అనుబంధ సంస్థ కార్యాలయం

కూల్చివేత

2లో..

మేడారం జాతరకూ మహిళలకు

ఉచిత ప్రయాణమే

స్పష్టం చేసిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

51 కేంద్రాల నుంచి 4 వేల ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

2లో..

పసిడి,రజతానికి రెక్కలు

లక్షన్నర దాటిన బంగారం, మూడు లక్షలు దాటిన వెండి

9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21.01.2026

పేదల జీవితాలలో వెలుగు నింపడమే ప్రభుత్వం లక్ష్యం

పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మిర్యాలగూడ నుండి నేరేడుచర్ల, కోదాడ మీదుగా ఖమ్మం జాతీయ రహదారి వరకు రహదారిని వేయించింది గతంలో తానేనని గుర్తు చేశారు.ఉన్నత విద్యను అభ్యసించేందుకు హుజూర్నగర్ లో 7.50 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాలను, 4.50 కోట్ల రూపాయలతో డిగ్రీ కళాశాల భవనాలు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని,హుజూర్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 2.5 కోట్లతో సిటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకుగాను హుజూర్నగర్ లో మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తే 40 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకొని 4500 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.ప్రజా ప్రభుత్వం రాకముందు గత ప్రభుత్వం పేద ప్రజలకు దొడ్డు బియ్యాన్ని ఇచ్చేదని అలాంటిది మేము అధికారంలోకి వచ్చాక సన్న బియ్యం ఇస్తున్నామని అంతేకాక అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాల పెద్ద భరోసా అని అన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వమే చెల్లించి వారికి పెద్ద ఎత్తున తోడ్పాటు అందిస్తున్నదన్నారు.నేరేడుచర్ల మున్సిపాలిటీలో 52,07,399 రూపాయల వడ్డీ లేని రుణంతోపాటు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఆర్పీ లు, మున్సిపల్ సిబ్బంది ఇందిరమ్మ చీరలను జాగ్రత్తగా అర్హులైన ప్రతి ఒక్కరికి బాధ్యతగా పంపిణీ చేసి ప్రతి చీరకు రసీదు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ కే నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి,ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి,మెప్మా సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకూ మహిళలకు ఉచిత ప్రయాణమే

హైదరాబాద్(జనంసాక్షి):మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు - 18 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకుని తీరతాం

వచ్చాయి. దాని ప్రకారం.. ఈ ద్వీప సమూహాన్ని మారిషస్‌కు తిరిగి అప్పగించి, ఆ దీవుల్లో అతిపెద్దదైన డియేగోగార్సియాను యూకే లీజుకు తీసుకోనుంది. 99 సంవత్సరాల పాటు లీజు కొనసాగనుంది. ఇందుకోసం ప్రతి ఏడాదికి 101 మిలియన్ పౌండ్లు (రూ.1237 కోట్ల మేర) చెల్లించనుంది. అక్కడ బ్రిటిష్- అమెరికన్ సంయుక్త సైనిక, వైమానిక స్థావరం ఉంది. ఈ ఒప్పందాన్ని గతంలో ట్రంప్ స్వాగతించారు.కానీ ఇప్పుడు విరుద్ధమైన వైఖరిని ట్రంప్ ప్రదర్శించడం గమనార్హం. ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా, చైనా విస్తరణను అడ్డుకునేందుకే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రకటిస్తున్నారు. చాగోస్ దీవుల విషయంలో ఇదే లాజిక్ వాడుతున్నారు. ఈ క్రమంలో యూకేను విమర్శిస్తూ.."ఈ బలహీన చర్యను రష్యా, చైనా గమనిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అవి బలాన్ని మాత్రమే గుర్తిస్తాయి. అందుకే నా నాయకత్వంలో అమెరికాకు ఎన్నడూ లేని గౌరవం లభిస్తోంది. అందుకే డెన్మార్క్, దాని ఐరోపా మిత్ర దేశాలు సరైన నిర్ణయం తీసుకోవాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంటే గ్రీన్‌లాండ్‌ను అమెరికాకు అప్పగించాలని పరోక్షంగా సూచించారు.

ఫ్రాన్స్‌పైనా వడ్డింపులే..

ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది. దాంతో ఫ్రాన్స్ వైన్, షాంపైన్ దిగుమతులపై ఈ టారిఫ్‌లు ఉంటాయని మీడియాతో మాట్లాడారు "నేను ఆయన (మెక్రాన్‌ను ఉద్దేశించి) వైన్లు, షాంపైన్లపై 200 శాతం టారిఫ్‌లు విధిస్తాను. అప్పుడు ఆయన తప్పక శాంతిమండలిలో చేరతారు. అయితే ఇప్పుడు ఆయన చేరాల్సిన అవసరం లేదు" అని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. అలాగే మెక్రాన్ నుంచి వచ్చిన ప్రైవేట్ మెసేజ్‌ను షేర్ చేశారు. "ఇరాన్, సిరియా విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నాం. కానీ గ్రీన్‌లాండ్ విషయంలో మీరు ఏం చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. దావోస్‌లో సమావేశం అనంతరం పారిస్‌లో జీ7 సమావేశం ఏర్పాటుచేస్తాను. మీరు యూఎస్‌కు వెళ్లడానికి ముందు ఇద్దరం కలిసి డిన్నర్ చేద్దాం" అని మెక్రాన్ తన సందేశంలో పేర్కొన్నట్టుగా ఉంది. గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించిన మండలిలో భాగం పంచుకోవాలని భారత్ సహా కొన్ని దేశాలను అమెరికా అధ్యక్షుడు, ఆ మండలి ఛైర్మన్ డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించిన సంగతి తెలిసిందే. గాజా పునరాభివృద్ధికి నిధుల సమీకరణ, పాలన పర్యవేక్షణకు మండలిని తొలుత ఉద్దేశించారు. గాజాలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ రెండోదశలో భాగంగా దీనిని తెరపైకి తెచ్చారు. ఈ ఆహ్వానాన్ని మెక్రాన్ తిరస్కరించారు. మరోవైపు.. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని దేశాలపై 10శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. దీనిపై ఫ్రాన్స్ అధ్యక్షుడు స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులకు లొంగబోమని స్పష్టం చేశారు. అలాగే తమ ఐరోపా యూనియన్‌కు చెందిన ట్రేడ్ బజూకను తొలిసారి ఉపయోగించేందుకు సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ నుంచి 200 శాతం సుంకాల హెచ్చరిక వచ్చింది.

ఇకపై దుర్గం చెరువు బాధ్యత మాది

హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలోని దుర్గంచెరువుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువు పరిసర ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల, రహేజా అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ సమీప ప్రాంతాల నుంచి మురుగునీరు చేరడం వల్లే దుర్గం చెరువులో గుర్రపుడెక్క భారీగా పెరిగిందన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోలేదని.. ఇకపై ఈ చెరువు బాధ్యతను హైడ్రా తీసుకుంటుందని చెప్పారు.దుర్గంచెరువులో గుర్రపుడెక్క పెరగడంతో పర్యాటకం దెబ్బతింది. దీంతో చెరువులో పర్యాటక బోట్లు నిలిచిపోయాయి. బోటింగ్ లేకపోవడంతో సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో ఈ పరిస్థితి తలెత్తింది.

ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్‌కి తెలంగాణే వేదిక

విజ న్‌ను ముఖ్యమంత్రి వివరిస్తూ.. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.ప్రస్తుతం హైదరాబాద్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా మారిందని, అన్ని రంగాలకు చెందిన అగ్రశ్రేణి కంపెనీలు తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా ఉండాలంటే మేధోవంతమైన వ్యవస్థలను నిర్మించాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.ఈ సదస్సులో స్మార్ట్ ఫ్యాక్టరీలు, స్థిరమైన ఇంధన వ్యవస్థలు, ఏఐ ఆధారిత సేవలు, స్మార్ట్ సిటీల నిర్మాణంపై ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలపై చర్చించారు.ఈ సమావేశంలో ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య మంత్రి హస్సన్ ఎల్కహతీబ్, ఎమరాల్డ్ ఏఐ సీఈఓ వరుణ్ శివరామ్, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జర్మనీ డిజిటల్ మంత్రిత్వ శాఖ మంత్రి కార్ స్టెన్ వైల్డ్ బెర్గర్, నోకియా సీఈఓ జస్టిన్ హోటార్డ్, హిటాచి సీఈఓ తోషియాకి టోకునాగా సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దావోస్‌లో తెలంగాణ బృందం బిజీ

భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు.

ఏఐ రంగంలో తెలంగాణతో భాగస్వామ్యం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్య మయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక-2026 వార్షిక సమావేశాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు.

ఇజ్రాయెల్ ఐఎ ఛైర్మన్ అలోన్ స్టోపెల్ తో రేవంత్ భేటీ

దావోస్‌లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజున బిజీ బిజీగా గడిపారు.ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్ తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్ లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు.

ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్‌తో పాటు హెల్త్ టెక్, అగ్రి-టెక్, సైబర్ సెక్యూరిటీ, ఎరోస్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యం

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్ , సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు.

తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు.

దావోస్‌లో యూనిలీవర్ ఉన్నతాధికారుల భేటీ

ప్రపంచ వ్యాప్తంగా వస్తు వినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా మంగళవారం దావోస్‌లో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ వి÷-లలెమ్ ఉయిజెన్తో సమావేశమైంది. తెలంగాణలో జీసీసీ ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా హైదరాబాద్ వేగంగా మారుతుందని వివరించారు. దీనిపై స్పందించిన వి÷-లలెమ్ ఉయిజెన్ హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు అవకాశాలను తమ సంస్థ సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్, కాస్టకో వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ (త్వరగా వినియోగ వస్తువుల) సంస్థల జీసీసీలు విజయవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు యూనిలీవర్ విలువైన భాగస్వామి అని, వేగవంతమైన అనుమతులు, లైసెన్సింగ్ పక్రియలతో తెలంగాణ వ్యాపారాలకు అనుకూల రాష్ట్రంగా నిలుస్తోంది అని మంత్రి పేర్కొన్నారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా తెలంగాణ రైజింగ్ బృందం, తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో త్వరగా వినియోగ వస్తువుల (ఎఫ్ఎంసీజీ) తయారీ రంగంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని యూనిలీవర్‌ను ఆహ్వానించారు.వాతావరణ పరిరక్షణ, నీటి వినియోగంలో సానుకూలత, యూనిలీవర్ లక్ష్యాలను, తెలంగాణ రాష్ట్రం చేపడు తున్న పునరుత్పాదక శక్తి, నీటి సంరక్షణ, సర్క్యులర్ ఎకానమీ కార్యక్రమాలతో అనుసంధానం చేసే అంశాలపై కూడా చర్చలు జరిగాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి సామాన్యులు ప్రాణాలు కోల్పోతుంటే ఎవరు జవాబుదారీ? : రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలో నీటిగుంతలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యువరాజ్ మెహతా మరణించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. ఇటీవల ఇందౌర్‌లో చోటుచేసుకున్న కలుషిత నీటి మరణాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరైన జవాబుదారీతనం లేకపోవడంవల్లే దేశంలో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు."రోడ్లు (నోయిడా ఘటనను ఉద్దేశిస్తూ).. నీళ్లు (ఇందౌర్ ఘటన).. అగ్నిప్రమాదాలు (గోవా ఘటన) ప్రాణాలు తీస్తున్నాయి. వంతెనలు, కాలుష్యం, అవినీతి.. ఇలా అనేక కారణాలతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. పట్టణాల్లో ఇలాంటి ఘటనలకు నిధులు, సాంకేతికత, పరిష్కారం లేకపోవడం కారణం కాదు. సరైన సమయంలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడమే అసలైన సమస్య. ప్రభుత్వ పట్టింపు లేని చర్యలే ఈ మరణాలకు కారణం" అని మండిపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచే స్తోన్న యువరాజ్ గతవారం విధులు ముగించుకొని ఇంటికి తిరిగొస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నోయిడాలోని సెక్టార్-150లోని ఏటీఎస్ లే గ్రాండియోస్ కూడలి వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి మురుగుకాలువ గోడను ఢీకొట్టి పక్కనే ఉన్న నీటి గుంతలో పడిఆ టెకీ ప్రాణాలు కోల్పోయారు.

సీఎంవి పాలి'ట్రిక్స్'

హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణపై కేటీఆర్ స్పందించారు. ఇది సిట్ విచారణ కాదని.. పిచ్చి విచారణ అని వ్యాఖ్యానించారు. సిట్ విచారణకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరైన నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. న్యాయం కోసం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు నెరవేర్చలేక నిలదీసిన వారిపై కేసులు నమోదు చేస్తోందని విమర్శించారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి సీఎం బావమరిది సృజన్‌రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో జాతీయగీతాలపన వివాదం

సభ నుంచి నిష్క్రమించిన గవర్నర్

చెన్నై(జనంసాక్షి): తమిళనాడు శాసనసభ సమావేశంలో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ ఆర్.ఎన్.రవి నిష్క్రమించారు. ఈ ఏడాది శాసనసభ తొలి సమావేశం మంగళవారం ప్రారంభం కాగా తన ప్రసంగాన్ని చదవకుండానే ఆయన వాకౌట్ చేశారు. తమిళతల్లి ప్రార్థనా గీతం తర్వాత జాతీయగీతం ఆలపించాలని సభాపతిని గవర్నర్ కోరగా అందుకు నిరాకరించడంతో ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

చలాన్ల పేరుతో వెహికిల్ 'కీ' లాగొద్దు

రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల అవినీతి కేసుల్లో.. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయొచ్చు

అంశాలతోపాటు గతంలో సుప్రీం ఇచ్చిన తీర్పులను సమీక్షించిన తర్వాతే సదరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చని హైకోర్టు నిర్ణయించినట్లు పేర్కొంది. దీనిని సీబీఐ మాత్రమే దర్యాప్తు చేయగలదని చెప్పడం సరైంది కాదంటూ హైకోర్టు సరైన అభిప్రాయాన్నే వెల్లడించిందని స్పష్టం చేసింది. అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు చేసేందుకు ప్రత్యేకంగా మరో విధానమేది లేదని.. కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయొచ్చని పేర్కొంది.

హరీశ్‌పై ప్రశ్నల వర్షం

సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సింగరేణిలో వేల కోట్ల రూపా యల కుంభకోణానికి తెరతీశాడని.. ఈ స్కామ్‌ను బట్టబయలు చేసినందుకు ఫోన్ ట్యా పింగ్ కేసులో నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలి టిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరి పించాలని డిమాండ్ చేశారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు.. ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. దమ్ముంటే నన్ను విచారణ చేసినప్పుడు తీసిన వీడియో బైట పెట్టాలని.. అంతే కానీ చిల్లర లీకులు ఇవ్వొద్దని అన్నారు. ఇది లీకుల ప్రభుత్వం, స్కాముల ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ముందే ఉన్నాయన్నారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంత్రి హరీష్ రావు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. హరీష్ రావు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. విచారణ ముగిసిన తర్వాత జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి నేరుగా ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకున

మేయర్ సీటు కోసం కాంగ్రెస్‌లో పోటీ

- బిసి మహిళకు రిజర్వ్ కావడంతో భార్యల రంగప్రవేశం

మహబూబ్‌నగర్, జనవరి20 (జనంసాక్షి) : మహబూబ్‌నగర్ మేయర్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఈ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ప్రధాన లీడర్లలో కొందరు తమ వారసులు, భార్యలను పోటీకి దింపేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ లీడర్ ఎన్పీ వెంకటేశ్ తన రాజకీయ వారసురాలిగా కూతురు నేహశ్రీని బరిలోకి దింపే అవకాశాలున్నాయి. వీరు ఉండే 14వ డివిజన్ బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడం కలిసొచ్చింది. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ సైతం తన భార్య ప్రసన్నను మేయర్‌గా పోటీకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు ఉండే 49వ డివిజన్ జనరల్‌కు రిజర్వ్ కాగా.. ఇక్కడి నుంచి ఆమెను కార్పొరేటర్‌గా పోటీకి దింపాలని భావిస్తున్నారు. మరో లీడర్ రాఘవేందర్ రాజు సైతం తన సతీమణి వసంతను మేయర్‌ను చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వసంత ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. ఇదిలాఉంటే ప్రసన్న, వసంత ఇద్దరూ 49వ డివిజన్ పరిధిలోని వారే. దీంతో వీరిద్దరూ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చ జరుగుతోంది. కాగా, కాంగ్రెస్ లీడర్ బురుజు సుధాకర్ సతీమణి కల్పన కూడా పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 52వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా పోటీ చేసి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

విచారణలో దూకుడు పెంచిన ఈడీ

- మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు
- శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసు

తిరువనంతపురం, జనవరి20 (జనంసాక్షి) : శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసుపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇటీవల సుప్రీం కూడా ఈ ఏసుపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడులలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావన్‌కోర్ దేవస్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్‌లకు సంబంధం ఉన్న ప్రాంతాల్లోను, వారి సన్నిహితులకు సంబంధించిన ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసుపై కేరళ హైకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టడానికి బంగారు తాపడాల పునరుద్ధరణ పనుల్లో భాగమైన ఇతర అధికారులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇటీవల అరెస్టైన టీడీబీ మాజీ అధ్యక్షులు ఎ.పద్మకుమార్, మాజీ సభ్యుడు కె.పి.శంకరదాస్‌ల హయాంలోనే ఈ అక్రమాలకు బీజం పడిందన్నారు. శబరిమల ఆలయంలో ఆన్-సైట్ తనిఖీ చేయాలని కేరళ హైకోర్టు ఇటీవల సిట్ అధికారులను ఆదేశించింది. మరోవైపు ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని భక్తులు, పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో ఆలయ ప్రధాన పూజారి సహా ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్

- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ దక్షిణాఫ్రికా అధ్యక్షులు నాగరాజు గుర్రాల

హైదరాబాద్ (జనంసాక్షి) : రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై, ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ దక్షిణాఫ్రికా అధ్యక్షులు నాగరాజు గుర్రాల తీవ్రంగా మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారణకు పిలవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సిట్ విచారణ కాదని, పూర్తిగా రాజకీయ కక్షతో చేపట్టిన విచారణ అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు, అనవసర విచారణలతో రాజకీయ ప్రతీకారానికి దిగుతోందన్నారు. తెలంగాణ ప్రజలు ఈ నాటకాలను గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. చట్టం, న్యాయస్థానాలపై తమకు పూర్తి గౌరవం ఉందని తెలిపారు. బెదిరింపులకు బీఆర్ఎస్ నేతలు భయపడరని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని ఆయన అన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జనవరి 20 (జనంసాక్షి) : గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారిగా చేపట్టవలసిన పనులను అధికారులకు వివరించారు.పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు.దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రముఖులను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించాలని తెలిపారు.పార్కింగ్,ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని,కార్యక్రమం జరుగుతున్నంతసేపు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,ఆర్డీవో రత్నకళ్యాణి,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బయో మిథనైజేషన్ ప్లాంట్ నిర్వహణ సాధ్యాసాధ్యలపై సమావేశం

వరంగల్ ఎంజీఎం, జనవరి 20(జనంసాక్షి): నగరం లో బయో మిథనైజేషన్ ప్లాంట్ నిర్వహణకు ప్రత్యామ్నాయ అంత్యాలు అవసరం అని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయ పడ్డారు. మంగళవారం ఎన్ఐయూఐ ఈ డబ్ల్యు సిటీ వారితో వర్చువల్ గా ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ నగరం నుండి పాల్గొని బయో మిథనైజేషన్ ప్లాంట్ నిర్వహణ సాధ్య ఆసాధ్యలపై చర్చించారు.ఈ సందర్భం గా కమిషనర్ వివరణ ఇస్తూ నగరంలో జరిగే తడి చెత్త పరిమాణ ప్రకారంగా ప్లాంట్ నిర్వహణకు అవకాశం ఉందని మన అవసరాలకు అనుగుణంగా చెత్త సేకరణ జరగకుంటే తడి చెత్త కు ప్రత్యామ్నాయంగా ప్యాడి అంత్యాలు, ఆవు పేడను అందుబాటు లో ఉంచుకోవాల్సిన అవసరం ఉంటుందని, దీని ద్వారా లభించిన గ్యాస్ ను అమ్ముకోవడానికి మెగా గ్యాస్, లెన్స్ గ్యాస్ సంస్థలు పోటీలో ఉన్నాయని,ప్లాంట్ నిర్విరామం గా కొనసాగాలంటే తడి చెత్త లభించని పక్షంలో ఇతర అంత్యాలు అందుబాటు లో ఉండాలని ఇందుకు గేదె/ ఆవు పేడ తో పాటు మురిగిన గడ్డి లు మంచి ప్రత్యామ్నాయాలు అని వీటిని సేకరించడానికి రైతులతో అగ్రిమెంట్ చేసుకొని కొనుగోలు చేస్తామని ఇందుకోసం ఆర్ ఎఫ్ పి లు పిలుస్తామని తడి చెత్త సేకరణ అనంతరం వచ్చిన రిపోర్ట్ లను బట్టి అందుకు అనువైన నిర్ణయం తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.ఈ సమావేశం లో ఆయా సంస్థల ప్రతినిధులు రాహుల్ దీప్తి, ఎస్ ఈ సత్యనారాయణ, సి ఎం.హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ మహేందర్, డి ఈ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు జిల్లాలో వేడెక్కిన మున్సిపల్ పోరు

- రిజర్వేషన్ల ఖరారుతో రంగంలోకి ఆశావహులు
- సిఎం సొంత జిల్లా కావడంతో ప్రత్యేక దృష్టి
- అన్ని పార్టీల్లోనూ గెలుపుపై ఆశాభావం

మహబూబ్‌నగర్, జనవరి20 (జనంసాక్షి) : ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. సిఎం సొంత జిల్లా కావడంతో పాటు, ఇప్పుడు ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. తచూ జిల్లాలో ఏదో ఒక పనిమీద పరుగులు పెడుతున్నారు. దీంతో ఈ ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. జడ్చర్ల పాలకవర్గం పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని భూత్పూర్, దేవరకద్ర, కోస్గి, మద్దూరు, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో కాంగ్రెస్ హైకమాండ్ గెలుపు బాధ్యతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అప్పగించింది. మంత్రి దామోదరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ బాధ్యతలను అప్పగించింది. ముందుగా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని లీడర్లతో సమావేశం కానున్నారు. వార్డులు, డివిజన్లలో పార్టీ పరిస్థితి, ప్రతిపక్షాల బలాలు, బలహీనతలపై చర్చించనున్నారు. పార్టీ నుంచి పోటీకి ఎవరు ఆసక్తి చూపుతున్నారు. ఏయే స్థానాల్లో లీడర్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. అక్కడ ఎవరిని బరిలోకి దింపితే గెలిచే అవకాశం ఉంది. ఎవరిని నిలపాలి..ఎవరిని తప్పించాలి.. రెబల్స్ ఉంటే వారిని బుజ్జగించి.. ఇతర అవకాశాలు కల్పించేలా హైకమాండ్ నుంచి హామీలు ఇప్పించే ప్రయత్నాలు చేయనున్నారు. దీనికితోడు వార్డులు, డివిజన్ల వారీగా ఎప్పటికప్పుడు ప్రజానాడిని, అక్కడి పరిస్థితులను లీడర్లతో సమీక్షించనున్నారు. అసరమైతే రెండు, మూడు డివిజన్లకు ఒక లీడర్‌ను ఇన్ చార్జీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. వార్డులు, డివిజన్లలో పర్యటిస్తూ పార్టీ క్యాండిడేట్లను గెలిపించే బాధ్యతను తీసుకోనున్నారు. ఇకపోతే పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు పలుచోట్ల సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించి, ఖర్చులను వార్డు లీడర్లు భరించారు. నడిగడ్డలో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించి మున్సిపల్ ఎన్నికలకు క్యాడర్ ను సిద్ధం చేసింది. బీజేపీ నాయకులు కూడా ప్రతిరోజు మీటింగ్ లు పెట్టుకుంటూ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రులు ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. గద్వాలలో 37 వార్డులు, అయిజలో 20 వార్డులు, అలంపూర్ లో 10, వడ్డేపల్లిలో 10 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల వేడి మొదలు అయింది. ఇప్పటికే కొన్ని చోట్ల వివిధ పార్టీల నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు వార్డులో ప్రభావం చూపే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. కుల సంఘాలు, యూత్ లీడర్లను కలిసి తమకు మద్దతు తెలియజేయాలని కోరుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా ప్రచారం చేయడంతో పాటు నజరానాలు పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గద్వాల మున్సిపాలిటీలో మూడు పార్టీలు బలంగా ఉండడంతో ఎక్కువ స్థానాలు గెలుపొంది చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అందరూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అలంపూర్ నియోజక వర్గంలోని అయిజ, ఆలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో కూడా పోరు రసవత్తరంగా మారనుంది. వార్డుల్లో పోటీ చేసేందుకు ప్రతి వార్డుకు ముగ్గురిని ఎంపిక చేసి వారి పేర్లను హైకమాండ్‌కు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లోకల్‌గా ఎలాంటి ఇబ్బంది లేకుండా హైకమాండ్ ఎంపిక చేసేలా చూస్తున్నారు. వార్డుల్లో గెలిచే అభ్యర్థులకే పార్టీ టికెట్ ఇచ్చేలా వ్యూహాత్మకంగా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. వార్డుల్లో ఏ వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయంతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థులను నిలబెట్టేందుకు మూడు పార్టీలు తమవంతు ప్రయత్నం చేస్తున్నాయి.

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్పీ జెండా ఎగురవేస్తాం

- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా
- కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చేరికల జోశ్
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు.
- ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీలు ముందుకు రావాలని అరుణ పిలుపు

కరీంనగర్ (జనంసాక్షి) : కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్పీ జెండా ఎగురవేస్తామని టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి టీఆర్పీ కరీంనగర్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు వాజిద్, టౌన్ అధ్యక్షులు ఆర్షత్ బిన్ అలీ, టౌన్ మహిళా అధ్యక్షురాలు జింక లావణ్య ఆధ్వర్యంలో భారీగా చేరారు. నూతన సబ్యులకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేసిన అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నూతన సభ్యులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 96% ఉన్న బీసీ ఎస్సి ఎస్టీ మైనారిటీలు 4% ఉన్న అగ్రవర్ణాల జెండాలు మోసి, వారికి జేజేలు కొట్టి వారి కింద బానిసగా బ్రతికినామని ఇక తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు ఏ రాజకీయ పార్టీ న్యాయం చేయదని హితవు పలికారు. అగ్రవర్ణాల పెత్తనాన్ని అణిచివేసి బీసీ రాజ్యాధికారాన్ని సాదించుకో వాలనే సంకల్పంతో ప్రజల గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీఆర్పీ పార్టీ ని అవిర్భవించారని అన్నారు. బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని ఈ రాష్ట్ర ప్రభుత్వం కోర్టు కేసులను బూచీగా చూపిస్తూ రాష్ట్రంలో అత్యధిక జనాభా ప్రాతిపదిక కలిగిన బీసీలను మోసం చేసి పాత పద్ధతిలో మున్సిపల్ ఎన్నికల్లో వెళ్లడం సోగ్గుచేటని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ నాయకత్వాన్ని సృష్టిస్తామని తెలుపుతూ ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీలు ముందుకు రావాలని ప్రధానంగా యువత భారీగా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు, మొహమ్మద్ సాజిద్, మెహమ్మద్ రజి, జహంగీర్, షానాజ్ బేగం, రొక్సానా బేగం, ఖాజాబి, షాబాణ, శహస్త బేగం, ఇశ్రాత్ బేగం, ఆసియా బేగం, నేహా సంరీన్ లు వీరందరూ పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని, రాబోయే మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో టీఆర్పీ పార్టీ జెండా ఎగురవేసే విధంగా కష్టపడాలి, ప్రతి డివిజన్లలో టీఆర్పీ సత్తా చాటాలని అఖిల్ పాషా సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చాంద్ పాషా,జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, టౌన్ ప్రెసిడెంట్ ఆర్షత్, టౌన్ మహిళ అధ్యక్షురాలు జింక లావణ్య, సోషల్ మీడియా కన్వీనర్ మహబూబ్ అలీ పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణిలో 487 దరఖాస్తులు

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 487 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 127, రెవెన్యూ శాఖకు సంబంధించి 57, ఇందిరమ్మ ఇండ్ల కోసం 203, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

కాంగ్రెస్ పాలనలో పడకేసిన పట్టణాభివృద్ధి

- ఉమ్మడి జిల్లాలో మళ్లీ గెలుపు మాదే
- బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి20 (జనంసాక్షి) : పట్టణపోరు లోనూ బిఆర్ఎస్ సత్తా చాటుతుందని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలే మన పార్టీ బలానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. మున్సిపాలిటీలో ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అధికారంలోకి రాకముందు పట్టణాల పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారిందో ప్రజలందరికీ తెలుసన్నారు. బిఆర్ఎస్ రాకముందు పట్టణాల్లో మురికి కాలువలు, చెడిపోయిన రోడ్లు, అపరిశుభ్రతతో ఉండేదని, తాము పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే పట్టణాలను మార్చగలిగామని, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా సెంట్రల్ లైటింగ్, డివైడర్ల కోసం నిధులు తీసుకురాగలిగామని చెప్పారు. ప్రతి వెయ్యి ఓట్లు ఉన్న వార్డుకు సుమారు రూ.6 కోట్ల వరకు నిధులు కేటాయించేలా అభివృద్ధి చేశామని వివరించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లనీరు అందించామని, నియోజకవర్గానికో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రైతుల కోసం చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ అభివృద్ధి కారణంగానే మున్సిపాలిటీలో ఓటు అడిగే హక్కు మాకే ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మనం మంజూరు చేసిన నిధులతో పనులు కూడా పూర్తి చేయడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయకుండా, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటింటికి తిరిగి గ్యారంటీ కార్డులు కాంగ్రెస్ నాయకులతో పంచించారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్యారంటీలను పూర్తిగా అటకెక్కించారని విమర్శించారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను రూపొందించిందని, ఈ కార్డుల ద్వారా గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి ఇంటికి వచ్చినప్పుడు ఈ బాకీ కార్డును చూపించి, హామీలు నెరవేర్చితేనే ఓటు వేస్తామని, లేకపోతే ఓడిస్తామని ప్రజలు స్పష్టంగా చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీలో టికెట్లు ఆశించే వారు ఎంతమంది ఉన్నా, ఎవరికి టికెట్ వచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని వేముల ప్రశాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

నటుడు అక్షయ్ ఖన్నాకు తప్పిన ప్రమాదం

- కారు ప్రమాదంతో తప్పిన ముప్పు

ముంబై, జనవరి20 (జనంసాక్షి) : బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ వాహనానికి సోమవారం రాత్రి భారీ ప్రమాదం జరిగింది. అక్షయ్ కుమార్, ఆయన భార్య ట్వింకిల్ ఖన్నా విదేశీ పర్యటన నుంచి తిరిగి వస్తుండగా కాన్వాయ్ లోని ఒక ఎస్కార్ట్ వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, ఆటో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి గాయాలయ్యాయి. అక్షయ్, ట్వింకిల్ ప్రయాణిస్తున్న కారుకి స్వల్పంగా దెబ్బ తగిలినప్పటికీ.. వారిద్దరూ సురక్షితంగా ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం ముంబై జుహూ ప్రాంతంలో వేగంగా వచ్చిన ఒక మెర్సిడెస్ కారు ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆ ఆటో అదుపు తప్పి రోడ్డుకు అవతలివైపు ప్రయాణిస్తున్న అక్షయ్ ఎస్కార్ట్ కారును ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యూత్ ఐడియాథాన్‌లో డిపిఎస్ వరంగల్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్ (జనంసాక్షి) : పెండ్యాలలోని డిపిఎస్ వరంగల్ సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు, ఆదివారం ఐఐటి ఢిల్లీలో, థింక్ స్టార్టప్, సిబిఎస్ఈలు సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక యూత్ ఐడియాథాన్ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని పాఠశాల చైర్మన్ రవి కిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎస్ వరంగల్ విద్యార్థులు మేధా పెండ్యాల మరియు జోయా తహ్మీనా లు పాల్గొన్నారు. అధ్యాపకుడు కాసిపేట మనోజ్ రాజ్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో విద్యార్థులు, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'ఫామ్ లింక్' అనే యాప్‌ను అభివృద్ధి చేశారు. ఏఐ ఆధారిత ఈయాప్ ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. రైతులు నేరుగా మార్కెట్లతో అనుసంధానం కావడం, సరైన ధరలు పొందడం వంటి అంశాల్లో ఈయాప్ కీలక పాత్ర పోషిస్తుందని విద్యార్థులు వివరించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. ఈ ఆలోచన దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు మరియు నిపుణుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగ అభివృద్ధికి వినియోగించే దిశగా ఈ ప్రాజెక్ట్ ఆదర్శంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వి. రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.. ఇన్నారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ సమాజానికి

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21 జనవరి 2026

భారతీయ సమాజంపై ద్రవ్యోల్బణం ప్రభావం!

భారత ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం అనేది కేవలం గణాంకాల స్థాయిలో అర్థం చేసుకునే అంశం కాదు. ఇది సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు, వినియోగ సామర్థ్యం, పొదుపు అలవాట్లు, పెట్టుబడుల దిశ, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విధానాలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకునే ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే కీలక సూచిక. డిసెంబర్ 2025లో రిటైల్ ద్రవ్యోల్బణం 1.33%గా నమోదవడం భారత ఆర్థిక పరిణామాల్లో ఒక అసాధారణ దశను సూచిస్తుంది. ఈ స్థాయి ఆర్‌బీఐ నిర్దేశించిన కనిష్ఠ సౌకర్య స్థాయి 2% కంటే దిగువన ఉండటం విధానపరం గా గమనించాల్సిన పరిణామం. ఉపరితలంగా ఇది వినియోగదారులకు ఊరటనిచ్చే సంఖ్యలా కనిపించినా, లోతుగా పరిశీలిస్తే తక్కువ ద్రవ్యోల్బణం వెనుక ఉన్న నిర్మాణాత్మక బలహీనతలు స్పష్టంగా దర్శనమిస్తాయి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణ లక్ష్యాన్ని 4%గా నిర్ణయించి, 2% నుంచి 6% వరకు సౌకర్య పరిధిని నిర్దేశించింది. ఈ పరిధిలో ధరల కదలికలు కొనసాగితేనే ఆర్థిక వ్యవస్థ సమతుల్యంగా పనిచేస్తుందని భావిస్తారు. డిసెంబర్ 2025లో నమోదైన 1.33% ఈ పరిధికి దిగువన ఉండటం డిమాండ్ బలహీనతను సూచించే సంకేతంగా మారుతోంది. తక్కువ ద్రవ్యోల్బణం తక్షణంగా వినియోగదారులకు లాభంలా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది ఉత్పత్తి, పెట్టుబడులు, ఉపాధిపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదాన్ని కలిగిస్తుంది. వినియోగం బలహీనంగా ఉన్నప్పుడు పరిశ్రమలు ఉత్పత్తి విస్తరణపై వెనుకడుగు వేస్తాయి. పెట్టుబడుల ప్రవాహం మందగిస్తుంది. ఉపాధి అవకాశాలు పరిమితం అవుతాయి. ఈ పరిణామాల సమిష్టి ప్రభావం ఆర్థిక వృద్ధిని మందగింపజేస్తుంది. డిసెంబర్ 2024 నుంచి డిసెంబర్ 2025 వరకూ ద్రవ్యోల్బణ గణాంకాలను పరిశీలిస్తే మార్పు తీవ్రత స్పష్టంగా తెలుస్తుంది. డిసెంబర్ 2024లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.22%గా నమోదైంది. అదే సమయంలో ఆహార పానీయాల విభాగంలో ద్రవ్యోల్బణం 7.7%గా ఉండటం ప్రజల జీవన వ్యయాన్ని గణనీయంగా పెంచింది. ఒక సంవత్సరం వ్యవధిలో పరిస్థితి పూర్తిగా మారింది. డిసెంబర్ 2025 నాటికి ఆహార పానీయాల విభాగంలో ధరలు 1.85% మేర క్షీణించాయి. నవంబ ర్ 2025లో ఈ క్షీణత 2.8%గా ఉండటం ధరలు దిగువ దిశగా కదులుతున్నాయని సూచిస్తుంది. అధిక బేస్ ప్రభావం దీనికి ప్రధాన కారణంగా కనిపించినా, వాస్తవ ఆర్థిక పరిస్థితి అంత సులభమైనది కాదు. ఆహార ధరలు తగ్గడం పట్టణ వినియోగదారులకు తాత్కాలిక ఉపశమనం ఇస్తున్నప్పటికీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది ఆందోళనకర పరిణామంగా మారింది. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం వల్ల రైతు ఆదాయం తగ్గుతోంది. రైతు ఆదాయం తగ్గితే గ్రామీణ వినియోగ డిమాండ్ క్షీణిస్తుంది. ఈ ప్రభావం ఎఫ్ఎంసీజీ, దుస్తులు, నిర్మాణ రంగాలపై స్పష్టంగా కనిపిస్తోంది. డిసెంబర్ 2025లో దుస్తులు పాదరక్షల విభాగంలో ద్రవ్యోల్బణం 1.44%గా ఉండటం, డిసెంబర్ 2024లో ఉన్న 2.7%తో పోలిస్తే వినియోగ వ్యయాలపై ప్రజలు ఎంతగా నియంత్రణ పాటిస్తున్నారో తెలియజేస్తుంది.

పాన్, పొగాకు, మత్తు పదార్థాల విభాగంలో ద్రవ్యోల్బణం 2.96%గా స్థిరంగా కొనసాగుతోంది. గృహ రంగంలో ద్రవ్యోల్బణం 2.86%గా ఉండటం రియల్ ఎస్టేట్ రంగం నిలకడగా ఉన్నప్పటికీ వేగంగా విస్తరించడంలేదని సూచిస్తుంది. ఇంధనం, కాంతి విభాగంలో ద్రవ్యోల్బణం 1.97%కు తగ్గడం అంతర్జాతీయ ఇంధన ధరల కదలికలు, దేశీయ పన్ను విధానాల ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నప్పటికీ ధరల నిర్మాణంలో అసమానత తీవ్రంగా కనిపిస్తోంది. మాంసాహార ఉత్పత్తులు, తినుబండార నూనెలు, పండ్లు వంటి అవసరమైన పోషకాహార వస్తువుల ధరల్లో 5%కు పైగా ద్రవ్యోల్బణం కొనసాగుతోంది. ఇది తక్కువ ఆదాయం కలిగిన వర్గాలపై ఎక్కువ భారం మోపుతోంది.

ఈ దశలో అత్యంత కీలకమైన అంశం కోర్ ద్రవ్యోల్బణం. ఆహారం, ఇంధనం, వాహనాల పెట్రోల్, డీజిల్‌ను మినహాయించి లెక్కించే కోర్ సీపీఐ డిసెంబర్ 2025లో 4.8%కు చేరింది. ఇది 28 నెలల గరిష్ఠ స్థాయి. నవంబర్ 2025లో ఇది 4.4%గా ఉంది. ఈ పెరుగుదల ప్రధానంగా బంగారం, వెండి ధరల పెరుగుదల వల్ల చోటుచేసుకుంది. బంగారం, వెండిని మినహాయిస్తే కోర్ ద్రవ్యోల్బణం 2.47% వద్ద స్థిరంగా కొనసాగు తోంది. ఇది డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా బలహీనంగానే ఉందని స్పష్టంగా సూచిస్తుంది. భవిష్యత్‌పై అనిశ్చితి పెరుగుతున్న కొద్దీ ప్రజలు భద్రపెట్టుబడుల వైపు మొగ్గుచూపుతున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది.డిసెంబర్ 2025లో నమోదైన 1.33% రిటైల్ ద్రవ్యోల్బణం ఒక ఆర్థిక విజయ సూచికగా చూడాల్సిన అంశం కాదు. ఇది డిమాండ్ బలహీనత, వ్యవసాయ ఆదాయ సంక్షోభం, వినియోగ అసమానతలు, ఆర్థిక అనిశ్చితిని బయటపెట్టే హెచ్చరికగా చూడాల్సిన గణాంకం. భారత ఆర్థిక వ్యవస్థకు నిజమైన స్థిరత్వం అంటే ధరలు పడిపోవడం మాత్రమే కాదు. రైతు ఆదాయం పెరగాలి. ఉపాధి అవకాశాలు విస్తరించాలి. వినియోగ డిమాండ్ బలపడాలి. పెట్టుబడుల చక్రం చురుకుగా సాగాలి. ఈ సమతుల్యత సాధించినప్పుడే ద్రవ్యోల్బణ గణాంకాలు ప్రజల జీవితాల్లో నిజమైన అర్థాన్ని సంతరించుకుంటాయి.

డిసెంబర్ 2025లో నమోదైన 1.33% రిటైల్ ద్రవ్యోల్బణం భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం తక్షణంగా ఉపశమనంగా కనిపించినా, రాబోయే సంవత్సరాల్లో ధరల దిశ, వినియోగ డిమాండ్, పెట్టుబడుల చక్రం, ఉపాధి విస్తరణపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్తు అంచనాలు వేయాలంటే ప్రస్తుత గణాంకాల వెనుక ఉన్న ధోరణులను లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక విశ్లేషణ ప్రకారం 2026లో ద్రవ్యోల్బణం రెండు విభిన్న దిశల మధ్య ఊగిసలాడే అవకాశం ఉంది. ఒకవైపు వినియోగ డిమాండ్ బలహీనంగా కొనసాగితే ధరలపై ఒత్తిడి పరిమితంగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు మాంసాహార ఉత్పత్తులు, తినుబండార నూనెలు, పండ్లు వంటి కీలక ఆహార వస్తువుల ధరల్లో ఇప్పటికే 5%కు పైగా ద్రవ్యోల్బణం కొనసాగుతోంది. ఇది రాబోయే నెలల్లో మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పైకి నెట్టే ప్రధాన కారకంగా మారవచ్చు. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల వ్యవసాయ ఉత్పత్తిపై ప్రభావం చూపితే ఆహార ధరలు తిరిగి వేగంగా పెరిగే ప్రమాదం ఉంది.

2026 నుంచి 2027 మధ్యకాలంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కీలక మలుపు వద్ద నిలుస్తుంది. వ్యవసాయ ఆదాయం పెరగకపోతే గ్రామీణ వినియోగ డిమాండ్ బలపడదు. గ్రామీణ డిమాండ్ బలహీనంగా ఉంటే ఎఫ్ఎంసీజీ, దుస్తులు, గృహ నిర్మాణ రంగాలు పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశం తగ్గుతుంది. దీని ప్రభావం పట్టణ ఉపాధిపైనా పడుతుంది. ఉపాధి వృద్ధి మందగిస్తే ఆదాయాలు పెరగవు. ఆదాయాలు పెరగకపోతే వినియోగం బలపడదు. ఈ చక్రం కొనసాగితే తక్కువ ద్రవ్యోల్బణం ఒక దీర్ఘకాల ధోరణిగా మారే ప్రమాదం ఉంటుంది.

2027 నుంచి 2030 మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థకు నిజమైన సవాలు సమతుల్య వృద్ధిని సాధించడమే. కేవలం తక్కువ ద్రవ్యోల్బణం సరిపోదు. రైతు ఆదాయం పెరగాలి. గ్రామీణ కొనుగోలు శక్తి బలపడాలి. పట్టణ ఉపాధి స్థిరంగా ఉండాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉత్పత్తి విస్తరించాలి. ఈ అంశాలు కలిసినప్పుడే ద్రవ్యోల్బణం నియంత్రణ ప్రజల జీవన ప్రమాణాల్లో నిజమైన మెరుగుదలగా మారుతుంది. భవిష్యత్తు అంచనాల్లో మరో ప్రమాదం డిప్లేషన్ ముప్పు. ధరలు ఇంకా పడిపోతాయన్న అంచనాతో వినియోగదారులు కొనుగోళ్లను వాయిదా వేస్తే ఆర్థిక చక్రం మందగిస్తుంది. ఇది జపాన్ అనుభవం చూపినట్లుగా దీర్ఘకాల ఆర్థిక స్థబ్దతకు దారి తీసే ప్రమాదం కలిగిస్తుంది. భారతదేశం ఆ స్థితికి చేరకుండా ఉండాలంటే డిమాండ్‌ను చైతన్యవంతం చేసే విధానాలు అత్యంత అవసరం. భవిష్యత్తు దృశ్యాన్ని పరిశీలిస్తే 1.33% రిటైల్ ద్రవ్యోల్బణం ఒక తాత్కాలిక దశ మాత్రమే కావచ్చని అర్థమవుతుంది. ఇది స్థిరమైన విజయం కాదు. ఇది ఒక హెచ్చరిక. ఈ హెచ్చరికను విధాన పరంగా సరిగ్గా అర్థం చేసుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ సమతుల్య వృద్ధి దిశగా అడుగులు వేయగలదు. రైతు ఆదాయం, ఉపాధి, వినియోగ డిమాండ్, పెట్టుబడుల మధ్య సమతుల్యత సాధించినప్పుడే భవిష్యత్తులో ద్రవ్యోల్బణం దేశ ఆర్థిక ఆరోగ్యానికి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

భారత ఆర్థిక వ్యవస్థ 2050 నాటికి చేరాల్సిన దిశను అర్థం చేసుకోవాలంటే డిసెంబర్ 2025లో నమోదైన 1.33% రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ఒక సంకేత బిందువుగా పరిగణించాలి. ఈ సంఖ్య తక్షణంగా స్థిరత్వాన్ని సూచించినప్పటికీ, దీర్ఘకాలంలో ఆర్థిక శక్తిని నిర్మించడానికి సరిపడే డిమాండ్ ఉందా అనే ప్రశ్నను ముందుకు తెస్తుంది. 2026 నుంచి ప్రారంభమయ్యే కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా తక్కువ ద్రవ్యోల్బణం--మందగించిన వినియోగం అనే ద్వంద్వ పరిస్థితిని ఎదుర్కొంటుంది. వినియోగ వృద్ధి బలహీనంగా కొనసాగితే ఉత్పత్తి పెట్టుబడులు పరిమితమవుతాయి. పెట్టుబడులు పరిమితమైతే ఉపాధి సృష్టి మందగిస్తుంది. ఈ పరిణామాలు దీర్ఘకాల వృద్ధికి ఆటంకంగా మారతాయి.

2030 నుంచి 2035 మధ్యకాలంలో వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు మళ్లీ కేంద్రబిందువుగా మారుతుంది. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల ఉత్పత్తి ఒడిదుడుకులు పెరుగుతాయి. ఈ పరిస్థితి ఆహార ధరల్లో ఆకస్మిక మార్పులకు దారి తీస్తుంది. ఈ దశలో ధరల స్థిరత్వం కోసం నిల్వలు, సరఫరా గొలుసులు, స్థానిక మార్కెట్ల బలోపేతం కీలకంగా మారతాయి. వ్యవసాయ ఆదాయాలు పెరిగితే గ్రామీణ వినియోగం బలపడుతుంది. గ్రామీణ వినియోగం బలపడితే ఆర్థిక వ్యవస్థకు విస్తృత ఆధారం ఏర్పడుతుంది.

2035 నాటికి పట్టణీకరణ వేగం గణనీయంగా పెరుగుతుంది. పట్టణ సేవల రంగం విస్తరిస్తుంది. విద్య, ఆరోగ్యం, నివాసం, రవాణా వంటి రంగాల్లో ఖర్చులు పెరుగుతాయి. ఈ ఖర్చుల పెరుగుదల కోర్ ద్రవ్యోల్బణాన్ని 4% నుంచి 5% మధ్య స్థిరపరిచే అవకాశాన్ని కలిగిస్తుంది. ఈ దశలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో ఆర్‌బీఐ పాత్ర మరింత సున్నితంగా మారుతుంది. అధిక వడ్డీ రేట్లు వృద్ధిని అణిచివేయగలవు. తక్కువ వడ్డీ రేట్లు ధరల ఒత్తిడిని పెంచగలవు. ఈ సమతుల్యతే 2050 విజన్‌లో కీలక అంశంగా నిలుస్తుంది. 2040 దశకంలో భారత ఆర్థిక వ్యవస్థ జనాభా మార్పుల ప్రభావాన్ని తీవ్రంగా అనుభవిస్తుంది. పని చేసే వయసు గల జనాభా వాటా తగ్గడం ప్రారంభమవుతుంది. వృద్ధ జనాభా వాటా పెరుగుతుంది. ఈ పరిణామం ప్రభుత్వ వ్యయాలను పెంచుతుంది. ఆరోగ్యం, సామాజిక భద్రత, పెన్షన్లపై ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. ఈ ఖర్చులను సమర్థంగా నిర్వహించకపోతే ప్రభుత్వ అప్పుల భారం పెరుగుతుంది. అప్పుల భారం పెరిగితే ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ దశలో ద్రవ్యోల్బణం 5%కు పైగా వెళ్లే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుంది.

2040 నుంచి 2045 మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని అందించేది ఉత్పాదకత. పరిశ్రమలు సాంకేతికత ఆధారంగా ఉత్పాదకతను పెంచగలిగితే ధరల ఒత్తిడి నియంత్రణలో ఉంటుంది. ఉత్పాదకత పెరగకపోతే జీతాల పెరుగుదల ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. ఈ దశలో ద్రవ్యోల్బణ నియంత్రణకు కేవలం ద్రవ్య విధానం సరిపోదు. నిర్మాణాత్మక సంస్కరణలు తప్పనిసరిగా మారతాయి.

2045 నుంచి 2050 మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి దశలోకి ప్రవేశించాలంటే ద్రవ్యోల్బణం సామాజిక న్యాయానికి అనుసంధానమవ్వాలి. అధిక ఆదాయ వర్గాలకు పరిమిత ద్రవ్యోల్బణ ప్రభావం ఉంటుంది. తక్కువ ఆదాయ వర్గాలకు స్వల్ప ధరల పెరుగుదల కూడా జీవన భారంగా మారుతుంది. ఈ అసమానతలను తగ్గించకపోతే ఆర్థిక వృద్ధి సంఖ్యలకే పరిమితమవుతుంది. వినియోగం అసమానంగా కొనసాగుతుంది. ధరల ఒత్తిడి కూడా అసమానంగానే ఉంటుంది. 2050 విజన్ డాక్యుమెంట్ దృష్టిలో భారత ఆర్థిక వ్యవస్థ లక్ష్యం కేవలం 4% ద్రవ్యోల్బణాన్ని సాధించడం కాదు. ద్రవ్యోల్బణం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే స్థాయిలో నియంత్రితంగా ఉండాలి. రైతు ఆదాయం స్థిరంగా పెరగాలి. పట్టణ ఉపాధి నాణ్యత మెరుగుపడాలి. పరిశ్రమల ఉత్పాదకత పెరగాలి. ప్రభుత్వ వ్యయాలు ఉత్పాదక పెట్టుబడుల వైపు మళ్లాలి. ఈ అన్ని అంశాలు సమతుల్యంగా అమలయ్యే స్థితిలోనే 2050 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ స్థాయిలో స్థిరమైన శక్తిగా అవతరిస్తుంది. డిసెంబర్ 2025లో నమోదైన 1.33% రిటైల్ ద్రవ్యోల్బణం ఈ దీర్ఘ ప్రయాణానికి ఒక హెచ్చరిక సూచికగా నిలుస్తుంది. తక్కువ ద్రవ్యోల్బణాన్ని విజయంగా భావించడంలోనే కాకుండా, దాని వెనుక ఉన్న డిమాండ్ బలహీనతను గుర్తించి విధానాలు రూపొందించ గలిగితేనే 2050 విజన్ వాస్తవ రూపం దాలుస్తుంది. ఆ దిశగా భారత ఆర్థిక వ్యవస్థ అడుగులు వేస్తే ద్రవ్యోల్బణం భయంకరమైన సమస్యగా కాకుండా సమతుల్య వృద్ధికి మార్గదర్శకంగా మారుతుంది.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

చమురు సంక్షోభంలో భారత్ అమెరికా ఆంక్షలతో విలవిల

ప్రపంచ వ్యవహారాల్లో చమురు ఎంత ప్రముఖ స్థానం వహిస్తుందో, దానితో సాగే ధరల ఒడుదుడుకులు రాజకీయాలపై చూపే ప్రభావాన్ని చూస్తే స్పష్టమవుతుంది. బ్రూనై, కతార్, అజర్బైజాన్ వంటి చిన్న దేశాలు కూడా తమ భూగర్భంలో దాచి ఉంచిన ఈ నల్లసంపద వల్ల ప్రపంచంలో గుర్తింపును పొందాయి. కానీ ఈ సంపద వారికి నిజమైన స్థిరత్వాన్ని ,శాంతిని కల్పించిందా అనేది ఓ పెద్ద ప్రశ్నగా మిగిలింది. మరోకవైపు, భారతదేశం వంటి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు, చమురు అనేది అత్యవసర మైనది. కానీ ఎక్కువ శాతం దిగుమతి పైనే ఆధారం. ఈ ఇంధన కొరత మన ఆర్థిక విధాన రూపకర్తల ముందు నిరంతరం ఒక సవాలుగా నిలుస్తుంది.

భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో మూడవ అతిపెద్ద చమురు వినియోగదారు.ప్రతి రోజూ దాదాపుగా 50 లక్షల బ్యారెళ్లకు పైగా దిగుమతి అవసరం ఉంటుంది. ఇది మన మొత్తం వినియోగంలో 80 శాతం కంటే ఎక్కువ. మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ మరియు రవాణా వ్యవస్థ విస్తరణకు అనుగుణంగా ఈ డిమాండ్ మరింత పెరగనున్నది. ఈ పరిస్థితి మన ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. అంతర్జాతీయ చమురు ధరల హెచ్చుతగ్గులకు అనుగుణంగా... చాలా సున్నితంగా మన దేశం కూడా విధిగా నడుచుకోవాలి. ప్రతి డాలర్ ధర పెరుగుదల లేదా తగ్గుదల మన వాణిజ్య లోటు, రూపాయి విలువ మరియు ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావాన్ని చూపుతుంది.

2026 ప్రారంభంలో, అంతర్జాతీయ చమురు మార్కెట్ మార్పుల సంకేతాలు కనిపిస్తున్నాయి. వెనిజులాలలోని రాజకీయ మార్పు, ఇరాన్ మరియు రష్యాలపై పరిమితులు సడలడం వంటి అంశాలు చమురు సరఫరాను పెంచి, ధరలను ఒత్తిడికి లోను చేయగలవు. కొందరు విశ్లేషకులు బ్యారెలుకు 55 డాలర్ల స్థాయికి ధరలు క్రిందకు పడిపోతాయాని అంచనా వేస్తున్నారు. అలా నిజంగా జరిగితే భారతదేశానికి ఒక పెద్ద ఆర్థిక ఊరటగా ఉంటుంది. ప్రస్తుతం మన దేశం ఒక బ్యారెలుకు, సుమారు 70 డాలర్లు చెల్లిస్తుంది. నిజంగా ఆయిల్ ధరలు కుప్పకూలినప్పుడు, ప్రతి బ్యారెలుకు కేవలం ఒక డాలర్ ధర తగ్గినా, రోజుకు 50 లక్షల బ్యారెళ్ల దిగుమతి భారం తగ్గుతుంది. సంవత్సరానికి లక్షల కోట్లు ఆదా అవుతాయి. ఈ పొదుపు స్థూల ఆర్థిక స్థిరత్వానికి, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ద్రవ్యోల్బణ నియంత్రణకు దోహదపడుతుంది.

కానీ, ఈ హఠాత్తు అవకాశాన్ని మనం శాశ్వతమైన పరిష్కారంగా భావించకూడదు. చమురు మార్కెట్లు ఎప్పుడూ అస్థిరంగానే ఉంటాయి.అలాగే అంతర్జాతీయ రాజకీయ ఉద్భతాలతో మార్పు చెందుతూ ఉంటాయి. ఇటీవలి చరిత్ర చూస్తే, 2014లో బ్యారెలుకు 140 డాలర్లు నుండి 2016లో 30 డాలర్లకు కిందకు పడిపోయాయి, మనం సంతోషం పడే లోపే మళ్లీ ఒక్కసారిగా 100 డాలర్ల పైకి ఎగసిపడిన అనుభవాలు మనకు ఉన్నాయి. అందువల్ల, తాత్కాలిక ధరల తగ్గుదలను స్వాగతించనా,మనకంటూ ఒక దీర్ఘకాలిక వ్యూహం అవసరం.మన ఆధారపాటును తగ్గించడంపై దృష్టి పెట్టాలి.

ఇక్కడే చమురు సంపద యొక్క విరుద్ధార్థం మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. మధ్యప్రాచ్యం, వెనిజులా లేదా రష్యా వంటి దేశాల చరిత్రలను చూస్తే, ఈ "నల్లబంగారం" తరచూ రాజకీయ అస్థిరత, విలాసవంతమైన వ్యయం మరియు అంతర్జాతీయ వివాదాలకు దారి తీసింది. సంపద నిర్వహణలో సృజనాత్మకత,సమగ్ర సూత్రదృష్టి లేకపోవడం ఈ దేశాలను "చమురు శాపానికి" గురి చేసింది. భారతదేశం చమురు సంపదలో దరిద్రంగా ఉండటం, ఒక విధంగా, ఈ రకమైన రాజకీయ-ఆర్థిక చిక్కుల నుండి తప్పించుకున్నందుకు అదృష్టంగా కూడా భావించవచ్చు. ఇది మనల్ని వివేకం మరియు ఇనోవేషన్తో ఆర్థిక వ్యవస్థను నిర్మించే బాధ్యత వహించేలా చేసింది.

అందువల్ల, భారతదేశం యొక్క ప్రాథమిక లక్ష్యం చమురు ధరలలో తాత్కాలిక హెచ్చుతగ్గుల నుండి లాభం పొందడం మాత్రమే కాక, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు వేగవంతమైన మార్పుకు ప్రాధాన్యత ఇవ్వడం కూడా అయి ఉండాలి. చైనా సౌర మరియు జలవిద్యుత్ శక్తి వైపు వేగంగా ముందుకు సాగడం గమనించదగ్గ అంశం. భారతదేశం సోలార్ మిషన్ వంటి చొరవలతో ఈ దిశలో పయనిస్తోంది, కానీ దీనికి మరింత వేగం మరియు వ్యూహాత్మక నిశ్చయం అవసరం ఉంది.

చివరిగా, 2026లో చమురు ధరలు తగ్గే అవకాశం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక అవసరమైన ఊపు నివ్వగలదు. ఈ పరిస్థితిని మనం ఒక వరంగా భావించి, మన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించుకోవాలి. అధిక దిగుమతి ఖర్చు వల్ల కలిగే ఆర్థిక భారాన్ని తగ్గించిన ఈ సమయంలో, సంచిత పొదుపును పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల పెట్టుబడి, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం మరియు శక్తి సామర్థ్యత పెంపుదల వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. భవిష్యత్తు యొక్క స్థిరమైన మరియు స్వావలంబన ఆర్థిక వ్యవస్థను నిర్మించే దిశగా ఈ అవకాశాన్ని మార్చుకోవడంలోనే మన నిజమైన విజయం నిలుస్తుంది. చమురు శాపం నుండి బయటపడి, సౌరశక్తి వంటి నిర్మలమైన శక్తి వైపు మారడమే ఈ శతాబ్దపు అతిపెద్ద సవాలు మరియు అవకాశం కూడా.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

దళిత కవిత్వ దండోరా 'ఎండ్లూరి'

తెలుగు దళిత కవిత్వంలో చెరగని సంతకం ఆచార్య ఎండ్లూరి సుధాకర్. తన కలం నుండి నెత్తురసొంటి కవిత్వాన్ని పలికించిన యుద్ధభేరి. సామాజిక విముక్తే ధ్యేయంగా కలం ఝుళిపించిన సాహితీసేనాని. మహాకవి గుర్రం జాషువా వారసుడిగా ఈ సమాజంలోని సామాజిక అసమానతలను నిలదీశాడు. లోతైనా తాత్విక గాఢతను కవిత్వంలో అలవోకగా పలికించిన శైలి తన సొంతం. కారంచేడు, చుండూరు మారణహోమాల మీదుగా ధ్వజమెత్తిన దళిత ధర్మాగ్రహ దండోరా ఎండ్లూరి. ఆంగ్ల సాహిత్య విమర్శకుడు టెర్రీ ఈగల్ టన్ అన్నట్టు "శుద్ధ సాహిత్యమంటూ ఏదీ ఉండదు. అది రాజకీయార్థిక, సామాజిక పరిణామాలతో ముడిపడి ఉంటుంది." అలాగే ఎండ్లూరి కవిత్వం కూడా అలంకార, చంధో ప్రయోగాల మ్యాజిక్ మాత్రమే కాదు, గుండెను మండించగల ఇంధనం. మూడువేల యేండ్లుగా ఊరికి దూరంగా నెట్టబడిన కుట్రల మీద సంధించిన అణ్వస్త్ర ప్రయోగం.

1990 దశకంలో దళిత కవిత్వాన్ని ఉగ్రూతలూగించిన మద్దూరి, కలేకూరి వంటి కవుల్లో భిన్నమైన స్వరం ఎండ్లూరి. తెలుగు సాహిత్యానికి దళిత్ ఈస్తటిక్స్‌ను జతచేసిన కవితా ప్రవాహఝరి ఆచార్య ఎండ్లూరి సుధాకర్. ఎండ్లూరి అంటే వర్తమానం, నల్లద్రాక్షపందరి, అటజెనికాంచె, వర్గీకరణీయం, గోసంగి, కొత్తగబ్బిలం, మల్లెమొగ్గలగొడుగు మాదిగకథలు. ఈ రచనలతో గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఎండ్లూరి పేరు తెలుగు సాహిత్యంలో ఒక చెరగని ముద్ర. ఆయన వాక్యం గతానికి వర్తమానానికి ఎడతెగని సంభాషణ. అతని అక్షరాల్లో అంటరాని వెలివాడలు గర్జించే డప్పుల దరువులై మార్మోగాయి. యుద్ధభేరిని మ్రోగించి సాహిత్యంలో ఒడవని లడాయిని చేశాయి. న్యాయం కోసం వేలయేండ్ల అధర్మాలపై నిప్పుల జమిడికై నిలిచాయి. అందుకే "నాది హిందూ నాగరికత కాదు, నాది చిందూ నాగరికత" అని ఆత్మగౌరవంతో ప్రకటించాడు. దళితసాహిత్యాన్ని పదునెక్కించిన అతికొద్దిమంది కవుల్లో విలక్షణ కంఠస్వరం కలిగినవాడు ఎండ్లూరి.

అందుకే ఎండ్లూరి ఉద్యమకవి. బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిగా, కథకునిగా, పరిశోధకునిగా, అనువాదకునిగా ఎండ్లూరి చేసిన కృషి అసామాన్యమైంది. ఒకవైపు సృజనకారునిగా తన వంతు పాత్రను పోషిస్తూనే సామాజిక ఉద్యమాలకు అండగా నిలిచారు. నిజామాబాద్ పాముల బస్తీలో పుట్టినా హైదరాబాదే తన ఆత్మగా జీవించారు. ఉద్యోగరీత్యా రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయం నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దాకా కొనసాగిన తన అధ్యాపకత్వంలో అనేకమంది విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దారు. పరిశోధకులుగా ఎదిగేందుకు మార్గదర్శనం చేశారు. ముఖ్యంగా దళిత సాహిత్యం ఉధృతంగా వెలువడిన తొంభయవ దశకంలో ఎండ్లూరి విస్తృతంగా రాశారు. అలా రాసినతనం నుండే తనకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. ఆయన రాసిన కొన్ని కవితలు ఇప్పటికీ అభిమానులు మరిచిపోలేదు. ఆయన పేరు వినబడితే చాలు, ఎండ్లూరి మార్క్ కవితలను గుర్తు చేసుకుంటూనే ఉంటారు. అట్లా ఉమ్మడి రాష్ట్రంలోనే ఆయన కవిత్వానికి వందలాదిమంది అభిమానులు ఏర్పడడం గమనార్హం. తన కోసం కాకుండా జాతికోసం నిలబడి సామాజిక న్యాయం కోసం కవిత్వం రాయడం వల్ల ఎండ్లూరికి శత్రువుల తాకిడి కూడా పెరిగింది. అర్ధరాత్రి, అపరాత్రి తేడాలేకుండా ఫోన్‌ల బెదరింపులను ఎన్నో ఎదుర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తనలోని కవి మాత్రం వెనుకడుగు వేసిందే లేదు.

వర్గీకరణ ఉద్యమానికి ఎండ్లూరి కవిత్వం ఒక 'మార్చ్‌ఫాస్టింగ్' గీతం అంటే అతియోక్తికాదు. మూడు దశాబ్దాల సామాజిక న్యాయపోరాట ఉద్యమానికి బలమైన సాహిత్య మద్దతును అందించిన ఘనత ఎండ్లూరిదే. మాదిగ కవుల పెద్దన్నగా, రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ నిర్వహించిన అన్ని పోరాటాలకు తలలో నాలుకలా నిలిచి అక్షరకవాతు చేశాడు. గల్లీ నుండి ఢిల్లీ వరకు తన అక్షరాలతో దళితేతరుల మద్దతు కూడగట్టాడు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నెలరోజుల పాటు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షలో ఎండ్లూరి కవిత్వం పోరాట నినాదంగా మారిందంటే ఆ కవిత్వానికున్న శక్తిని అర్థం చేసుకోవచ్చు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా ఎండ్లూరి రచించిన దీర్ఘకవిత "వర్గీకరణీయం"ఒక గొప్ప తాత్విక బలాన్ని అందించింది.

శేరిలింగంపల్లికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరగాలి

జోనల్ కమిషనర్ శ్రీజన

శేరిలింగంపల్లి, జనవరి 20 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీజన ఆయా విభాగాల అధికారులతో కలిపి మంగళవారం సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటి నుంచి నేరుగా చెత్త తీసుకునే కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ లో భాగంగా ప్రతిషాపు యజమాని ఆటో డ్రైవర్ కు విధిగా చెత్తను ఇచ్చే విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణలో మెరుగైన ఫలితాలను రాబట్టడానికి వీలైనంత మేర అవగాహనా కార్యక్రమాలనుసైతం నిర్వహించాలని సూచించారు. దీనికోసం క్షేత్రస్థాయిలో చేపట్టే పారిశుద్ధ్య చర్యలే కీలక భూమికను, క్రియాశీల పాత్రను పోషిస్తాయని జెడ్సి శ్రీజన అభిప్రాయపడ్డారు. శేరిలింగంపల్లి జోన్? పరిధిలో ప్రధానంగా పరిశుభ్రత విషయంలో చేపట్టాల్సిన విధివిధానాలను ఆమె సవివరణాత్మకంగా తెలియజేశారు. ఐటి పరిశ్రమలకు శేరిలింగంపల్లి జోన్? వేదికగా ఉన్నందున ఆ స్థాయిలోనే రహదారుల నిర్వహణ జరగాలని, క్షేత్రస్థాయి సిబ్బంది చేపట్టే చర్యలే ఇందుకు ప్రధానమన్నారు. స్వీపింగ్? అనంతరం వెంటనే చెత్త కుప్పలు తొలగించాలని, ప్లై ఓవర్?లపై మట్టి ఇసుక ఇతర వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. సర్కిల్ ఉప కమిషనర్ స్థాయినుంచి కింది స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని, లోటు పాట్లను సవరించుకుంటూ చక్కని పరిసరాలు నెలకొనేలా చూడాలన్నారు. ప్రతి షాపు మరియు కమర్షియల్ ఏరియా దుకాణాలలో డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని, లేనియెడల పెనాల్టీ విధిస్తామని ఆయా షాపులో యజమానులకు సూచనలు చేయాలని జెడ్సి తెలిపారు. ఈ సమావేశంలో మూడు జోన్ లకు సంబధించిన జోనల్ కమిషనర్ లు హేమంత్ బోర్ఖడే, అపూర్వ చౌహాన్, సందీప్ కుమార్, ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు, రాంకీ సిబ్బంది ఉన్నారు.

అంతర్ జిల్లా మహిళా దొంగల ముఠా అరెస్ట్

8 తులాల 8 గ్రాములు 50 తులాల వెండి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం

నకిలీ బంగారం ఏరా అమాయక మహిళలే లక్ష్యంగా దొంగతనాలు

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా

వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 20 (జనం సాక్షి): అమాయక మహిళలే లక్ష్యంగా దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న అంతర్ జిల్లా మహిళ దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా తెలియజేశారు. ఈ మేరకు ఎస్పి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూవికారాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా అమాయక మహిళలే లక్ష్యంగా చేసుకొని, వారి దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న ముగ్గురు పాత నేరస్తుల ముఠాను జిల్లా సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి 8 తులాల 8 గ్రాముల బంగారం 50 తులాల వెండి మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వీరంతా ఇతర వికారాబాద్ జిల్లా త పాటు జిల్లాలో దొంగతనాలకు పాల్పడినట్లు తెలియజేశారు.జిల్లాలోని ధారూర్, వికారాబాద్ టౌన్ పరిగి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా మహిళలను మోసం చేసి బంగారం దొంగిలించిన ఘటనలు నమోదు కావడంతో, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఈ కేసులను సీరియస్?గా పరిగణించారు. నిందితులను తక్షణమే పట్టుకోవాలని జిల్లా సి సి ఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.ఎస్పీ ఆదేశాల మేరకు, సి?సి?ఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఆధ్వర్యంలోని బృందం రంగంలోకి దిగింది. సీసీటీవీ ఫుటేజీలు, టెక్నికల్ ఆధారాలు మరియు నేరం జరిగిన తీరును విశ్లేషించి, పక్కా సమాచారంతో ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో వేముల లక్ష్మి రామారావు నగర్ బాలానగర్. చెల్లె నర్సమ్మ కిస్మత్ పూర్ రాజేంద్రనగర్. బండారి అనిత శివ శంకర్ నగర్ కాలనీ ఫతేపూర్ బాలానగర్ సంతోష్ నగర్ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలియజేశారు. వీరు కేవలం వికారాబాద్ జిల్లాలోనే కాకుండా నారాయణపేట జిల్లాలోని మద్దూర్, కోస్గి మరియు నరసనపేట టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ, గతంలో సైబరాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, రాచకొండ మరియు జగిత్యాల జిల్లాల్లో సుమారు 28 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు వివరించారు.ఈ ముఠా ప్రధానంగా ఒంటరిగా ఉన్న, వయసు పైబడిన అమాయక మహిళలనే టార్గెట్ చేస్తారన్నారు. నకిలీ బంగారం ఎర వేసి రద్దీగా ఉండే మార్కెట్లు లేదా నిర్మానుష్య ప్రదేశాల్లో మహిళలను ఎంచుకుంటారు. వారి ముందు నకిలీ బంగారు బిస్కెట్లు, రాడ్లు లేదా బంగారు రంగు పూసిన రాళ్లను పడవేస్తారు లేదా తమకు దొరికినట్లు నటిస్తారని వివరించారు. తమకు బంగారం దొరికిందని నమ్మబలికి, దీనిని మనం పంచుకుందాం" అని బాధితురాలిని నమ్మించి మాటల్లో పెడతారు. ఆ నకిలీ బంగారాన్ని బాధితురాలికి ఇచ్చి, ఆమె మెడలో ఉన్న అసలైన బంగారు గొలుసులు, కమ్మలు తీసుకుంటారని వివరించారు. మత్తు మందు ప్రయోగిస్తూ కొన్ని సందర్భాల్లో బాధితురాలిని మాటల్లో పెట్టి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మత్తు మందు ప్రయోగించి వారు స్పృహ కోల్పోయాక బంగారం దొంగిలిస్తారు.జిల్లాలో ప్రధానంగా ధారూర్ లో 22 నవంబర్ (2025) నా కంది లక్ష్మమ్మ అనే మహిళ కూరగాయల మార్కెట్ వద్ద ఉండగా, ఆమెకు నకిలీ బంగారు రాడ్ చూపించి, ఆమె మెడలోని 1.8 తులాల బంగారం (గొలుసు, కమ్మలు, మ్యాట్నీలు) కాజేసి మోసం చేశారు.వికారాబాద్ 30 నవంబర్(2025) న బాసుపల్లి సత్యమ్మను సుబాష్ నగర్ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి, బంగారు రాయి లాంటి వస్తువు చూపించి, ఆమెకు తెలియకుండానే మత్తు మందు ప్రయోగించి 2 తులాల గొలుసును దొంగిలించారు. పరిగి జనవరి5.2026) పోమల ఈశ్వరమ్మను వెంబడించి, రోడ్డుపై పర్సు దొరికినట్లు నాటకమాడి, అందులో 5 తులాల బంగారం ఉందని నమ్మించారు. ఆ నకిలీ బిస్కెట్ ఆమెకు ఇచ్చి, ఆమె వద్ద ఉన్న 1 తులం గొలుసు, 3 గ్రాముల కమ్మలు తీసుకొని ఉడాయించారు. అపరిచితులు ఎవరైనా బంగారం దొరికిందని చెప్పినా, లేదా మాయమాటలు చెప్పి దగ్గరకు వచ్చినా నమ్మవద్దు. ముఖ్యంగా మహిళలు మార్కెట్లు, ప్రయాణాల్లో ఉన్నప్పుడు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి. అనుమానం వస్తే వెంటనే డయల్ 100 కి లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

డిఎస్పీ యాదయ్య

తాండూరు జనవరి 20(జనంసాక్షి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని డిఎస్పి యాదయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా మంగళవారం తాండూరు లోని విలేమున్ చౌరస్తాలో డిఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి యాదయ్య మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా వాహనం నడిపే వ్యక్తికి మరియు అతని ఎదుట వచ్చే వ్యక్తికి కూడా ప్రమాదం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా ఘోర ప్రమాదాలు మరియు ప్రాణాష్టం వాటిల్లుతుందని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతిఓక్కరు మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలి

కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కాప్రా, జనవరి 20 (జనంసాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని, జిహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం చర్లపల్లి డివిజన్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో ఆమె ముచ్చటించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రిలో మందుల నిల్వలను తనిఖీ చేశారు. పేద ప్రజలకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి వసతి మరియు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి హితవు పలికారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న వయసులోనే వరుస విజయాలు

వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ యువతకు ఆదర్శం

పేదరికంలో నుండి పుట్టిన సరస్వతి పుత్రుడు

కొండుర్గు (జనంసాక్షి) : బురదలోంచి కమలం వికసించినట్టు పేదరికంలో నుండి పుట్టిన సరస్వతి పుత్రుడు అని చెప్పవచ్చు రంగారెడ్డి జిల్లా కొందుర్గు గ్రామానికి చెందిన కారుకొండా సుధాకర్ వరుస విజయాలతో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టుదలతో శ్రమించి ఒకదాని తర్వాత ఒకటిగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నారు.

సుధాకర్ ప్రస్థానం ఇలా మొదలైంది : పంచాయతీ రాజ్ శాఖ (2019) తొలుత 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై, నందిగామ మండలంలో ఏడాది పాటు సేవలందించారు. అనంతరం రెవెన్యూ శాఖ (2019-2022) రెవెన్యూ శాఖలో వీఆర్వోగా ఎంపికై రాజాపూర్ మండలంలో రెండు సంవత్సరాల పాటు పనిచేశారు. విద్యాశాఖ (2022--2026) తన విద్యాప్రస్థానాన్ని కొనసాగిస్తూ విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు సంవత్సరాల పాటు విధులు నిర్వహించారు. గ్రూప్ 3 ఫలితాల్లో (ఆర్థిక శాఖ) ప్రస్తుతం సుధాకర్ ఆర్థిక శాఖలో సీనియర్ అకౌంటెంట్‌గా ఎంపిక పొంది, వికారాబాద్ జిల్లా పరిగిలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకే వ్యక్తి ఇన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై స్థానికులు మరియు అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణ, నిరంతర కృషి ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన నిరూపించారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యత

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్

కొడంగల్, జనవరి20 (జనంసాక్షి) : పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఆరోగ్యం శాఖకు, వారి కుటుంబానికి ఎంతో విలువైనదని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపినారు. కేవలం జిల్లా కేంద్రానికే పరిమితం కాకుండా, అన్నీ పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో, జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు పరిగి సబ్ డివిజన్, తాండూర్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు, హోంగార్డ్స్ అధికారులకు కోడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన "మెగా ఉచిత వైద్య శిబిరాన్ని" ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఈసిజి, 2డి ఎకో, రాండమ్ బ్లడ్ షుగర్ , బీపీ, బీఎంఐ వంటి నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది. అవసరమైన వారికి ఉచిత మందుల పంపిణీతో పాటు, తదుపరి చికిత్స కోసం స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా రిఫరల్ సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్,డిప్యూటీ డీఎంహెచ్ వో రవీందర్ యాదవ్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,తాండూర్ డీఎస్పీ యాదయ్య,పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, తాండూర్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, కరణ్ కోట్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, కొడంగల్‌గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ చంద్ర ప్రియా, జిల్లా పోలీస్ ప్రసిడెంట్ ఆశోక్, పరిగి, కొడంగల్ డివిజన్‌ల ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, హోం గార్డ్స్ అధికారులు, మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లు వెంకటేష్, సంజయ్ వివేక్, డ్రగ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, డ్రగిస్ట్ కెమిస్ట్ ఇంచార్జ్ శ్రీనివాస్, వారి బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా సత్కరించారు. తమ కుటుంబాల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నందుకు పోలీస్ సిబ్బంది ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

రెండేళ్లలోనే 200 కోట్ల రూపాయలతో పురోగతి

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 78 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఇబ్రహీంపట్నం, జనవరి 20(జనం సాక్షి) : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై గల కట్ట మైసమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న ప్రత్యేక పూజలు చేసి అక్కడ నిర్మిస్తున్న ఆలయ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట సుందరీకరణ 18 కోట్ల రూపాయలతో పనులను, ఇబ్రహీంపట్నం నుండి నాగన్ పల్లి రోడ్డు వరకు నాలుగు లైన్ ల రోడ్డు పనులకు 60 కోట్ల రూపాయలతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో బిఆరఎస్ ప్రభుత్వ పాలనలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలోనే 200 కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా మార్చడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గల సబ్ రిజిస్టర్ కార్యాలయం ఇక్కడే ఉంటుందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రిజిస్టర్ కార్యాలయాలు ప్రారంభిస్తున్న తరుణంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాలు రిజిస్టర్ కార్యాలయానికి అనుసంధంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మైపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈసి శేఖర్ గౌడ్, జడల రవీందర్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్ రావు, కప్పరి చందు, జలమోని రవీందర్ ముదిరాజ్, చెనమోని యాదగిరి, పప్పె శ్రీను, ఇందూరి శ్రీనివాస్, శశిధరప్ప, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాల వారధి జనంసాక్షి

ప్రజాప్రయోజనాల కోసమే ఈ పత్రికలో వార్తా కథనాలు

- శ్రీనివాసపురం గ్రామ ఎన్నారై యలమంచిలి శ్రీనివాస చౌదరి
- శ్రీనివాసపురంలో ఘనంగా జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరణ

జనంసాక్షి విలేకరులను అభినందించిన పలువురు

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 20 (జనంసాక్షి) : ప్రజా ప్రయోజనాల కోసమే పాటుపడుతున్న జనంసాక్షి తెలుగు దినపత్రిక ప్రజల నుంచి విశేష ఆదరణ చూరగొన్నదని, తెలంగాణ ఉద్యమ పత్రికగా ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగస్వామ్యమైనదని ఎన్నారై శ్రీనివాస చౌదరి కొనియాడారు. ప్రజా సమస్యలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకొస్తూ విశ్వసనీయత చాటుకున్నదని అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాసపురంలో జనంసాక్షి తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర కీలకమని, అందులో సామాజిక బాధ్యతతో జనంసాక్షి వార్తా కథనాలు రావడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ఎన్నికలు ఏవైనా ఓటరు నాడీని పట్టుకోవడంలో జనంసాక్షి సర్వే సంస్థ అగ్రభాగాన నిలిచిందన్నారు. వందకు వంద శాతం ఫలితాలు ముందే వెలువరిచి ఇతర సంస్థలకన్నా సర్వేల్లో వాస్తవరూపం కనబరిచిందని గుర్తుచేశారు. సాధారణ ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా, ఎంపీ ఎన్నికలైనా.. మరేదైనా జనంసాక్షి సర్వే పట్ల జాతీయ స్థాయి నేతలు సైతం ఆసక్తిగా ఎదురుచూసే పరిస్థితులు రావడం వెనుక సంస్థ సిబ్బంది ఎంతో కృషి దాగుందని చెప్పారు. ఇప్పటివరకు వెలువరిచిన సర్వేల్లో ఎప్పుడూ తప్పుకాలేదని, ఈ విషయం జూబ్లీహిల్స్ ఎన్నికలతో మరోసారి రుజువైందన్నారు. హుజూర్‌నగర్ మండలంలోనూ మంచి వార్తలు అందిస్తున్న జనంసాక్షి పాత్రికేయులను శ్రీనివాసచౌదరి అభినందించారు. ప్రజల కోసం పనిచేసే ఇటువంటి పత్రికలను బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చావా వీరభద్రరావు, కట్టా సతీష్ కుమార్, కట్టా గోపి, కట్టా హరీష్, శాఖమూరి పాపారావు, సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జింకల వీరాంజనేయులు, కట్టా రామారావు, సామల నర్సిరెడ్డి, మేదర యలమంద, జింకల శ్రీనివాసు, తుళ్లూరి శ్రీనివాస్, రచ్చ సంజీవగాంధీ, కొల్లూరి ఉపేందర్, అరబండి నాగేశ్వరరావు,కాసాని నరేష్,చల్లా సైదులు,గుంజా రామకృష్ణ, నకిరకంటి అప్పారావు, జింకల వీరబాబు జింకల పెద్ద నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

వీబీజీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ రెడ్డి, పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్

చేవెళ్ల, జనవరి 20 (జనంసాక్షి) మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదల కడుపు నింపే పథకానికి వీబీజీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామేన భీం భరత్ అన్నారు. చేవెళ్ళ మండలం ఆలూరు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మీనాక్షి నటరాజన్ పిలుపుమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబి జి రామ్ జి ఉపాధి హామీ పథకమునకు నిరసనగా రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని ఆలూరు గ్రామంలో పెద్ద ఎత్తున రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర టీయూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహా రెడ్డి అధ్యక్షతనలో చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదల కడుపు నింపే పథకం ఇలాంటి పథకం ప్రపంచంలో ఎక్కడా లేదని అన్నారు. వీబీజీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి వీ బీ జీ రామ్ జీ పేరు మార్పునకు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహనం చేసి నీరసన కార్యాక్రమం చేపట్టారు.

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో, జనవరి 20 (జనంసాక్షి) : జిల్లాలోని జాతీయ రహదారులు, ఇతర ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సమర్థవంతమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆరచవతీతీఎండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, జాతీయ రహదారుల విభాగం, వైద్య, ఆరోగ్య, పీఆర్ తదితర శాఖల అధికారులతో రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితోపాటు జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు రోడ్డు ప్రమాదాలు వాటిని నివారించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న భద్రత పరమైన అంశాలపై మరింతగా దృష్టి సారించాలని ఆదేశించారు. జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని, రహదారులు నిర్మాణాలు, మరమ్మతు చేపట్టే సందర్భంలో స్టాండర్డ్ ఆపరేషన్స్, ప్రొసీజర్కు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి అట్టి ప్రాంతాలను జాతీయ రహదారుల విభాగం అధికారులతో పాటు, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి సందర్శించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై వేగాన్ని కట్టడి చేసేందుకు రాంబల్ స్ట్రిప్స్ అవసరమైన చోట ఏర్పాటు చేయాలని సూచించారు. పెబ్బేరు హైవే పైన మోడల్ స్కూల్ వద్ద, రంగాపురం గ్రామం వద్ద అధిక ప్రమాదాలకు ఆస్కారం ఉన్న నేపథ్యంలో అక్కడ ఫుటోవర్ బ్రిడ్జి ఏర్పాటుకు సిఫారసు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రంగాపురం గ్రామం వద్ద అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రామాపురం గ్రామం వద్ద కూడా యూటర్న్ ప్రమాదకరంగా ఉందని అక్కడ కూడా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా రాంగ్ రూట్లో వచ్చే వారిని కట్టడి చేయాలని సూచించారు. కొత్తకోట హైవే పైన ముమ్మాళ్లపల్లె,అమడబాకుల, పాలెం స్టేజీల వద్ద రోడ్ క్రాసింగ్ ప్రమాదకరంగా ఉందని ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా హైమాస్ట్ లైటింగ్, రాంబుల్ స్ట్రిప్స్, బ్లింకర్స్ లైట్స్, సైన్ బోర్డ్స్, వేసి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో అండర్పాస్ నిర్మాణం చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రమాదకర ప్రాంతాలను పోలీసులు అధికారులతో కలిసి సంయుక్తంగా విజిట్ చేసి ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లే వ్యవస్థపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రమాద ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేటు లో కూడా ఏవైనా ఆసుపత్రులు అందుబాటులో ఉండేలా పరిశీలించాలని డిఎంహెచువతీతీఎ కు సూచించారు. అత్యవసర పరిస్థితిలో వనపర్తి తీసుకురావడానికి సమయం పడుతుంది కాబట్టి ప్రాణాలను కాపాడేందుకు దగ్గర్లోని ఆసుపత్రుల్లో గల అవకాశాలను పరిశీలించాలన్నారు. ఇక వనపర్తి పట్టణంలో ప్రధానంగా ఇబ్బందిగా ఉన్న కూడళ్ళలో రోడ్లపై వేగాన్ని కట్టడి చేసేందుకు రాంబల్ స్ట్రిప్స్ వేయడంతోపాటు ప్రమాదాలను నివారించడానికి మిర్రర్స్ కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాజపేట గ్రామంలో పాఠశాల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆత్మకూరులో చెరువు కట్టపై లైటింగ్ తో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని అదేవిధంగా ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. మదనాపురం బ్రిడ్జి అప్రోచ్ పనులు పూర్తి చేసి బ్రిడ్జిని వినియోగంలోకి తేవాలన్నారు. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

జిల్లాలో రవాణా, పోలీసు శాఖ అధికారులు ట్రాఫిక్ రూల్స్ అమలుపై పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని కాబట్టి తప్పకుండా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించని పక్షంలో జరిమాణాలు విధించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బీ అధికారి దేశ్యా నాయక్, డి సీ ఆర్ బీ డిఎస్పీ బాలాజీ నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

● రాజగోపాల్ పేట ఎస్సై వివేక్

రాజగోపాల్‌పేట, జనవరి 20 (జనంసాక్షి) : వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రాజగోపాల్ పెట్ ఎస్సై వివేక్ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజగోపాల్ పేట్ ఎసచవతీతీఎ వివేక్ ఈ కార్యక్రమంలో పాల్గొని వాహనదారులకు రోడ్డు నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ పేట్ ఎసచవతీతీఎ వివేక్ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేసిన వారవుతారని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులకు సహకరించి ప్రమాద రహిత సిద్దిపేట జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామీణ రోడ్లపై అతివేగంతో వెళ్లడం, ఓవర్ లోడింగ్‌తో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎసచవతీతీఎ వివేక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, వాహనదారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుల చేత "జనం సాక్షి" నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

న్యాల్‌కల్, జనవరి 20 (జనం సాక్షి) : మండలంలోని ముంగి గ్రామ ప్రధాన కూడలి సమీపంలోని శ్రీ సిద్ధి వినాయక ట్రేడర్స్ ఆవరణలో.. మంగళవారం రైతుల చేత "జనం సాక్షి" 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. న్యామతాబాద్ గ్రామ సర్పంచ్ కే.శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో.. ముంగి, గుంజేట్టి, న్యామతాబాద్, తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు "జనం సాక్షి దినపత్రిక" 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. రైతుల సమస్యల కోసం జనం సాక్షి పత్రిక మరింతగా దృష్టి సారించాలని పలు రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు శివ శెట్టి పాటిల్, కిష్టారెడ్డి, వెంకట్, సాంబశివుడు, అనిల్, సుధాకర్, గోపాల్, విజయ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 20 (జనం సాక్షి) : రాబోయే వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లావ్యాప్తంగా పంప్ సెట్లు, పనిచేస్తున్న బోర్?వెల్?ల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. మైనర్ రిపేర్ల కోసం చెక్?లిస్ట్ తయారు చేసి గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాలలో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ బోర్లు, ఇతర నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా జాయింట్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించి సమస్యలు ఉత్పన్నం కాకముందే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

లెస్ ప్లాస్టిక్, లెస్ పేపర్, లెస్ పవర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి

ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని,కార్యాలయాల ఫైల్స్ అన్ని ఈ ఆఫీసు లో ఉండాలని,ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం తగ్గించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగ రావు,మెదక్ ఆర్‌డిఓ రమాదేవి,జిల్లా అధికారులు,

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మండల పరిషత్ అధికారులు, హౌసింగ్ ఏఈలు,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

● నిబంధనలను పాటిస్తేనే ప్రాణ రక్షణ.. సిఐ వెంకటేష్

● సదాశివపేటలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

సదాశివపేట, జనవరి 21 (జనం సాక్షి) : రోడ్డు ప్రమాదాల నివారణను ప్రతి ఒక్కరు వ్యక్తిగత బాధ్యతగా భావించినప్పుడే ప్రమాదలను తగ్గించగలమని సదాశివపేట సిఐ డి.వెంకటేష్ అన్నారు. సదాశివపేట పట్టణంలో " అరైవ్ అలైవ్ "రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని ఆటో డ్రైవర్లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు నిర్ణీత వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రాణ నష్టాలు సంభవిస్తాయని, చిన్నపాటి నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ని గౌరవించడం, వన్ వే నిబంధనాలను పాటించడం, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, పాదాచార్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సియం కప్ - 2025-26 క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు

గద్వాల నడిగడ్డ, జనవరి 20 (జనం సాక్షి) : తెలంగాణ సి.యం. కప్ - 2025-26 క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు సీఎం కప్-2025-26 పోటీలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ,మండల,జిల్లా స్థాయిలో క్రీడలను విజయవంతంగానిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓ, తహసీల్దార్,ఎంఈఓ, పీఈటీలు క్రీడలను నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి,ఒక కమిటీని ఏర్పాటు చేయాలనీ సూచించారు. సీఎం కప్-2025-26 షెడ్యూల్ ప్రకారం,గ్రామ పంచాయతీ స్థాయి పోటీలు జనవరి 17 నుండి 22 వరకు, మండల స్థాయి, మునిసిపాలిటీ స్థాయి పోటీలు జనవరి 28 నుండి 31 వరకు,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలు ఫిబ్రవరి 3 నుండి 5 వరకు,జిల్లా స్థాయి పోటీలు ఫిబ్రవరి 9 నుండి 12 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఫిబ్రవరి 20 నుండి 23 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సి.యం కప్ 2025-26 క్రీడలలో భాగంగా గ్రామ పంచాయతీ క్లస్టర్ స్థాయిలో జనవరి 21 నుంచి 22, 2026 వరకు గద్వాల,ఆలంపూర్ నియోజకవర్గాలలో సీఎం కప్--2025-26 క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో జనవరి 21న గద్వాల నియోజకవర్గంలోని గట్టు,కె.టి.దొడ్డి,మల్దకల్ మండలాలలోను, ఆలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, రాజోలి,మానపాడు మండలాలలోను క్రీడలు జరుగుతాయని తెలిపారు. రెండవ దశలో జనవరి 22న గద్వాల నియోజకవర్గంలోని గద్వాల,ధరూర్ మండలాలలోను, ఆలంపూర్ నియోజకవర్గంలోని ఆలంపూర్, ఉండవెల్లి, ఇటిక్యాల,ఎర్రవల్లి మండలాలలోను క్రీడలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ క్రీడల నిర్వహణలో క్లస్టర్ ఇన్?చార్జీలు, పీడీలు,పీఈటీలు, పీటీఐలు సమన్వయంతో పనిచేసి క్రీడలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో క్రీడా ఆసక్తి పెంచడానికి పెద్ద ఎత్తున క్రీడలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి క్రీడాకారుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్?లైన్ కాపీతో పాటు ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని,రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాంశంలోనే పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయం ఫోన్ నెంబర్లు 9885479896, 9441590842, 9603996900 ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడా అధికారి కృష్ణయ్య,ఎం.పి.డి.ఓ లు, ఏం.ఈ.ఓ లు,పి.ఈ.టిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

చేర్యాల/ధూల్మిట్ట, జనవరి 20 (జనంసాక్షి) : మండలంలోని జాలపల్లి గ్రామపంచాయతీ పాలకమండలి పాఠశాల ఉపాధ్యాయులతో మంగళవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సహా ఉపాధ్యాయ బృందం సర్పంచ్ కమలాకర్ యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను గ్రామపంచాయతీ దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ శక్తి మేర కృషిచేసి పరిష్కరిస్తామని పంచాయతీ పాలకవర్గం హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మద్దూరు మండల మాజీ జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ నారోజు శ్రీనివాస్, పాఠశాల యాజమాన్య కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో రాత్రి తనిఖీలు

● సాయంత్రం నుండి రాత్రి వరకు రికార్డులు తనిఖీ చేసిన డిప్యూటీ సీఈవో

మెదక్, జనవరి 20 (జనం సాక్షి) : కొల్చారం ఎంపీడీవో కార్యాలయంలో 2024- 2025 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వార్షిక రికార్డులను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఆర్.గీత మంగళవారం సాయంత్రం నుండి రాత్రి వరకు తనిఖీ చేశారు. రాత్రి సమయంలో రికార్డులు తనిఖీ చేయడం ఏమిటో తెలియక స్థానికులు సందేహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కొల్చారం ఎంపీడీవోని వివరణ కోవడానికి ప్రయత్నించగా ఆమె ఫోన్లో అందుబాటులోకి రాలేదు.

రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

నారాయణఖేడ్, జనవరి 20 (జనం సాక్షి) : రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గానికి మొత్తం 109 పనిముట్లను అందజేశారు. 21 స్ప్రేయ్యార్లు, 77 బ్రష్ కట్టర్, 3 పవర్ వివర్ 1, రోటవేటర్4,సీడు కం ఫర్టిలైజర్ డ్రిల్ 1, స్ట్రైవ్ బ్యాలెర్1 నారాయణఖేడ్ నియోజకవర్గాలోని రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క రైతు కూడా ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ద్వారా వచ్చే పనిముట్లు నాణ్యమైనవి ఎక్కువ కాలం వాటి పనితనం ఉంటుందని రైతులతో మాట్లాడారు. అనంతరం నారాయణఖేడ్ పట్టణంలోని మార్వాడి గల్లి, నెహ్రూ నగర్, మన్సూన్‌పూర్ ఇందిరా మహిళ శక్తి పథకం కింద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. నాలుగవ తరగతి విఘ్నేష్ , వైష్ణవి ఎంతో చక్కగా చదవడంతో ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించారు. నారాయణఖేడ్ ఏడి నూతన్ కుమార్ వివిధ మండలాల వ్యవసాయ అధికారులు శంకర్, హరీష్ ప్రవర్, వెంకటేశం, హరికృష్ణ, పవన్ చారి, మహేష్ చౌహాన్, అహిషా బేగం రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టు హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

గద్వాల టౌన్, జనవరి 20 (జనంసాక్షి) : మంగళవారం గద్వాల మండల పరిధిలోని కొత్తపల్లి నుండి ఆత్మకూరు వైపుగా వెళ్లే జూరాల ప్రాజెక్టు హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ తో చర్చించి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం కొరకు 121 కోట్లు రూపాయలు మంజూరు అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గద్వాల నుండి ఆత్మకూరు మీదుగా హైదరాబాదు వెళ్లే వారికి 35 కిలోమీటర్ వరకు రవాణా సౌకర్యం తగ్గుతుంది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ బ్రిడ్జి నిర్మించడం వల్ల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతామని అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మా ప్రాంత ప్రజల తరపున సీఎం రేవంత్ రెడ్డికి,ఆర్థికశాఖ మంత్రికి, నీటి పారుదల శాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గద్వాల శాసనసభ్యులు మాట్లాడుతూ మా నడిగడ్డ ప్రాంతంలో కృష్ణానది ప్రవహిస్తున్న ఎలాంటి అభివృద్ధి చెందలేదు. ఈ జూరాల ప్రాజెక్ట్ పై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో హైదరాబాద్ వంటి ఇతర ప్రాంతాలకు ఏ విధంగా అనుసంధానం ఉందో భవిష్యత్తులో ఈ నడిగడ్డ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది అని పేర్కొన్నారు. గతంలో జూరాల ప్రాజెక్టు సందర్శన వచ్చిన నీటిపారుదలశాఖ మంత్రి ఈ ప్రాంతానికి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారని అన్నారు. ఈ నిర్మాణం పనుల్లో భాగంగా ఫోర్ లైన్స్ రోడ్డు అనుసంధానం ఏర్పాటు చేయడం వల్ల గద్వాల నుండి ఇతర రాష్ట్రాలకు అనుసంధానం ఏర్పాటు వల్ల ఈ ప్రాంతాలలోని ప్రజలు అన్ని వ్యాపార రంగాలలో కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం యొక్క ఉద్దేశం బంగారు తెలంగాణ రాష్ట్రంగా వైపుగా

అడుగులు వేసే దిశగా చేస్తుందని సూచించారు. భవిష్యత్తులో గద్వాల ఆత్మకూర్,మక్తల్ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే విధంగా అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతే లక్ష్యం

- అరైవ్ అలైవ్'తో వినూత్న ప్రచారం
- గాలిపటాలు ఎగురవేసిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి

నిర్మల్ రూరల్, జనవరి20 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ప్రతిపాదించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం మంగళవారం నిర్మల్ జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై 'అరైవ్ అలైవ్' నినాదాలు రాసిన గాలిపటాలను ఎగురవేసి ప్రజలకు వినూత్నంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ ఏకైక మార్గమని స్పష్టం చేశారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటించడంతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని మంత్రి సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ చేపడుతున్న ఈ అవగాహన ఉద్యమం ప్రజల్లో మంచి మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు సాంకేతికతతో పాటు అవగాహన కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సాయి కిరణ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కులు పరిశుభ్రంగా ఉండేలా చూడండి

- వరంగల్ పరిధిలోని పార్కులలో క్షేత్ర స్థాయి పరిశీలనలు
- సిఎన్‌డి వ్యర్థాలు తొలగించనందుకు గృహ యజమానికి పెనాల్టీ

వరంగల్ ఎంజీఎం,జనవరి 20(జనంసాక్షి): పార్క్ లు పరిశుభ్రం గా ఉండేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ హార్టికల్టర్ అధికారులను ఆదేశించారు. వరంగల్ పరిధి లోని డాక్టర్స్ కాలనీ పార్క్, టెలికాం పార్క్, క్రిస్టియన్ కాలనీ పార్క్, టి ఆర్ టి పార్క్ లను కమిషనర్ ప్రత్యక్షం గా పరిశీలించి సమర్ధవంతం గా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్క్ లను శుభ్రం గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించి, ములుగు రోడ్డు నుండి ఎం జీ ఏం, ఎం జీ ఏం,నుండి పోచమ్మ మైదాన్, వెంకట్రామ జంక్షన్ వరకు మీడియన్ లను పరిశీలించి, మీడియన్ లలోని గ్యాప్ లలో మొక్కలను నాటాలని అందులో ఉన్న కలుపు మొక్కలను (వీడ్)తొలగించాలని, ఏపుగా పెరిగిన మొక్కలను కత్తిరించి సుందరం గా రూపొందించాలని సూచించారు. టెలికాం పార్క్ సమీపం లో గృహనిర్మాణ వ్యర్థాలు (సి ఎన్ డి) రోడ్డు పై వేయడాన్ని గమనించిన కమిషనర్ సదరు యజమానికి పెనాల్టీ వేయాలని ఆదేశించిన నేపథ్యం లో రూ.1500 జరిమాన విధించినట్లు శానిటేషన్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వస్కుల బాబు, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, సానిటరీ సూపర్వైజర్ భాస్కర్, సానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అనూహ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరలు పంపిణీ

- హాజరైన జెడ్పీ సీఈవో డి.పురుషోత్తం

మరిపెడ జనవరి 20 (జనంసాక్షి) : మరిపెడ మండల కేంద్రంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పి సీఈవో డి పురుషోత్తం అన్నారు. మంగళవారం మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ లో మెప్మా ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ 14 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మరిపెడ కమిషనర్ రామదుగు విజయనాథ్ తో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో వీధివిక్రియ దారులకు ప్రభుత్వం నుండి 1216 మంది మహిళలకు సుమారు కోటి 24 వేల రూపాయలు లోన్ ఇప్పించడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వ వారికి చేయూతనుఅందిస్తుందన్నారు. మహిళా సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేయకుండాఉపయోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ విజయలక్ష్మి, సెమీమ్, పులి ఉమా, గంధసిరి ఉమా, రాజేశ్వరి, రజిత, పార్వతి, ఉమారాణి, లక్ష్మి, స్వరూప, సరిత, మమత, తోపాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ రీ-సర్వేను ఉపయోగించుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

టేకుమట్ల జనవరి 20 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి గ్రామంలోని అన్ని భూములకు రీ సర్వే చేసే విషయంలో టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ (వి) గ్రామంలోని అన్ని భూములను రీ-సర్వే చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేసినందున తేదీ 20.01.2026 రోజున రామకృష్ణాపూర్ (వి) గ్రామపంచాయతీ వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు , రామకృష్ణ పూర్ (వి) సర్పంచ్ నాంపల్లి వీరేశం గారు,తహసీల్దార్ కె. విజయలక్ష్మి ఏ డి జిల్లా భూ సర్వే శాఖ అధికారిణి ఏ న్. కుసుమ కుమారి , డిఐఓఎస్ గణేష్ జాదవ్ , సర్వేయర్లు సిహెచ్ తిరుపతి, జి. శ్రీనివాస రావు, మండల గిర్దవర్ సంతోషబాబు, జీపీవో చిరంజీవి, రెవిన్యూ బృందం రామకృష్ణాపూర్ (వి) గ్రామంలోని రైతులందరూ ఇట్టి గ్రామ సభకు హాజరు కాగా అనంతరం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ భూముల రీ-సర్వే కు సహకరించి తమరి అన్ని భూములను భూభారతిలో నమోదు చేసుకోగలరని అదేవిధంగా మండలంలో ఉన్న ప్రతి ఒక్క రైతు భూధార్ కార్డులు పొందలని ఆయన తెలియజేశారు ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగవద్దని ఎమ్మెల్యే అధికారులకు తెలియజేశారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందే విధంగా మండలంలోని అధికారులు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేసి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు జిల్లా మండల నాయకులు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

నిర్లక్ష్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు

- జాతరలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలి
- ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

ఆత్మకూరు, జనవరి 20 (జనం సాక్షి): సమ్మక్క జన్మస్థానం రెండవ మేడారం గా పేరుగాంచిన అగ్రం పహాడ్ సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. మంగళవారం ఆత్మకూరు మండలం అగ్రం పహాడ్ సమ్మక్క సారలమ్మ జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పర్యటించి పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. గత జాతర్ల కంటే ఎక్కువ సంఖ్యలో మరుగుదొడ్లు స్థానాల ఘట్టాలు, మంచినీటి సౌకర్యాలు, భక్తులు విడిది చేసేందుకు కావలసిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పనులు చేయడం పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎండోమెంట్ ఈవో నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్ లో అన్ని శాఖల అధికారుల నుండి చేసిన అభివృద్ధి పనుల వివరాలను తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 గంటలు అన్ని శాఖల అధికారులు జాతర పూర్తయ్య వరకు ఇక్కడే ఉండి జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్షలాదిమంది వచ్చే భక్తులకు అడుగడుగున సకల సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. వరంగల్ నుండి జాతర వరకు మహిళలకు ఫ్రీ బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే భక్తుల అందరికీ వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి నేరుగా జాతర వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు. ఈనెల 25న మళ్లీ నేను వస్తా జాతర మూడు రోజులు ఇక్కడే ఉండి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు. నేను వచ్చే లోపు అన్ని పనులు పూర్తి కావాలని ఎవరు నిర్లక్ష్యం చేసిన సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు 24 గంటలు భక్తులకు అందుబాటులో ఉండి వారికి కావలసిన సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలిగితే అధికారులదే బాధ్యత వహించాలని కలెక్టర్ హెచ్చరించారు. జాతర పనులు పర్యవేక్షించేందుకు మళ్లీ వస్తానని రెండు రోజుల లోపే అన్ని పనులు పూర్తి కావాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈగలు ఇప్పుడే వస్తున్నాయి వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిత్యం బ్రిచింగ్ పౌడర్ క్లోరినేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండోమెంట్ అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు సంతోషంగా దర్శనం చేసుకునే విధంగా చూడాలన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కావలసిన ఏర్పాటు చేయవలసిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి

వరంగల్ ప్రతినిధి, జనవరి 20 (జనంసాక్షి): గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసిపి అంకిత్ కుమార్ తో కలసి అన్ని శాఖల అధికారుల తో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఖుష్ మహల్ వద్ద నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో వేడుకలు నిర్వహించ నున్నందున అందుకనుగుణంగా వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని, అగ్నిమాపక యంత్రాన్ని వేడుక స్థలం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెల 25 లోగా ప్రశంసా పత్రాలు సిద్ధం చేయాల న్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ.. వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డిఓలు సుమా, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా వైన్స్ దాదాగిరి

ఫొటోలు తీయొద్దంటూ హుకూం

బెల్లంపల్లి, జనవరి 20, (జనంసాక్షి) : బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలోని దుర్గా వైన్స్ సిబ్బంది దాదాగిరి రోజురోజుకు పెరిగిపోతుంది. వైన్స్ వద్ద నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు జరుగుతున్నాయా లేదా అని వెళ్లి ఫొటోలు తీసుకున్న జర్నలిస్టును బెదిరింపులకు గురిచేశారు. ఫొటోలు ఎందుకు తీస్తున్నావ్? మేమేమి తప్పు చేయడం లేదు కదా అని బెదిరింపులకు పాల్పడ్డారు. అయినా మేము అబ్కారీ వాళ్లకు, ఇంకా మిగతా అధికారులకు ప్రతినెల లంచాలు ఇస్తూనే ఉన్నాము కదా వాళ్ళు మమ్మల్ని ఏమీ అనరు. నీవు ఎవరికి ఫోన్ చేసుకుంటావో చేసుకో ఏఅధికారితో అయినా మాట్లాడ టానికి మేము సిద్ధం అని వైన్ షాపు సిబ్బంది దౌర్జన్యానికి దిగారు. మీరు ఇలా ఫొటోలు తీస్తే మేము ఇప్పుడే షాపు మూసేసి వెళ్ళిపోతాం, మమ్మల్ని అడిగే వారు ఎవరూ లేరు అంటూ ఇష్టారీతిన వ్యవహరించారు. వైన్ షాపు ఏమైనా నిషేధిత ప్రాంతమా ఫొటోలు తీయరాదు అని చెప్పడానికి అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా సమయం సందర్భం లేకుండా ఇష్టా రీతిన వైన్ షాపు తెరవడం, మూసేయడం వల్ల మద్యం ప్రియులు తప్పని పరిస్థితుల్లో బెల్టు షాపులను ఆశ్రయించి ఎక్కువ ధరలకు మద్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వైన్ షాపుల నిర్వహణపై అజమాయిషీ చేయాల్సిన అబ్కారీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడంతో నెన్నెల మండల కేంద్రంలోని దుర్గా వైన్స్ దాదాగిరి పెచ్చరిల్లి పోతుందని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వైన్ షాప్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. ఈవిషయమై చెన్నూర్ అబ్కారీ సీఐ హరిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

నిర్లక్ష్యం చేస్తే ఎట్టి పరిస్థితులు సహించేది లేదు

సీఐపై మండిపడ్డ ఎమ్మెల్యే..

ఆత్మకూర్, జనవరి 20 (జనం సాక్షి): గత జాతరలో పోలీసుల నిర్లక్ష్యం వల్లనే గొడవలు జరిగాయని ఈసారి నిర్లక్ష్యం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని సిఐ సంతోష్ ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆత్మకూరు మండలం అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతర రివ్యూ మీటింగ్ లో ఆత్మకూరు సిఐ సంతోష్ పై ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగిన సహించేది లేదన్నారు. ఎవరు వచ్చినా కూడా జాతరకు పర్లాంగ్ దూరంలోనే వాహనాలు నిలిపివేయాలని జాతరలోనికి రానివ్వకూడదని సూచించారు. పరకాల ఏసీపీ సతీష్ బాబుకు జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సూచించారు

నిర్మల్ మున్సిపల్ ఎన్నికల వేడి

- బీజేపీ టికెట్లకు ఆశావాహుల పోటీ
- క్యాంపు కార్యాలయం కిటకిట

నిర్మల్ బ్యూరో, జనవరి 20 (జనంసాక్షి) : నిర్మల్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీలోటికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. మంగళవారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఆశావాహులతో కిటకిటలాడింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశా వాహుల నుంచి దరఖాస్తులను స్వీకరించగా, బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ 210కి పైగా దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఒక్కో వార్డ్ నుంచి 4 నుంచి 7కు పైగా దరఖాస్తులు రావడం పార్టీ బలాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. నిర్మల్ గడ్డపై బీజేపీకి ఉన్న ప్రజాదరణకు ఇదే నిదర్శన మని ఎమ్మెల్యే మాహేశ్వరెడ్డి వ్యాఖ్యానిం చారు. ప్రజల ఆదరణ, కార్యకర్తల అంకితభావంతో ఈసారి నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని బీజేపీ కచ్చితంగా కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దరఖాస్తుల వెల్లువ రాబోయే విజయానికి ముందస్తు సంకేతంగా పేర్కొన్నారు. నిర్మల్‌లో ప్రధాన పోటీ బీజేపీ-ఎంఐఎం మధ్యనే ఉంటుందని స్పష్టం చేశారు. నగర ప్రజలు అభివృద్ధి కావాలా? అరాచకం కావాలా? అనే ప్రశ్నకు సమాధానంగా అభివృద్ధి వైపే మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో అధిక స్థానాల్లో గెలిచి, చైర్‌పర్సన్ సీటును బీజేపీ దక్కించుకుంటుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్

ములుగు బ్యూరో, జనవరి20(జనం సాక్షి) : ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ మేడారం అమ్మవార్ల పూజారులు, అభ్యుదయ యువతతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మేడారం మహా జాతర 2026 కు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా ఎంతో దూరం నుంచి వచ్చే భక్తులకు అద్భుతంగా అమ్మవార్ల దర్శనం జరిగి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెళ్లే విధంగా చూడాల్సిన గురుతర బాధ్యత పోలీసులతో పాటు మేడారం పూజారులు మరియు అభ్యుదయ యువతపై ఉందని నువ్వు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఆకాంక్షించారు. మండమెలిగే పండుగ మొదలుకొని జాతర పూర్తయ్యేంతవరకు కూడా లక్షలలో భక్తులు తరలి వస్తారని, అనునిత్యం భక్తుల రక్షణ కోసం పాటుపడుతున్న పోలీస్ యంత్రాంగానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ములుగు డిఎస్పి రవీందర్,పసర సీఐ దయాకర్,ఎస్సిఐ ఇన్స్పెక్టర్ శంకర్, మేడారం ఎస్తేచువతీతీచ కమలాకర్,మేడారం పూజారులు,అభ్యుదయ యువత పాల్గొన్నారు.

కార్యాలయం ఒకచోట.. పని మరోచోట

నెక్కొండ, జనవరి 20 (జనంసాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న ఒకరు అధికారులు మందాలించిన పట్టించుకోకుండా సొంత ఆన్లైన్ సెంటర్ నడిపిస్తు దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పని చేయాల్సి ఉండగా సాకులు చెబుతూ ప్రైవేటుగా ఆన్లైన్ సెంటర్ నడుచుకుంటున్నాడు. అధికారులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా సంత మండలం కావడంతో వారి మాటలు లెక్కచేయడం లేదు. అతని క్లస్టర్ కు సంబంధించిన పనులు ఉన్నప్పటికీ కార్యాలయం రమ్మని కార్యదర్శులు కోరిన తన ఆన్లైన్ సెంటర్‌కు రమ్మంటున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదురు ప్రైవేట్ ఆపరేటర్‌పై శాఖపర చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

ముస్లింల ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ బ్యూరో, జనవరి20,(జనంసాక్షి) రంజాన్ మాసంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్?లో జరిగిన సమావేశంలో మసీదుల వద్ద పారిశుద్ధ్యం, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు మరమ్మత్తులు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21 జనవరి 2026

ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలంటే బాధ్యతాయుత డ్రైవింగ్ అవసరం

● ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల నడిగడ్డ, జనవరి 20 (జనం సాక్షి) : తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం జోగులాంబ గద్వాల జిల్లాలో విస్తృతంగా కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆలోచనతో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమం, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రజల మధ్యకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర రోడ్డు భద్రత, హెల్మెట్ ఆవశ్యకత, సీట్ బెల్టు ఆవశ్యకత, రాంగ్ రోడ్ డ్రైవింగ్ వల్ల జరిగే నష్టాలు, రేష్ డ్రైవింగ్ వల్ల కుటుంబాలకు జరిగే నష్టాలు,మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతను సమర్థవంతంగా అమలులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని పోలీస్ అధికారులు వారి వారి పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గరకు వెళ్లి అక్కడ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందితోపాటు అక్కడికి వారి

పనుల నిమిత్తం వచ్చిన స్థానిక ప్రజలకు కూడా అరైవ్ అలైవ్ కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేటి ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నియమాల పట్ల నిర్లక్ష్యమే. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం, సీట్?బెల్ట్?ను పట్టించుకోకపోవడం, అధిక వేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ఇవన్నీ ప్రాణాలతో చెలగాటమే అని స్పష్టం చేశారు. ప్రతి ప్రయాణం క్షేమంగా ముగియాలంటే బాధ్యతాయుత ప్రవర్తనే ముఖ్య మార్గమని తెలిపారు. హెల్మెట్, సీట్?బెల్ట్ వాహన నియమాలు కేవలం నిబంధనలు కాదని, అవి ప్రాణ రక్షకాలు అని అన్నారు. మరి ముఖ్యంగామైనర్ డ్రైవింగ్‌ను అరికట్టడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు.అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో వాహనాల పార్కింగ్ క్రమశిక్షణ గురించి వారికి తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా హెల్మెట్ ధరించాలని నో హెల్మెట్ నో ఎంట్రీ అని నినాదాలు ఇచ్చారు.అదేవిధంగా నో హెల్మెట్ నో ఎంట్రీని అమలు పరచాలని పోలీసు అధికారులు ఆయా కార్యాలయాల అధికారులను కోరారు. ప్రభుత్వ వాహనాలను నడుపుతున్న వారు సురక్షితంగా డ్రైవింగ్ చెయ్యాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, క్రమశిక్షణతో కూడిన పార్కింగ్ లవర్చుకోవాలని తెలిపారు. అరైవ్ అలైవ్ అనేది ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ప్రతి పౌరుడి మనసులో మార్పు తీసుకురావాల్సిన ఉద్యమమని పోలీసులు అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ నిబంధనల అమలు పోలీసులకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను అరికట్టగలమని తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం రానున్న రోజుల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టనుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ అధికారులు,సిబ్బంది, వివిధ ప్రాంతాలలోని ప్రభుత్వ కార్యాలయాల ఆఫీసర్స్,సిబ్బంది, స్థానిక ప్రజలు చురుకుగా పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

వెల్దండ, జనవరి 20 (జనంసాక్షి) : మండల పరిధిలోని రాచూర్ గ్రామ సర్పంచ్ గున్నెళ్ళ శ్రీనివాస్ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. మంగళవారం పారిశుద్ధ్య పనుల్లో భాగంగా మోరీల్లో పూడిక తీయించడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో..గ్రామంలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, మౌలిక వసతులు, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచుతానని చెప్పారు.అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి పరిచి, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని , విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

విశ్వసనీయతను చాటుకున్న జనంసాక్షి

● జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

కొండమల్లేపల్లి, జనవరి 20 (జనంసాక్షి) : ప్రజాసమస్యలను నిర్భయంగా నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ జనంసాక్షి దిన పత్రిక విశ్వసనీయతను చాటుకుంటుందని నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జనంసాక్షి క్యాలెండర్ కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలు వెలికితీసే వార్తలతో నిజాలను నిర్భయంగా అక్షర రూపంలో తెలుపుతూ సత్యశోధన చేస్తూ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న తెలంగాణ ఉద్యమ పత్రిక జనంసాక్షి అని కలెక్టర్ కొనియాడారు. ప్రజల సమస్యలను నిత్యం ప్రభుత్వం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జనంసాక్షి విలేకరుల బృందానికి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర కీలకమని సామాజిక బాధ్యతతో వార్తలను అందించడంలో జనంసాక్షి ముందుండటం అభినందనీయమని అన్నారు. ప్రజాసమస్యలను బాధ్యతాయుతంగా ప్రతిబింబిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న జనంసాక్షి దినపత్రికను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా వివిధ మండలాల విలేకరులు ఖాజా మొహినూద్దీన్, మొహమ్మద్ అబ్దుల్ రజాక్, నరసింహ, అబ్దుల్లాహ్, దామోదర్, అమరేందర్, శంకర్ నాథ్, హరీష్, శేఖర్, ఏడుకొండల్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో బెల్టుషాపుల తొలగింపునకు నేడు గ్రామసభ

కొందుర్గు, జనవరి 20 (జనంసాక్షి) : కొందుర్గు గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల దందాను అరికట్టేందుకు కొందుర్గు గ్రామ పంచాయతీ సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ ఆధ్వర్యంలో పాలక వర్గం నడుం బిగించింది. విచ్చలవిడి మద్యం విక్రయాల వల్ల గ్రామ వాతావరణం దెబ్బతింటోందని, యువత వ్యసనాలకు బానిసలవుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో, వీటిని శాశ్వతంగా తొలగించేందుకు నేడు ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేశారు.

వివరాల్లోకి వెళ్తే..

రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలకేంద్రపరిధిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్పందించిన సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ మరియు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలందరి సమక్షంలో ఒక కఠినమైన నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించారు.

దేశ ఐక్యతకు క్రీడలే నిదర్శనం

● మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్

● ఘనంగా ముగిసిన 'కొందుర్గు ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్

కొందుర్గు, జనవరి 20 (జనంసాక్షి) : భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశాన్ని ఒక్కతాటిపైకి తెచ్చే శక్తి కేవలం క్రీడలకే ఉందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన కొందుర్గు ప్రీమియర్ లీగ్ (ఖూూ) క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్ విజయం సాధించింది. ద్వితీయ బహుమతి చెన్నై సూపర్ కింగ్స్ గెలుచుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, మనుషుల మధ్య స్నేహాన్ని, ఐక్యతను పెంచుతాయని కొనియాడారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా క్రీడాకారులు మైదానంలో చూపే క్రీడా స్ఫూర్తి దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పొందుతారని, గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణాన్ని అలవర్చుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

ప్రతిభకు ప్రోత్సాహం :

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి టోర్నమెంట్లు వారిని వెలుగులోకి తెస్తాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందజేశారు. రన్నరప్ జట్టుకు, అలాగే బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ విజేతలకు మెమెంటోలు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టోర్నమెంట్ నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు మరియు భారీ

సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు. మైదానం మొత్తం ఈలలు, కేకలతో మార్మోగిపోయింది. కార్యక్రమంలో బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, ఈటా గణేష్, సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, ఉపసర్పంచ్ చంద్రశేఖర్,కెపిఎల్ ఫౌండర్ చిన్నారాజ్ గౌడ్,రాములు,రామకృష్ణ, జగదీష్ గౌడ్, దయ్యాల శేఖర్, క్రీడాకారులు యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థినిలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి

చారకొండ, జనవరి 20 (జనంసాక్షి) : విద్యార్థినిలు రోడ్డు భద్రత నియమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎస్సై పి వీరబాబు అన్నారు.మంగళవారం చారకొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో చారకొండ పోలీస్ స్టేషన్ ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి,జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలలో భాగంగా విద్యార్థినులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా రోడ్డు భద్రతా పై డ్రాయింగ్ పెయింటింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులు రోడ్డు భద్రత నియమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.తల్లిదండ్రులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని,కార్లలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ముఖ్యమైన విషయం మద్యం తాగి వాహనాలను నడపకూడదని తల్లిదండ్రులకు విద్యార్థినిలు సూచనలు ఇవ్వాలి.ఆటోలో ప్రయాణించేటప్పుడు పెద్దవారు అయితే ముగ్గురు ప్రయాణించాలని,పిల్లలైతే ఆరుగురు ప్రయాణించాలని అన్నారు.ఈ విషయాలను విద్యార్థినిలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఒకవేళ నిబంధనలు పాటించకపోతే

చట్టపరమైన చర్యలు తప్పవని తల్లిదండ్రులకు తెలపాలని విద్యార్థినిలకు సూచించారు.రోడ్డు భద్రతపై విద్యార్థినిలకు డ్రాయింగ్ రూపంలో అదేవిధంగా పెయింటింగ్ ద్వారా రోడ్డు నియమా సూచికలు వేయించి విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ, ప్రిన్సిపాల్ కే. మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలు చీరల పంపిణీ చేసిన సిద్దిపేట కలెక్టర్

చేర్యాల, జనవరి 20 (జనంసాక్షి) : చేర్యాల పట్టణంలో కళ్యాణి గార్డెన్ లో ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగంగా పట్టణంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇదే వేదిక మీద 6 నెలల క్రితం ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ చేసుకున్నాం అలాగే అనేక సంక్షేమ కార్యక్రమాలు ద్వారా అందరూ లబ్ది పొందుతున్నారు. జిల్లాలో 12500 ఇండ్లు మంజూరు కాగా 9500 గ్రౌండింగ్ అయ్యాయని ఇప్పటి వరకు 137 కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. రేషన్ కార్డులు 26721 కొత్త రేషన్ కార్డులు మరియు 74386 మంది సభ్యులను పాత రేషన్ కార్డులలో చేర్చడం జరిగింది. రేషన్ కార్డు దారులకు 441 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. మహాలక్ష్మి కింద 1,79,834 గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు 45 కోట్ల 65 లక్షలు ఖాతాల్లో జమ చేసిందన్నారు. గృహ జ్యోతి పథకం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 2,06,354 గృహాలకు 196 కోట్ల రూపాయలు ప్రభుత్వం విద్యుత్ శాఖకు అందించింది. రైతు భరోసా పథకం కింద 3,20,379 రైతులకు 355 కోట్ల రూపాయలు మంజూరు రైతుల ఖాతాల్లో జమ చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 7కోట్ల 20 లక్షల మంది మహిళలు ప్రయాణానికి 240 కోట్ల రూపాయలు ఆర్టీసీ కి అందివ్వడం జరిగిందన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకం కింద ఇదివరకే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు చీరల పంపిణీ చేసుకున్నాం నాణ్యమైన చీరలు కావున తయారీలో ఆలస్యం వల్ల ఈరోజు అర్బన్ ప్రాంతాల్లో మహిళలకు 4 మున్సిపాలిటీల్లో 11000 పైగా మహిళలకు చీరల పంపిణీ గ్రూప్ లో ఉన్నవారికే కాకుండా 18 సంవత్సరాల పై బడిన ప్రతి మహిళలకు అందించడం జరుగుతుంది. వడ్డీలేని రుణాలు పట్టణాల్లో 1058

స్వయం సహాయక సంఘాల కు 3 కోట్ల 74 లక్షలు సంఘాలకు వడ్డీలేని రుణాలు అందివ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం పట్టణ పేదరిక నిర్మూలన-మెప్మా చేర్యాల పట్టణంలో 49 స్వయం సహాయక సంఘాలకు 10,05,977 రూపాయల చెక్కును పంపిణీ చేశారు.

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు

● మధిర మున్సిపాలిటీలో నేడు పదివేల చీరల పంపిణీ

● ఏడాదిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి

● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

మధిర, జనవరి 20 (జనంసాక్షి) : స్వయం సహాయక సంఘాల మహిళకే కాకుండా అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు డివిజన్లో డిప్యూటీ సీఎం చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఒక్కరోజే మధిర మున్సిపాలిటీ పరిధిలో 10,272 చీరల పంపిణీ జరుగుతుందని తెలిపారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో ఐదు వేల మంది స్వయం సహాయక సభ్యులు ఉన్నారు మరో 5000 మంది చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరితే వడ్డీ లేని రుణాలతో పాటు అనేక ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత మధిర పట్టణం మొత్తం కొత్త సిసి రోడ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం

వెల్దండ, జనవరి 20 (జనంసాక్షి) : పోతెపల్లి గ్రామానికి చెందిన బోయిన్ పల్లి అల్లాజి గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుడి కుటుంబానికి రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, పోతేపల్లి సర్పంచ్ తగుళ్ళ కొండల్ యాదవ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మరణం తీరని లోటని, వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శారద బాలయ్య గౌడ్, వార్డు సభ్యులు అశోక్ కుమార్, వావిళ్ళ కొండల్ యాదవ్, ఎగిరి శెట్టి శివ, ఉడుత బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యం గొప్ప అవకాశం

● ఉచిత మెడికల్ క్యాంపులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

మధిర, జనవరి 20 (జనంసాక్షి) : షుగర్ వ్యాధిగ్రస్తులకు లండన్ నుంచి ప్రత్యేక వైద్యులు వచ్చి ఉచితంగా వైద్య సహాయం చేయడం గొప్ప అవకాశం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం మధిర పట్టణంలో యూకే స్వచ్ఛంద సంస్థ, కృష్ణంరాజు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు కాళ్లకు సంబంధించిన వ్యాధి సోకిన విషయం కూడా ఆ రోగులకు తెలియదని పరీక్షలు చేయిస్తేనే తెలుస్తుందని, ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా షుగర్ వ్యాధిగ్రస్తులు ముందే జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రముఖ కథానాయకుడు కృష్ణంరాజు జన్మదినం సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో వారి కుటుంబ సభ్యులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు ప్రసీద చిన్ననాటి నుంచి సేవాభావంతో తన నాన్నగారి పేరిట సేవలు అందిస్తున్న ఆమెను అభినందిస్తున్నట్లు, దీవిస్తున్నట్లు తెలిపారు. సినీ నటుడు కృష్ణంరాజు కుటుంబంతో తమ కుటుంబానికి మంచి స్నేహబంధం ఉందని కృష్ణరాజు కూతురు ప్రసీద తన కుమారుడు సూర్య విక్రమాదిత్య స్నేహితులు, ఆ స్నేహభావంతో మధిర నియోజకవర్గం లో పేదల కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరగా వారు వెంటనే అంగీకరించి ఇక్కడికి వచ్చి సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ నియోజకవర్గంలో పేదల సంఖ్య ఎక్కువగా ఉంది వారికి వైద్య సహాయం భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి విషయాలను ఈ క్యాంపు ద్వారా తెలియజేయడం ఆనందదాయకం అన్నారు. యునైటెడ్ కింగ్డమ్ లో ప్రసిద్ధ డాక్టర్ అయిన వేణు లండన్ నుంచి ఇక్కడికి వచ్చి సేవలందించడం గొప్ప విషయం అన్నారు. లండన్ వెళ్లి వేణు వద్దా చికిత్స చేయించుకోవాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు, సమయం పడుతుంది కానీ వారు నేరుగా మధిరకు వచ్చి

ఎటువంటి ఖర్చు లేకుండా సేవలు అందిస్తున్నారు అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, సూర్య విక్రమాదిత్య, కృష్ణంరాజు శ్రీమతి శ్యామలాదేవి, కృష్ణంరాజు కూతురు ప్రసీద తదితరులు పాల్గొన్నారు.

లక్షన్నర దాటిన పసిడి

బంగారం, వెండి టీ20 బ్యాటింగ్..

న్యూఢిల్లీ:బంగారం, వెండి ధరలు దూసుకెళుతున్నాయి. టీ20 మ్యాచ్‌లో బ్యాటర్ల అవతారం ఎత్తి తమ వీరోచిత ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాయి. పసికూనపై ఓపెనర్లుగా దిగిన బ్యాటర్ల మాదిరిగా పరుగుల కసిని తీర్చుకుంటున్నాయి. ఆకాశమే హద్దుగా సిక్సర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలోనే స్కోరుబోర్డుపై తొలిసారి వెండి రూ.3 లక్షల మార్కును నమోదు చేయగా.. తానేమీ తీసిపోను అన్నట్లుగా బంగారం రూ.1.50 లక్షల మార్కును చేరుకుంది. తక్కువ ధరలో ఉన్నప్పుడు కొనుగోళ్లు జరిపిన వారు దీన్ని చూసి కేరింతలు కొడుతుండగా.. తగ్గితే కొందామని భావిస్తున్న మధ్యతరగతి వ్యక్తి ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యాడు.మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి నెల డెలివరీ కిలో వెండి ధర మంగళవారం మరో రూ.9,674 పెరిగి రూ.3.19 లక్షలకు చేరువైంది. ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ఫిబ్రవరి డెలివరీ ఒక్క రోజులోనే రూ.2,560 పెరిగి రూ.1.48 లక్షలకు చేరింది.హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నానికి 10 గ్రాముల బంగారం ధర తొలిసారి రూ.1.50 లక్షలు దాటింది. వెండి రూ.3.15 లక్షల వద్ద ట్రేడవుతోంది.
అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,714 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 94.37 డాలర్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 91 మార్కును దాటడంతో ఆ ప్రభావం కూడా దేశీయంగా వీటి ధరల పెరుగుదలకు దోహదం చేస్తోంది.
సురక్షితమని భావించి..
మొన్నటికి మొన్న వెనెజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేసి ఆ దేశ రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చేసిన ట్రంప్.. మరోవైపు ఇరాన్‌పై కయ్యానికి కాలుదువ్వుతున్నారు. అంతలోనే అమెరికా భద్రతను సాకుగా చూపుతూ గ్రీన్‌లాండ్‌పై మనసుపడిన ట్రంప్.. ఆ దేశాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని దూకుడుగా అడుగులు వేస్తున్నారు. తద్వారా ప్రపంచాన్ని మరోసారి అనిశ్చితిలోకి నెట్టివేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సురక్షితమని భావిస్తూ బంగారం, వెండి పైకి పెట్టుబడులు రావడమే వీటి ధరలు గణనీయంగా పెరగడానికి కారణమని బులియన్ వర్తకులు చెబుతున్నారు. మరోవైపు కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతుండడంతో వైట్ గోల్డ్‌కు ఎప్పుడూలేనంత డిమాండ్ ఏర్పడింది.

డెలివరీ ఉద్యోగాలను గిగ్‌వర్క్‌గా చూడొద్దు

న్యూఢిల్లీ:ఫుడ్ డెలివరీ రంగంలో గిగ్ వర్క్ మోడల్ పదం తరచూ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో డెలివరీ జాబ్స్ గురించి ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాటిని గిగ్ వర్క్‌గా చూడొద్దన్నారు. జాబ్ మార్కెట్‌కు డెలివరీ పార్ట్‌నర్లు మూడో పిల్లర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు స్పందించారు.“గిగ్.. ఈ పదం ఫ్యాన్సీగా అనిపిస్తుంది కానీ దీనిని సౌకర్యవంతమైన ఉపాధి మార్గంగా చూడాలి. ఈ ఉద్యోగాలను నేను మూడో పిల్లర్‌గా భావిస్తాను. మొదటి పిల్లర్.. ఫార్మల్ ఎంప్లాయ్‌మెంట్. ఇదొక లాంగ్‌టర్మ్ జాబ్. రెండోది.. ఔత్సాహిక వ్యాపారం. అంటే చిన్నదో, పెద్దదో సొంతంగా పనిచేయడానికి ఎంచుకున్న మార్గం. ఇక ఈ డెలివరీ జాబ్స్ జీవనోపాధిలో అత్యంత కీలకమని నేను భావిస్తున్నాను. గత ఏడాది ఒకానొకదశలో 25 లక్షల మంది స్విగ్గీ వేదికగా ఉపాధి పొందారు. ఈ లెక్కలు కేవలం మా వేదిక గురించే. ఇంకా ఈ రంగంలో వృద్ధికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి.
వృద్ధిరేటు అంచనాలు పెంచిన ఐఎంఎఫ్
ఇక్కడ నేను చేసే అభ్యర్థన ఒక్కటే. ఫార్మల్ ఎంప్లాయ్‌మెంట్‌కు ఇది భిన్నం. ఆ ఉపాధి మార్గంలో ఉన్న నిబంధనలే ఇక్కడికి తీసుకువస్తే.. డెలివరీ జాబ్స్‌కున్న భిన్నమైన లక్షణాన్ని అణచివేసినట్లే అవుతుంది. ఈ ఉపాధి లక్షణాలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ఈ డెలివరీ జాబ్ ఇలాగే ఉంటుందని గిరిగీసుకోలేం. ఈ పనిని కొందరు దీర్ఘకాలం చేయాలనుకుంటారు.

రూ.9 లక్షల కోట్లు ఆవిరి

భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, విదేశీ మదుపర్ల అమ్మకాలు మన సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ కూడా 25,200 దిగువకు చేరింది. తర్వాత కాస్త కోలుకున్నాయి. ఈ క్రమంలోనే సూచీలు రెండు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మదుపర్ల సంపద దాదాపు ఒక్కరోజులోనే రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9.46 లక్షల కోట్లు క్షీణించి రూ.455.7 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 83,207.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,246.18) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,010.58 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1065.71 పాయింట్ల నష్టంతో 82,180.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 353 పాయింట్ల నష్టంతో 25,232.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ఎటెర్నల్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ఇండిగో, ట్రెంట్ ప్రధానంగా నష్టపోయాయి.

కారణాలు ఇవీ..

ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.1 శాతం మేర పతనమైంది. విప్రో 3 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ షేర్లు 7 శాతం మేర క్షీణించాయి. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా ఆయా కంపెనీలు బలహీన త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. దీంతో ఐటీ కంపెనీల లాభాలపై ఆందోళన వ్యక్తమవుతున్న వేళ ఐటీ స్టాక్స్ భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.గ్రీన్‌లాండ్ విషయంలో తనకు సహకరించకుంటే టారిఫ్‌లు విధిస్తానని యూరోపియన్ యూనియన్ దేశాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో మళ్లీ టారిఫ్ వార్ భయాలు మార్కెట్లలో మొదలయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది.విదేశీ మదుపర్ల వరుస అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్ఐఐలు సోమవారం కూడా రూ.3263 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు.

'రియల్' గేమ్‌ఛేంజర్

ఈ నెలలోనే 10,000 ఎంఏహెచ్ బిగ్‌బ్యాటరీ ఫోన్!

న్యూఢిల్లీ:దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో బిగ్ బ్యాటరీ ఫోన్లు ఎంట్రీ ఇస్తున్నాయి. గతేడాది నుంచి మొదలైన ఈ ట్రెండ్.. కొత్త ఏడాదిలోనూ కొనసాగనుంది. ప్రస్తుతం వన్‌ప్లస్ లాంచ్ చేసిన 15ఖీ దేశంలోనే అత్యధిక సామర్థ్యం (7400 ఎంఏహెచ్) కలిగిన స్మార్ట్‌ఫోన్‌గా ఉంది. మరికొన్ని కంపెనీలూ 6500-7300 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేశాయి. ఇప్పుడు చైనాకు చెందిన రియల్‌మీ ఏకంగా 10వేల ఎంఏహెచ్ బ్యాటరీతో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది.జనవరి 29న మధ్యాహ్నం 12 గంటలకు రియల్‌మీ తన పీ4 పవర్‌ను లాంచ్ చేయనుంది. ఫ్లిప్‌కార్ట్ వేదికగా ఈ ఫోన్‌ను విక్రయించనున్నారు. దీంట్లో 10,001 ఎంఏహెచ్ బ్యాటరీ అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. సింగిల్ ఛార్జ్‌తో 32.5 గంటల వీడియో ప్లేబ్యాక్ పొందొచ్చని కంపెనీ పేర్కొంది.సింగిల్ ఛార్జ్‌తో 32.5 గంటల వీడియో ప్లేబ్యాక్ పొందొచ్చని కంపెనీ పేర్కొంది. 144 ఊఖి రిఫ్రెష్‌రేటుతో కూడిన 1.5ఎ రిజల్యూషన్ డిస్‌ప్లేతో రాబోతోంది. ఈ ఫోన్‌కు సంబంధించిన ఇతర వివరాలు లాంచ్ సమయంలో వెల్లడి కానున్నాయి. ధర సుమారు రూ.35వేల పైనే ఉండొచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బిగ్ బ్యాటరీతో వస్తున్న ఈ ఫోన్‌ను 'గేమ్‌ఛేంజర్'గా అభివర్ణిస్తున్నారు. ఇతర కంపెనీలూ ఇదే బాట పడితే పవర్‌బ్యాంక్‌ల అవసరం ఉండబోదని పేర్కొంటున్నారు.

ఫోన్‌పే ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్

దిల్లీ: వాల్‌మార్ట్ నేతృత్వంలోని ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూకు మార్గం సుగమం అయ్యింది. ఈ ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఆమోదం లభించింది. సెబీ సూచించిన మార్పులు చేర్పులకు అనుగుణంగా అప్‌డేటెడ్ డీహెచ్‌ఆర్‌పీని ఫోన్‌పే త్వరలో సమర్పించనుంది. అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఐపీఓ త్వరలోనే పట్టాలెక్కనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.ఫోన్‌పే ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను పబ్లిక్ ఇష్యూ ద్వారా విక్రయించనున్నారు. ఫ్రెష్ ఇష్యూ ఉండబోదని తెలుస్తోంది. అంటే కంపెనీకి పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎలాంటి నిధులూ రావన్నమాట. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్ మార్కెట్‌లో ఫోన్‌పేదే హవా. మొత్తం యూపీఐ లావాదేవీల్లో 45 శాతం ఈ యాప్ ద్వారానే జరుగుతున్నాయి. 2025 డిసెంబర్‌లో మొత్తం 9.8 బిలియన్ లావాదేవీలను ప్రాసెస్ చేసిందని ఎన్‌పీసీఐ డేటా చెబుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.7115 కోట్ల ఆదాయం పొందింది. ఐపీఓ సైజ్, ధరల శ్రేణి వంటి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ఐపీఓ సుమారు రూ.12వేల కోట్లు ఉంటుందని అంచనా.



భజా..భారత్

2030కి 'ఎగువ మధ్య ఆదాయ దేశం'గా భారత్! రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరణ

- చైనా 2007 నాటి ఆర్థిక స్థితిలో ఇప్పుడు మనమున్నాం
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ:భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకెళ్తోంది. ప్రస్తుత వృద్ధి రేటు వేగం ఇలాగే కొనసాగితే, తలసరి ఆదాయమూ గణనీయంగా పెరిగి.. 2030 నాటికి భారత్ ఎగువ మధ్య ఆదాయ (అప్పర్ మిడిల్ ఇన్‌కం) దేశాల జాబితాలో చేరుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. 2028 నాటికి జర్మనీని వెనక్కి నెట్టి.. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని స్పష్టం చేసింది. 1990 నుంచి ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల ఆదాయ స్థాయిల్లో వచ్చిన మార్పులు, భారత తలసరి ఆదాయంలో వస్తున్న పెరుగుదలను విశ్లేషిస్తూ ఈ నివేదికను రూపొందించారు.స్వాతంత్ర్యం వచ్చాక.. మన జీడీపీ 1 ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్లకు చేరుకోవడానికి 60 ఏళ్లు పట్టింది. ఆ తర్వాత 7 ఏళ్లలోనే (2014 నాటికి) 2 ట్రిలియన్ డాలర్లు, మరో 7 ఏళ్ల (2021)లో 3 ట్రిలియన్ డాలర్ల స్థాయిని మించింది. 2025లో 4 ట్రిలియన్ డాలర్ల (రూ.360 లక్షల కోట్ల) స్థాయిని అధిగమించామని, 2027 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఈ జోరు ఇలాగే కొనసాగితే 2035 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.900 లక్షల కోట్ల) భారీ స్థాయికి చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది. ప్రపంచ వృద్ధి పంపిణీలో భారత్ స్థానం గత 25 ఏళ్లలో 92వ పర్సంటైల్ వద్ద ఉండగా, 2024తో ముగిసిన దశాబ్దంలో అది 95వ పర్సంటైల్‌కు చేరింది. అంటే, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది.
తలసరి ఆదాయం పెరుగుతోంది
దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)తో పాటే, ప్రజల తలసరి ఆదాయమూ గణనీయంగా పెరుగుతోంది. 1962లో 90 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2007కు 910 డాలర్లకు చేరింది. స్వాతంత్ర్య సమయంలో అల్పాదాయ దేశంగా ఉండగా, దిగువ మధ్య ఆదాయ దేశంగా మారేందుకు మనదేశానికి 60 ఏళ్లు పట్టింది. 2009లో 1,000 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2019 కల్లా 2,000 డాలర్లకు చేరింది. తాజా అంచనాల ప్రకారం 2026 నాటికి ఇది 3,000 డాలర్లకు, 2030 నాటికి 4000 డాలర్ల స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ బ్యాంకు ప్రమాణాల ప్రకారం, తలసరి ఆదాయం 4,500 డాలర్లు దాటితే ఆ దేశాన్ని ఎగువ మధ్య ఆదాయ దేశంగా పరిగణిస్తారు. భారత్ రాబోయే కొన్నేళ్లలోనే ఈ మైలురాయిని కచ్చితంగా చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది.
'వికసిత్ భారత్' లక్ష్యంగా..
స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్లకు.. అంటే 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా విధించుకుంది. అంటే, అధిక ఆదాయ దేశంగా మారాల్సి ఉంటుంది. ప్రపంచ బ్యాంకు ప్రస్తుత ప్రమాణాల ప్రకారం అధిక ఆదాయ దేశంగా మారాలంటే తలసరి ఆదాయం 13,936 డాలర్లుగా ఉండాలి. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ తలసరి ఆదాయం ఏటా 7.5% సగటు వార్షిక వృద్ధి రేటును నమోదు చేయాలి. గత 23 ఏళ్లలో (2001-2024) భారత్ ఇప్పటికే 8.3% వార్షిక వృద్ధిని సాధించింది. కాబట్టి, ఈ లక్ష్యం చేరుకోవడం సాధ్యమేనని ఎస్‌బీఐ పేర్కొంది. ఒకవేళ 2047 నాటికి అధిక ఆదాయ పరిమితి 18,000 డాలర్లకు పెరిగితే, భారత్ 8.9% వృద్ధి రేటును సాధించాల్సి ఉంటుంది. ఇందుకోసం నామినల్ జీడీపీ వృద్ధి రేటు డాలర్ల రూపంలో ఏటా సుమారు 11.5% ఉండాలని నివేదిక సూచించింది. గతంలో (2004-2020 ఆర్థిక సంవత్సరాలు) భారత్ 11% వృద్ధిని నమోదు చేసిన చరిత్ర ఉండటం ఇక్కడ సానుకూల అంశం.
భారీ వృద్ధికి సిద్ధంగా
2007లో చైనా తలసరి ఆదాయం 2,555 డాలర్లుగా ఉండేది. 2023లో భారత్ తలసరి ఆదాయం 2,580 డాలర్ల వద్ద ఉంది. అంటే, ఆర్థిక పరిణామ క్రమంలో 2007లో చైనా పరిస్థితులు, ఇప్పుడు మనదేశంలో కనిపిస్తున్నాయి. ఆ తర్వాత చైనా ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెంది, 2010కే అది ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారింది. అదే తరహాలో మనదేశమూ వృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని ఎస్‌బీఐ నివేదిక విశ్లేషించింది.
సంస్కరణలే కీలకం..
భారత్ ఎగువ మధ్య ఆదాయ స్థాయి నుంచి అధిక ఆదాయ స్థాయికి చేరుకోవాలంటే ఆర్థిక సంస్కరణలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉంది. జనాభా పెరుగుదల రేటు 0.6 శాతంగా, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుకుంటూ ముందుకు సాగితే, 2047 నాటికి భారత్ కచ్చితంగా అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. ముఖ్యంగా తయారీ రంగంపై దృష్టి సారించాలని ఎస్‌బీఐ నివేదిక వివరించింది.

గ్రీన్‌లాండ్‌కు అమెరికా యుద్ధ విమానం..!

న్యూఢిల్లీ:గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది.అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ తాజాగా గ్రీన్‌లాండ్‌కు సంబంధించి తమ సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు.ఇక, అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు సోమవారం గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

లండన్‌లో చైనా 'మెగా' ఎంబసీ..

బ్రిటన్ ఆమోద ముద్ర

లండన్:లండన్‌లో ఐరోపాలోనే అతిపెద్ద చైనా రాయబార కార్యాలయ నిర్మాణానికి బ్రిటన్ పచ్చ జెండా ఊపింది. ఈ ఎంబసీ ఏర్పాటుతో భద్రతాపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే ఆందోళనల నడుమ.. ఈమేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. స్థానిక అధికారి స్టీవ్ రీడ్ ఈ భవనానికి సంబంధించిన ప్రణాళికలను ఆమోదించారు.మెగా ఎంబసీ ఏర్పాటు కోసం చైనా 2018లోనే టవర్ ఆఫ్ లండన్ సమీపంలో 5.4 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దీని కోసం 225 మిలియన్ పౌండ్లు చెల్లించింది. 20 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ కాంప్లెక్స్‌లో 208 రహస్య బేస్‌మెంట్ గదులు కూడా ఉంటాయని స్థానిక మీడియా వెల్లడించింది.ఈ క్రమంలోనే ప్రతిపాదిత దౌత్య కార్యాలయాన్ని చైనా తన గూఢచర్య కార్యకలాపాలకు వినియోగించుకునే అవకాశం ఉందనే ఆరోపణలు మొదలయ్యాయి. అదేవిధంగా చైనా అసమ్మతివాదులపై నిఘా ముప్పును కూడా ఇది పెంచుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లండన్‌లో సున్నితమైన ఆర్థిక సమాచారాన్ని చేరవేసే భూగర్భ కేబుళ్లకు ఈ ప్రదేశం చాలా దగ్గరగా ఉందనే వాదనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. అనుమతి విషయంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పదేపదే వాయిదా వేసింది.మరోవైపు.. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే విషయంలో ఏడేళ్ల జాప్యంపై చైనా నిరసన తెలిపింది. బ్రిటన్ ఈ విషయాన్ని సంక్లిష్టం చేస్తూ, రాజకీయ రంగు పులుముతోందని ఆరోపించింది. వరుస జాప్యాలు, చట్టపరమైన సవాళ్ల అనంతరం ఎట్టకేలకు ప్రభుత్వ ఆమోదం లభించింది. జాతీయ భద్రత సమస్యలను పరిగణనలోకి తీసుకున్నామని, వాటి పరిష్కారానికి పోలీసులు, సంబంధిత విభాగాలతో మాట్లాడాకే ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

థాయ్ మ్యూజిక్ ఫెస్టివల్..

మిస్టరీగా భారతీయుడి మరణం

థాయ్‌లాండ్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ డైసీ కార్నివాల్ సంగీత ఉత్సవం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఓ భారతీయుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు ఈనెల 18న జరిగిన ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అసలేం జరిగిందంటే.. పుకెట్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈ సంగీత కార్యక్రమానికి వేలాది మంది పర్యాటకులు హాజరయ్యారు. జైసాక్షమ్ (28) అనే భారతీయుడు కూడా ఇందులో పాల్గొన్నాడు. కార్యక్రమం అనంతరం బయటకు వచ్చిన అతడు విచిత్రంగా ప్రవర్తించడాన్ని స్థానికులు గుర్తించారు. నియంత్రణ కోల్పోయి రోడ్డుపై ఉన్న ప్రభుత్వ ఆస్తులను, పార్కింగ్‌లోని వాహనాలను

ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. రెస్క్యూ సిబ్బంది వెంటనే స్పందించి.. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించగా, అక్కడ స్పృహ కోల్పోయిన కాసేపటికే బాధితుడు మరణించాడు. అయితే జైసాక్షమ్ మృతికి గల కార ణాలను వైద్యులు వెల్లడించలేదు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, శారీరక దాడికి సంబంధించిన గుర్తులు కూడా లేవని ప్రాథమిక విచారణలో గుర్తించి నట్లు తెలిపారు. పోస్టుమార్టం తర్వాతే జైసాక్షమ్ మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. బాధితుడి కుటుంబానికి ఈ విషయం తెలియజేసేందుకు.. భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించినట్లు తెలిపారు. పోస్ట్‌మార్టం ప్రక్రియ పూర్తయిన తర్వాత బాధితుడి మృతదేహాన్ని అతడి కుటుంబసభ్యులకు అప్పగిస్తామన్నారు.

జమ్మూకశ్మీర్‌ను విభజించాలడం మూర్ఖత్వమే

- దేశం కోసం బుల్లెట్లు ఎదుర్కొన్నాం
- ఇప్పుటికైనా మళ్లీ ఎదుర్కొనేందుక సిద్ధమే : ఫారూక్ అబ్దుల్లా

శ్రీనగర్(జనంసాక్షి):దేశం కోసం తాము బుల్లెట్లను ఎదుర్కొన్నామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. అవసరమైతే మరోసారి ఎదురు నిలబడతామన్నారు. జమ్మూకశ్మీర్‌ను మళ్లీ విభజించాలనే డిమాండ్లను తప్పుపట్టారు. వాటిని మూర్ఖత్వంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో లద్దాఖ్ తిరిగి జమ్మూకశ్మీర్‌లో విలీనం కావొచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమం సందర్భంగా మీడియాతో ఈమేరకు మాట్లాడారు.ఎన్‌సీ, పీడీపీలు జమ్మూకశ్మీర్‌లో రాళ్లదాడులు, ఉగ్రవాదాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని భాజపా చేసిన ఆరోపణలను ఫరూక్ అబ్దుల్లా ఖండించారు. "అలజడులు సృష్టించాలనుకుంటున్నది వారే.. మేం కాదు. దేశ సమగ్రతకు మేం బుల్లెట్లు ఎదుర్కొన్నాం. అవసరమైతే మరోసారి సిద్ధమే" అని అన్నారు. జమ్మూకశ్మీర్ నుంచి జమ్మూను విడదీసి రాష్ట్ర హోదా ఇవ్వాలంటూ వస్తున్న డిమాండ్లపై స్పందిస్తూ.. తమ పార్టీ ఎప్పుడూ అలాంటి ఆలోచనలు చేయలేదని తెలిపారు.గతంలో లద్దాఖ్‌ను విడగొట్టారని, దాని వల్ల ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. ఏదో ఒక రోజు లద్దాఖ్ తిరిగి జమ్మూకశ్మీర్‌లో కలుస్తుందన్నారు. స్థానికంగా కొత్త జిల్లాల ఏర్పాటు అనవసరమని చెప్పారు.

అంగరంగ వైభవంగా ఇందిరా గాంధీ విగ్రహావిష్కరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 20 (జనంసాక్షి): కామారెడ్డి పట్టణ నడిబొడ్డున రైల్వే స్టేషన్ సమీపంలోని ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ పేదల పెన్నిధి ఇందిరమ్మ అని అన్నారు. తన ప్రసంగంలో ఇందిరా గాంధీతో కామారెడ్డికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కామారెడ్డి అంటేనే కాంగ్రెస్ కోట అని, ఇక్కడ ఇందిరా గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. గరీబీ హటావో దేశ్ కో బచావో నినాదంతో ఆమె దేశంలోని నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపారనీ అన్నారు. బ్యాంకుల జాతీయీకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న ధీశాలి ఆమె అని కొనియాడారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, రాబోయే రోజుల్లో ఇందిరమ్మ రాజ్యంలోని సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరుస్తామని హామీ ఇచ్చారు. ఇంచార్జ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఆద్యురాలు ఇందిరా గాంధీ అని ఆడబిడ్డల ఆత్మగౌరవం దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ మహిళల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఇందిరమ్మ రాజ్య స్థాపన నేడు తెలంగాణలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం 'ఇందిరమ్మ రాజ్యం దిశగా అడుగులు వేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు నీడ కల్పిస్తున్నామని తెలిపారు. ధైర్యానికి మారుపేరు ఉక్కు మహిళగా ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటికీ దేశానికి దిక్సూచి అని, ఆమె చూపిన బాటలోనే తాము నడుస్తున్నామని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రభుత్వ సిద్ధాంతమే ఇందిరమ్మ మార్గం అని దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని, ఆమె త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. కామారెడ్డి గడ్డపై ఇందిరమ్మ విగ్రహం సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని కోరారు. ఆనాడు ఇందిరమ్మ ప్రవేశపెట్టిన 20 సూత్రాల పథకమే

నేడు అనేక సంక్షేమ పథకాలకు పునాది అని గుర్తు చేశారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ ఒక వ్యక్తి కాదు, ఒక గొప్ప శక్తి. ఆమె దూరదృష్టి వల్లే నేడు దేశం ఆహార భద్రతలో స్వయం సమృద్ధి సాధించిందని. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామంలో ఆమె పథకాల గుర్తులు ఉన్నాయన్నారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేస్తామని పేర్కొన్నారు.

జాతీయస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎన్నికైన వైష్ణవి పాఠశాల విద్యార్థిని

కుత్బుల్లాపూర్ జనవరి 20 (జనంసాక్షి) : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు నిరంతరం చేస్తున్న కృషిని జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఇంచార్జ్ డిఎసఎవతీతీచ శ్రీనివాస్ కొనియాడారు. కుత్బుల్లాపూర్ షాపూర్ నగర్ లోని వైష్ణవి పాఠశాల విద్యార్థిని నోహితి రూపొందించిన లో కాస్ట్ మినీచర్ కమ్యూనికేషన్ డిజైన్ జాతీయస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఇంచార్జి డి ఎస్ ఓ శ్రీనివాస్ షీల్డ్, సర్టిఫికెట్ ను అందజేశారు. అనంతరం వైష్ణవి స్కూల్స్ చైర్మన్ సిహెచ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ తమ విద్యార్థిని మేడ్చల్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ఇన్స్పైర్ ప్రదర్శనలో మొదటిసారి తన ప్రతిభను చాటుకుందని తెలిపారు. అనంతరం వైష్ణవి పాఠశాల ఫిజిక్స్ టీచర్ పానిగ్రహి పర్యవేక్షణ లో తక్కువ ఖర్చుతో ఒక కాన్ఫరెన్స్ హాల్ లో నెమ్మదిగా ప్రసంగించిన కేవలం సిగ్నల్స్ సహాయం తో ఎక్కువ సౌండ్ వచ్చే విధంగా ఒక డివైస్ ను(లో కాస్ట్ మినేచర్ కమ్యూనికేషన్ డివైస్) రూపొందించింది. ఈ ప్రాజెక్టు చూపరులను ఎంతగానో ఆకట్టుకొని రాష్ట్రస్థాయికి

ఎన్నిక కావడం జరిగిందన్నారు. జనవరి 7న కామారెడ్డి జిల్లా లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో తన ప్రతిభను చాటుకున్న వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని నోహితి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా నుంచి 4 ప్రాజెక్టు లు జాతీయ స్థాయికి ఎన్నికగా అందులో కుత్బుల్లాపూర్ కు చెందిన వైష్ణవి పాఠశాల విద్యార్థి కి చెందింది ఒకటి కావడం సంతోషం గా ఉందని సిహెచ్ నర్సింహులు గౌడ్ అన్నారు. జాతీయ స్థాయికి ఎన్నికైన విద్యార్థిని, టీచర్ ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైష్ణవి గ్రూప్ అకాడమిక్ డైరెక్టర్ సాయిబాబా పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 21 (జనంసాక్షి) : ఈనెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ దినోత్సవం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని బూత్ స్థాయి పోలింగ్ అధికారులు నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామం, వార్డు స్థాయిలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. 25న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓటు హక్కు, ఓటు ప్రాధాన్యత, ఆవశ్యకతపై తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన వంటి పోటీలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ నమూనాను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 20 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అరేవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క నూతన హెల్మెట్ నమూనాను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కొత్త హెల్మెట్ నమూనా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో పాటు, సౌకర్యవంతంగా, తేలికగా రూపొందించబడిందని తెలిపారు. యువతతో పాటు అన్ని వయస్సుల వారు హెల్మెట్‌ను నిత్యం వినియోగించేలా అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు ప్రభుత్వర చర్యలు చేపడుతుందని, అందులో భాగంగానే అరైవ్, అలైవ్ కార్యక్రమం ద్వా రా ప్రజల్లో భద్రతా స్పృహను పెంచుతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమా నికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,రవాణా శాఖ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, పాల్గొన్నారు.

ఒక్క రోజే 6 రేకుల బొగ్గు రవాణా

భవిష్యత్తులో బొగ్గు రవాణాలో రికార్డ్ బ్రేక్ చేస్తాం : గని హెచ్ఓడి పైడిశ్వర్..

గోదావరిఖని, (జనంసాక్షి): ఒక్కరోజే అత్యధిక 6 రేకులు (23692 వేల బొగ్గు) ను రవాణా చేసి సింగరేణి లోనే జీడీకే 1 సిఎస్పీ ఉద్యోగులు అల్ టైం రికార్డు సృష్టించారు. ఈ రికార్డు జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ డైరెక్షన్ లో ఏజీఎం రామ్మోహన్ రావు సపోర్ట్, రైల్వే వారి సహకారంతో ముఖ్యంగా సిఎస్పీలో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి, కాంట్రాక్ట్ ఉద్యోగుల కృషితో ఇన్ని రేకులు రవా ణా శేషం అన్నారు. ఈ విజయం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హెచ్ ఓ డి పైడీశ్వర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భవిష్యత్తు లో రవాణా లో మరిన్ని రికార్డులు బ్రేక్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కూలుతున్న వాటర్ ట్యాంక్ మెట్లు

భయాందోళనలో విద్యార్థులు

ముత్తారం జనవరి 20 (జనంసాక్షి): నాణ్యత లోపంతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సంబంధించిన మెట్లు పూర్తిస్థాయిలో కూలిపోతుండడంతో పాటు వాటర్ లీకేజీలతో విద్యార్థులు ఏ క్షణన ఏం జరుగుతుందోనని భయాం దోళనకు గురవుతున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టడంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టిన కొన్నాళ్లకే మెట్లు కూలిపోతూ ఉండడంతో ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. వాటర్ ట్యాంక్ ఇలా కొద్దిరోజులకే కూలిపో వడం పట్ల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ ని మరోమారు మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల తోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి

జాతీయ స్థాయి గణిత ఛాలెంజ్ పోటీలలో అత్యుత్తమ స్థానం

కరీంనగర్, జనవరి 20 (జనంసాక్షి) : గణిత శాస్త్రం చాలా కీలకమైనదని విద్యార్థులకు విజయాలను అందించడంలో విశిష్టమైన పాత్ర పోషిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు గణిత శాస్త్రం పట్ల మక్కువ పెంచాలని ఆ శాస్త్రంలోని విషయాలను సమచితంగా విద్యార్థులకు తెలియజేయడం ద్వారా ఏ పోటీ పరీక్షనైన చాలా సులభంగా ఎదుర్కొంటారని వారు చెప్పారు. గణిత శాస్త్రం వలన విద్యార్థులకు జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ఏ విషయమైనా చాలా సులభంగా అర్థం చేసుకోగలుగుతారని అభిప్రాయపడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయటానికై పాఠశాల స్థాయిలో అనేక పోటీలను నిర్వహిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ఎంపిక చేయడమే కాకుండా తగినటువంటి శిక్షణ ఇప్పిస్తూ విజయమే లక్ష్యంగా విద్యార్థులకు అన్ని

విధాలుగా ప్రోత్సాహం అందించడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో నిర్వహించినటువంటి జాతీయ స్థాయి ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ లో పాఠశాలకు చెందినటువంటి ఎ.గౌతమ్, 9వ తరగతి, అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా జాతీయ స్థాయిలో మొదటి వంద మంది విజేతలలో ఉండడం చాలా స్ఫూర్తిదా యకమని వారు చెప్పారు. అదేవిధంగా విజేతకు పుష్పగుచంతో పాటు అర్హత పత్రాన్ని అందజేసి భవిష్యత్తులో నిర్వహించబోయే పోటీలలో అద్భుతమైన విజయాలు నమోదు చేసి పాఠశాలకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడారం విధుల్లో ఆశాలకు పారితోషకాలు ఇవ్వాలి

- మేడారం వీధుల్లో ఆశాలకు 500 రూ.ల చొప్పున అందజేయాలి
- ఆశా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రత్నం నీలాదేవి

మంగపేట/మేడారం,జనవరి 20(జనంసాక్షి): మేడారం జాతరలో విధులు నిర్వహిస్తున్నటువంటి ఆశ కార్యకర్తలకు టీఏ డీఏలను రోజు 500 రూపాయల చొప్పున అందివ్వాలని ఆశా యూనియన్ రాష్ట్ర (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రత్నం నీలాదేవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో రమాదేవి అధ్యక్షతన జిల్లా కమిటీ ముఖ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నం నీలాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలాదేవి మాట్లాడుతూ గత 15 రోజులుగా మేడారం జాతరలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాంపులలో డ్యూటీలు నిర్వహిస్తున్నారు. అలాంటి ఆశ కార్యకర్తలకు టీఏ డీఏలను రోజుకు 500 రూపాయల

పారితోషకాన్ని అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్ ,జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు కు విజ్ఞప్తి చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాల్లో వివిధ రకాల ఆరోగ్య సేవలను అందిస్తున్నటువంటి ఆశా కార్యకర్తలకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రావ్య, కవిత, పద్మ, సుగుణ, కనకలక్ష్మి, రాధా, ప్రభ, సరిత, రాజ్యలక్ష్మి, సంధ్య, చంద్రవాణి,రజిత, అన్నపూర్ణ, వజ్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెట్టేందుకే కాంగ్రెస్ అక్రమ కేసులు

మాజీ ఎంపీ కవిత మాలోత్

మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి 20 (జనంసాక్షి): బీఆర్ఎస్ నేతల ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభు త్వం అక్రమ కేసులు బనాయిస్తోందని మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కవిత మాలోత్ ఆరోపించారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ క్యాంప్ కార్యాలయంలో మహబూబా బాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గారితో కలిసి నిర్వహి ంచిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. హరీశ్ రావు ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరి స్తోందని, ఖమ్మం సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై అక్కసు వెల్లగక్కారని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడైనా బీఆర్ఎస్ జెండాకు హాని జరిగితే దానికి సీఎం బాధ్యత వహించాలని అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలపై కేసులు, విచారణల పేరుతో వేధింపులు చేస్తున్నారని

ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నేతలు ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తారని కవిత మాలోత్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గద్దె రవి, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, యళ్ల మురళీధర్ రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి, నాయని రంజిత్, రావుల రవిచందర్ రెడ్డి, లూనావత్ అశోక్, మహబూబ్ పాషా, ఎండి ఫారీద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో చాంఫియన్ షిప్ పోటీలకు పారమిత విద్యార్థి

కరీంనగర్, జనవరి 20 (జనంసాక్షి) : జనవరి 21 నుండి 25 వరకు జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆద్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో జరుగనున్న 69వ యస్. జి. యఫ్. అండర్ 17 బాల బాలికల జాతీయ స్థాయి జూడో చాంపియన్ షిప్ పటీలకు, బాలుర 90 కిలోల పై విభాగంలో స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థి తాటికొండ రణవీర్ రాజ్ రాష్ట్రస్థాయి జూడో చాంపియన్ షిప్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు, పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరవు తెలిపారు. రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆద్వర్యంలో ఇటీవల హన్మకొండ లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన 69వ యస్.జి.యఫ్. రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలుర 90 కేజీల పై విభాగంలో టి. రణవీర్ రాజ్ 10 వ తరగతి (గోల్డ్ మెడల్) , 73 కేజిల విభాగంలో ఎ. అభినవ్ సాయి.10వ తరగతి (సిల్వర్ మెడల్) సాధించారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్న టి. రణవీర్ రాజ్ ను అదేవిధంగా రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన అభినవ్ సాయి ని పారమిత పాఠశాలల అధినేత డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు, వి.యు.యం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపిక్రిష్ణ, సమన్వయకర్త రబీంద్ర పాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు గోలి సుధాకర్, యస్.రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాఫిక్ సిబ్బందికి గాగుల్స్ అందజేత

శేర్లింగంపల్లి జనవరి 20 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపి డాక్టర్ గజరావు భూపాల్ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమీషన రేట్ కార్యాలయం ఆవరణలో గాగుల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి కాలుష్యం, ఎండ నుంచి రక్షణ కోసం గాగుల్స్ ని అందజేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మరింత నాణ్యమైన, మెరుగైన సేవలు అందించగలరన్నారు. రోడ్లపై నిర్ధాక్షిణ్యంగా నిలబడి ప్రజలకు సేవలు అందిస్తున్న ట్రాఫిక్ విభాగం పోలీసులకు ప్రజలు కూడా మానవతా దృక్పథంతో సహకరిం చడం తోపాటు వీలైతే వారికి హితావుదికంగా సహకారం అందిస్తే బాగుంటుందని జాయింట్ సీపీ మేజర్వ భూపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏడిసిపి హనుమంత రావు, మాదా పూర్ ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకటరెడ్డి, కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య, బాలానగర్ ట్రాఫిక్ ఏసిపి గిరిప్రసాద్, ట్రాఫిక్ ఇఎస్పెక్టర్లు, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

- 'దిశా' సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్
- పాల్గొన్న ఆర్మూర్, అర్బన్ ఎమ్మెల్యేలు, కలెక్టర్

నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి): ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయించేందుకు అధికారులు చొరవ చూపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పనుల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో జిల్లాలో వివిధ పథకాల కింద

చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఎం.పీ లాడ్స్ నిధులను మంజూరు చేసేందుకు పలువురు కమీషన్ లు డిమాండ్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఈ ధోరణిని మార్చుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎనలేని తాత్సారం జరుగుతోందని, అమృత్ పథకం కింద భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పనులు ఏళ్ళ తరబడి కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఈ పథకం పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఆర్.ఓ.బీ, ఆర్.యూ.బీ పనులను త్వరితగతిన జరిపించాలని, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల సంస్థ తదితర శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయించాలన్నారు. ఆయా అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుండి మంజూరీలు లభించిన నేపథ్యంలో నిర్మాణ పనులు జరిపించే విషయంలో జాప్యం జరగకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన వారు లబ్ధి పొందేలా జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక చొరవ చూపుతున్నామని, ఫలితంగా 851 మందికి మంజూరీలు కూడా లభించాయని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం గురించి సామాజిక, ప్రసార మాదమాల ద్వారా గ్రామ గ్రామాన మరింత విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలన్నారు. బాధిత కుటుం బాలకు ఒకే విడతలో 20వేల రూపాయలు వారి ఖాతాలలో నేరుగా జమ అవుతాయని, కుటుంబ పోషణ చూసే వ్యక్తిని కోల్పోయిన కుటుం బాలకు ఇది ఎంతో ఆదరువును అందిస్తుందని అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారా యణ మాట్లాడుతూ, నిజామాబాద్ నగర పాలక సంస్థకు చెందిన తిలక్ గార్డెన్ వాణిజ్య సముదా యాలలో బినామీలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, కార్పోరేషన్‌కు నామమాత్రపు అద్దె సైతం సంవత్స రాల తరబడి చెల్లించడం లేదని, మడిగెలను సబ్ లీజ్‌కు ఇచ్చి వేలాది రూపాయలు తీసుకుంటున్నారని అన్నారు. దీనిపై నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ వివరణ ఇస్తూ, ఈ అంశంపై సమగ్ర పరిశీలన జరిపామని, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుం టామని, అద్దె పెంపు, లీజు రద్దు ప్రతిపాదనలు కూడా పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

కాగా, ఫులాంగ్ వాగు నిర్వహణ గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఎక్కడికక్కడ కబ్జాలు జరుగుతున్నాయని సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. కబ్జాదారులపై రెవెన్యూ అధికారు లకు ఫిర్యాదు చేసి, ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయిం చాలని ఎం.పీ అర్వింద్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయా 3గౌడ్, దిశా కమిటీ ఆశన్న, లింగం, విజయ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరవండి ఇలా!

నేటినుంచి జేఈఈ మెయిన్స్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సూచనలు పాటించాలి

కోదాడ, జనవరి 20 (జనంసాక్షి): దేశంలో ప్రతిష్టాత్మకమైన ఎనచవతీతీంచటి, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కొరకు, జేఈఈ అడ్వాన్స్డ్ ప్రవేశ పరీక్షకు హాజరు కావాలంటే జేఈఈ మెయిన్స్ అర్హత సాధించడం తప్పనిసరి. దీనికి సంబం ధించి ఈ ఏడాది మొదటి సెషన్ పరీక్షలు జనవరి 21 నుండి ప్రారంభ మవుతున్నాయి. ఈ పరీక్షకు సుమారు 13 లక్షల మంది విద్యా ర్థులు వ్రాసే అవకాశం ఉంది. అభ్యర్థుల కు వచ్చిన స్కోరును బట్టి 2లక్షల మంది విద్యార్థు లు జేఈఈ అడ్వాన్సుడ్ రాయడానికి అర్హత సాధిస్తారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ పరీక్ష నిర్వహిస్తుంది. పరీక్షకు మూడు రోజులు ముం దు అడ్మిట్ కార్డు కొరకు అభ్యర్థులు తమ అప్లికే షన్ నెంబర్, పుట్టిన తేదీ ద్వారా ఎన్టిఏ వెబ్సైట్ ద్వారా పొందవచ్చు. పేపర్ 1(బిఈ ,బిటెక్) ఇంజనీరింగ్ కోర్సుల కొరకు ఉంటుంది. మ్యా థ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుండి ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహి స్తారు. 75 ప్రశ్నలు ఇవ్వడం జరుగు తుంది. ప్ర తి ప్రశ్నకు 4 మార్కులు. సరైన సమాధానం ఇస్తే 4 మార్కులు ఇస్తారు. తప్పుడు సమాధానం ఇవ్వడం ద్వారా 1 మార్క్ ఉన్న స్కోర్ నుండి తగ్గించడం జరుగుతుంది పేపర్2 ఏ(బిఆర్క్), 2 బి(బి ప్లానింగ్) కొరకు రెండో పేపర్ ఉంటు ంది. అభ్యర్థులు తమ వెంట ఆధార్, పాన్ కా ర్డు, ఓటర్ ఐడి కార్డ్ ఏదైనా ఒకటి ఒరిజినల్ తీ సుకెళ్లాలి. అటెండెన్స్ షీట్ కొరకు ఒక పాస్ ఫోటో తీసుకువెళ్లాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్స్, క్యా లిక్యులేటర్, వాచీలకు అను మతి లేదు. అడ్మిట్ కార్డులో ఉన్న రిపోర్టింగ్ సమయానికి కంటే ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి వెళ్లాలి

రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ, కోదాడ

బాణాల వసంత, చైర్మన్

గత 5 సంవత్సరాల నుండి ఫిజిక్స్, కెమిస్ట్రీలో ప్రశ్నలు సరళంగా ఉన్నాయి. మ్యాథ్స్‌లో ప్రశ్నలు కఠినంగా వస్తున్నాయి. అభ్యర్థులు మాథ్స్‌పై దృష్టి సారించాలి. 3 గంటల సమ యంలో మొదటి గంటన్నర ఫిజిక్స్ ,కెమిస్ట్రీ పూర్తి చేసి, తర్వాత గంట న్నర మ్యాథమెటిక్స్ చేయాలి. కెమిస్ట్రీ సబ్జెక్ట్ స్కోరింగ్ కొరకు ఎన్సీఈఆర్టీ బుక్స్ చదివితే మంచిది.

భైంసా సుద్దవాగు వంతెనపై ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు మృతి.. సర్పంచ్ గంగాధర్‌కు తీవ్ర గాయాలు

భైంసా, జనవరి 20 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సుద్దవాగు వంతెనపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాలీలారీ–ఏరిటికా వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.నిర్మల్ నుంచి నాందేడ్ వైపు భారీ పరిశ్రమల పరికరాలను తరలిస్తున్న ట్రాలీలారీ, నిజామాబాద్ నుంచి భైంసా వైపు వస్తున్న ఏరిటికా వాహనాన్ని సుద్దవాగు వంతెనపై ఢీకొట్టింది. ఢీకొన్న సమయంలో లారీపై ఉన్న భారీ పరికరం ఏరిటికా వాహనాన్ని బలంగా తాకడంతో వాహనం కుడి వైపుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కుభీర్ మండలానికి చెందిన ఏరిటికా డ్రైవర్ వికాస్ బొప్ప, భోజరాం పాటిల్, కొడిమెల పెద్ద రాజన్న, బోయిడి బాబన్నలు ప్రమాద స్థలిలోనే దుర్మరణం పాల య్యారు. మృతుల్లో ముగ్గురు కుష్టివాసులుగా పోలీసులు గుర్తించారు. మధ్య సీట్‌లో ప్రయా ణిస్తున్న కుప్తి గ్రామ సర్పంచ్ గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను తొలుత భైంసాలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న గ్రామస్తుడిని పరామర్శించేందుకు సోమవారం ఉదయం వెళ్లిన సర్పంచ్ గంగాధర్‌తో పాటు మరో ఐదుగురు గ్రామస్తులు రాత్రి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం జరిగింది. భైంసాకు చేరుకోవడానికి కొద్ది నిమిషాల దూరంలోనే ఈ విషాద ఘటన చోటు చేసు కుంది. సమాచారం అందుకున్న భైంసా ఏఎస్సీ రాజేష్ మీనా, సీఐ సాయి కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో ఇరుక్కున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ప్రమాద తీవ్రత కారణంగా ఒక మృతదేహం పూర్తిగా ఛిద్రమైంది. అనంతరం రెండు వాహనాలను జేసీబీ సహాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అత్తాపూర్ - రాజేంద్రనగర్ విలీనానికి వ్యతిరేకంగా జేఏసీ మౌన నిరసన

రాజేంద్రనగర్,జనవరి20(జనంసాక్షి): జిహెచ్ఎంసి డివిజన్ల డీలిమిటేషన్‌లో భాగంగా అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని డిమాండ్ చేస్తూ జేఏసీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో మౌన నిరసన కార్యక్రమం నిర్వహించారు. పొరెడ్డి ధర్మారెడ్డి నాయకత్వంలో "హైదరాబాద్ వద్దు సైబరాబాద్ ముద్దు" నినాదంతో ఈ నిరసన విజయవంతంగా సాగింది. అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్లను సైబరాబాద్ కార్పొరేషన్‌లోనే కొనసాగించాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తే ఈ ప్రాంత ప్రజలు ఆర్థికంగా నష్టపోతారని, అభివృద్ధి కుంటుపడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధిక పన్నులు చెల్లించే ఈ ప్రాంత ప్రజల నిధులను పాతబస్తీ అభివృద్ధికి మళ్లించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు గెలిపించింది ఇందుకేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అస్తిత్వాన్ని కోల్పోయేలా కుట్రలు జరుగుతున్నాయని, ప్రజలకు వ్యతిరేకంగా తీసుకునే ఏ నిర్ణయానికైనా జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పుస్తకాలు నర్సింగ్ రావు, చలసాని విష్ణుమూర్తి, తెలంగాణ జాగృతి నాయకులు కె. నర్సింహారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సీపీఎం డివిజన్ సెక్రటరీ సుభాష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి, ముక్రం ఖాన్, జరుద్దీన్, వెంకటేష్, సరికొండ దుర్గేష్, బంగి శ్రీను, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ది ప్రీమియా అకాడమీ సస్టైనబిలిటీ సూపంస్టార్-25 అవార్డు

ఖైరతాబాద్, జనవరి 20 (జనంసాక్షి) : నగరానికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ పాఠశాల 'ది ప్రీమియా అకాడమీ'కి గోషార్పెనర్ నిర్వహించిన సస్టె నబిలిటీ సూపర్ స్టార్–25 కాన్క్లేవ్‌లో ప్రతిష్టాత్మక సస్టైనబిలిటీ సూపర్‌స్టార్ అవార్డు లభించిందనిది ప్రీమియా అకాడమీ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరె క్టర్ సిందూరి రెడ్డి మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాల ద్వారా సమాజంపై మంచి ప్రభావం చూపుతున్న సంస్థలను గుర్తిస్తూ తమకు ఈ అవార్డు అంద జేశారని తెలిపారు. ఆలోచనా శక్తి, ప్రశ్నించే తత్వం, బాధ్యతాయుత నిర్ణయాలతో సమాజానికి మేలు చేసే యువతను తయారు చేయడమే తమ లక్ష్యం అన్నారు. ప్రీమియా అకాడమీ ప్రిన్సిపల్ తృప్తి రావు మాట్లాడుతూ ఈ అవార్డు తమ విద్యా విధానానికి మరింత బలం చేకూ ర్చిందన్నారు. లక్ష్యంతో ముందుకు నడుస్తూ సమా జంలో బాధ్యతగా వ్యవహరించే విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ ప్రయత్నం అన్నారు.

రెబల్‌గా పోటీకి సంసిద్ధం

మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామాలు

ఆర్మూర్, జనవరి 20 (జనంసాక్షి): ఆర్మూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునేలా కనబడుతుంది. మున్సిపల్ కౌన్సిలర్ పదవికి బిజెపి,కాంగ్రెస్, బిఆరఎవతీతీఎస్ పార్టీలు పోటీ చేసే ఆశావాహుల నుంచి దరఖాస్తుల ప్రక్రియ సాగి తుది దశకు చేరుకుంది. మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రధానంగా మూడు పార్టీలలో వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు ఆశావాహులు 36 వార్డుల్లో ఒక్కో వార్డుకు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు.బి ఫామ్ ఎవరికి దక్కుతుందోనని నాయకుల్లో ఒకింత టెన్షన్ మొదలైంది.ఇది కాస్త అధికార పార్టీలో మరింత ఎక్కువైంది.గెలుపు విషయం ప్రక్కన పెడితే కౌన్సిలర్ పోటీలో ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పరపతిని ఉపయోగిస్తూ టికెట్ దక్కించేందుకు,కౌన్సిలర్ పోటీలో ఉండేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.దరఖాస్తు చేసుకున్న వారిలో గెలుపు గుర్రాలకు, సర్వేల ఆధారంగా,పార్టీ కోసం పనిచేసిన వారికి టికెట్ కేటాయింపు ఉంటుందని పార్టీలన్నీ బహాటంగానే చెప్పుకుంటున్నాయి. ఈ దరఖాస్తులను చూసి ఆయా పార్టీల నేతలు ఖంగుతింటూ ఎవరికి టికెట్ ఇవ్వాలో తికమక పడుతూ అధిష్టానం దృష్టికి ఎవరి పేరు తీసుకుపోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా ఒక పార్టీలో టికెట్ కేటాయింపు తమకు జరగకపోతే రెబల్ గా పోటీ చేసేందుకు,పార్టీ ఫిరాయింపులు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని సమాచారం. పార్టీ కోసం కనీసం కష్టపడని వారికి, కొందరు ఒకటి కంటే ఎక్కువ టికెట్ ఆశిస్తున్నారని పార్టీ కోసం కష్టపడిన సంగతేంటని నిరాశ భావం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి టికెట్ ఇస్తే ఎవరెవరు రెబల్‌గా ఉంటారని ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం

శామీర్ పేట్, జనవరి 20(జనంసాక్షి): మ్యాన్‌పవర్ తగ్గించి జీతంలో కోతలు వేసి భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురించేస్తుందని ఉద్యోగస్థులు ఆందోళన చేపట్టారు. మంగళవారం శామీర్ పేట్ డివిజన్ లోని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనులు బందు చేసి నిరసన తెలిపారు.వీరికి మద్దతుగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు రవీందర్ గౌడ్, స్థానిక మాజీ ఎంపీటీసీ దప్పు సాయి కుమార్ లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బిజిఎల్ యాజమాన్యం ఔట్ సోర్సింగ్ కార్మికుల మ్యాన్ పవర్ తగ్గించి వారి జీవితాలతో చెలగాటం ఆడడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగస్థుల జీతాలలో కోత విధించడం శోచనీయమన్నారు. గత 15 సంవత్సరాలుగా కష్ట నష్టాలను ఓర్చుకొని పనిచేసిన యాజమాన్యానికి కొంచెమైనా జాలి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత

అరికపూడి

శేరిలింగంపల్లి, జనవరి 20 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇప్పటికే ఆ దిశగా ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడం జరిగిందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు మాదాపూర్ డివిజన్ పరిధి ఖానామెట్ లోగల మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం నిమిత్తం 6 లక్షల రూపాయల ఎస్డిఎఫ్ నిధులతో చేపట్టనున్న పనులకు సంబంధించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు రాసినపత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులకు శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది విజ్ఞప్తిమేరకు పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణముకొరకు ఎస్డిఎఫ్ ఫండ్స్ ద్వారా మొత్తము 6 లక్షల రూపాయలను ఎమ్మెల్యే కోటానుండి మంజూరి చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపడం జరిగినదని, నిధులు విడుదలకాగానే పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణపనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పాఠశాలలో అన్నిరకాల మౌళిక వసతులు కల్పిస్తామని అరికెపూడి ఆశాభావం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని, మరిన్ని నిధులు కేటాయించడం ద్వారా మెరుగైన సదుపాయాల కల్పనకు మార్గాన్ని సుగమం చేస్తానని అరికెపూడి భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, రాంచందర్, కావూరి అనిల్, ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్ నగర్, (జనంసాక్షి): రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనార్థం మట్టపల్లి పుణ్యక్షేత్రానికి త్వరలో రానున్నందున రాష్ట్ర గవర్నర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హుజూర్ నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం మట్టపల్లి లో గవర్నర్ రాక ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ఆయన పర్యవేక్షించారు. రాష్ట్ర గవర్నర్ పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను, ధర్మకర్తలకు సూచించారు. పోలీస్ శాఖ హెలి ప్యాడ్, ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా బందోబస్తు చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కి ఆలయ పండితులు, ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పి కే నరసింహ, అదనపు కలెక్టర్ కే సీతారామారావు, ఆర్ డి ఓ లు శ్రీనివాసులు, సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో జ్యోతి, జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

చేనేత కార్మికుల రెండో దఫా రుణమాఫీ విడుదల చేయండి

మాజీ ఎమ్మెల్సీ చెరుకుపల్లి సీతారాములు

హయత్ నగర్, జనవరి 20 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ లోపు చేనేత కార్మికుల రెండో దఫా రుణమాఫీని వెంటనే విడుదల చేయాలని చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సహారా ఎస్టేట్స్ లో వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6,784 మంది లబ్ది దారులు ఉండగా కార్మికుల పోరాట ఫలితంగా ప్రభుత్వం మొదటి దాఫాలో 33 కోట్ల రూపాయలు విడుదల చేసిందని, మిగిలిన 16 కోట్ల 27లక్షలు రూపాయలను వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు బ్యాంక్ ల ఖాతా ల్లో వెంటనే జమ చేయాలని వారు కోరారు. కేవలం 48 కోట్ల రూపాయలను రుణమాఫీ చేయడానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ని నెరవేర్చుకోవడానికి కూడా ఏడాది న్నర సమయం పట్టిందని, అది కూడా ఎన్నికల తాయిలాలు లాగా విడుదల చేయడం సిగ్గుగా ఉందన్నారు. ఆయా జిల్లాల జౌళి శాఖ అధికారులు బ్యాంకర్ల తో మాట్లాడి లబ్ది దారులకు వడ్డీ మాఫీ సమాచారం తెలియజేయాలనీ వారు కోరారు. చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ లోన్ రుణ మాఫీ కూడా చేసి, కొత్తలోన్‌లు మంజూరు చేసి, చేనేత సహకార సంఘాలను పునరుద్ధరణ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్, రాష్ట్ర కార్యదర్శి నరహరి, శ్రీశైలం, పెంటయ్య, పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుతో ఆర్థిక లాభాలు

- రైతులకు శాస్త్రవేత్తలతో వ్యవసాయ ఉత్పత్తులపై శిక్షణ
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్

వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 20 (జనంసాక్షి): ఉద్యానవన పంటల సాగుపై పూర్తిగా అవగాహన పెంచుకొని అధిక దిగబడులతో ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులకు సూచించారు. వికారాబాద్ మండలం ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో మంగళవారం ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో ఉద్యానవన శాఖ అధికారులు, వివిధ బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... ఉద్యానవన పంటలను నాణ్యతతో పండించినట్లయితే అధిక లాభాలను ఆశించ పచ్చన్నారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుందని, అలాంటి వివరాలను సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఉద్యానవన పంటలను పండిస్తున్న రైతుల సమస్యలను తెలుసుకోవడానికి అదేవిధంగా రైతుల సూచనలను పరిగణలోకి తీసుకొని రైతులకు కావలసిన అవసరాలు తెలుసుకునేందుకు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూలు, కూరగాయలు, పండ్ల తోటల సాగుతో పాటు ఆయిల్ ఫామ్ పంటలు వేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ తెలిపారు. చిన్న సన్నకారు రైతులను కూడా గుర్తించి సబ్సిడీలు అందజేసి ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలి పారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే నర్సరీల ఏర్పాటుకు సబ్సి ఇవ్వడం జరుగు తుందని ఆయన తెలిపారు. రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పి స్తూ స్థలానికి కేటాయించలేని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మార్కెటింగ్, రైతు బజార్ సమస్యలను పరిష్కరిస్తానని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొత్త గడి, ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఉద్యానవన పంటలను అధికారులు, రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికారాబాద్‌లో గల పట్టుదార పరిశ్రమ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, సర్పంచులు సయ్యద్ రబ్బాన్, బిల్లపాటి విజయలక్ష్మి, పట్టు పరిశ్రమ ఎడి నాగరత్న, ఉద్యానవన అధికారులు కమల, డాక్టర్ సురేంద్రనాథ్, యమునలు పాల్గొన్నారు.

దేశంలోనే మొదటి ప్రీమియం మొబిలిటీ సేవలు

బెడ్‌సైడ్ నుంచి బెడ్‌సైడ్ వరకు సురక్షిత ప్రయాణం

హైదరాబాద్, జనవరి 20 (జనంసాక్షి): శారీరక వైకల్యం, వృద్ధాప్యం, అనారోగ్యంతో గడప దాటని వారికి అండగా నిలిచేందుకు ఏసీటీఎస్ మొబిలిటీ లింక్ ప్రైవేట్ లిమిటెడ్ 'డిగ్నీ మూవ్' పేరుతో వినూత్న సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇది దేశంలోనే మొట్టమొదటి ప్రీమియం లగ్జరీ సహాయ రవాణా వ్యవస్థ. ఈ సేవలను ప్రారంభిస్తూ హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన కన్సల్టెంట్, ఐఎస్‌బీ పట్టభద్రుడు, ప్రసిద్ధ మోటివేషనల్ స్పీకర్, ఇన్‌క్లూజన్ కార్యకర్త సాయి ప్రసాద్ విశ్వనాథన్ మాట్లాడారు. డిగ్నీమూవ్ సేవలు అవమానాల నుంచి విముక్తం చేయడంతో పాటు మనశ్శాంతిని అందించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏసీటీఎస్ మొబిలిటీ లింక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కే వెంకట రమణ ప్రసాద్ మాట్లాడుతూ గడప దాటి స్వేచ్ఛగా ప్రయాణించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని శక్తివంతం చేయడమే తమ లక్ష్యమన్నారు. వైద్య అవసరాలు, దైనందిన ప్రయాణాలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, గౌరవప్రదమైన ప్రయాణాన్ని అందించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

జనంసాక్షి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం జనంసాక్షి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పత్రిక యాజమాన్యానికి, ప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పత్రికలు వారధిలా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పెనుగొండ మల్లిఖార్జున రావు, రిపోర్టర్లు సిరికొండ శ్రీనివాస్, యుగేంధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన ప్రభుత్వ వైద్యం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- రూ. 235 కోట్లతో 450 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన, క్రిటికల్ కేర్ భవనం ప్రారంభోత్సవం



జగిత్యాల బ్యూరో, జనవరి 20 (జనంసాక్షి) : పట్టణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రూ. 235 కోట్లతో నిర్మించనున్న 450 పడకల ఆస్పత్రి భవనాలకు మరియు క్రిటికల్ కేర్ భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, మెడికల్ కళాశాల దగ్గర రూ. 235 కోట్లతో 450 పడకల ఆస్పత్రిని నిర్మించుకోబోతున్నామని అన్నారు. అలాగే రూ. 23.5 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్, రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్లను ప్రారంభించుకున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా ప్రజలతో పాటు చుట్టు పక్క జిల్లాలకు చెందిన ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రానుందని అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి క్రిటికల్ కేర్ ఏర్పాటుతో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్రిటికల్ కేర్, నూతన ఆస్పత్రి జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభంతో డయాలసిస్, అత్యవసర ప్రసూతి శస్త్ర చికిత్సలు, మూడు ఆపరే షన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. జగిత్యాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, జగిత్యాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో జగిత్యాల జిల్లాకు ప్రత్యేక మెడికల్ బిల్లు పెట్టేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా వైద్యశాలకు కావాల్సిన పరికరాలు, బడ్జెట్ పరంగా అన్నివిధాలా జిల్లా మంత్రి గా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని పేద ప్రజలకు ఆర్థికంగా వెనుకబడిన వారికి జగిత్యాల ప్రాంతంలో క్రిటికల్ కేర్ హాస్పిటల్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆక్సిజన్ వెంటిలేటర్ ఇతర సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి మంత్రులు కృషితో నూతన ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ చొరవతో 40కోట్ల నిధులు మంజూరు తో మెడికల్ కాలేజీ పనులు త్వరిత గతిన జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మెడికల్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, డి.ఎం.ఎచ్.వో సుజాత, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, ఆశ వర్కర్లు, మరియు తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు అందుబాటులో ఉంచుకోవాలి

- ఆర్టీసీ అధికారులు మేడారం జాతర పూర్తయ్యే వరకు మేడారంలోనే ఉండి ఆపరేషన్స్ నిర్వహించాలి..
- ప్రమాదాలు తగ్గించేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలి
- ఆర్టీసీ లో పెండింగ్ పనులు,బస్ స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ (జనంసాక్షి) : మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ సమర్థవంతంగా బస్సుల ఆపరేషన్స్ నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత మేడారం జాతర లో 3491 ఆర్టీసీ బస్సులు నడిపించగా 16.82 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారు. ఈసారి 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ లో ప్రయాణం చేస్తారనే అంచనా తో 4000 బస్సులను నడిపిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ప్రధానంగా మేడారం వెళ్ళే రూట్లలో వరంగల్ ,హనుమకొండ , ఖమ్మం,కరీంనగర్ రూట్లలో రద్దీ ఎక్కువగా ఉండనుండడంతో రద్దీగా తగిన విధంగా బస్సులు నడపడానికి అక్కడ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మేడారం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టాప్ లో క్యూలైన్ ల వద్ద ప్రయాణికులు జిల్లాల వారిగా వెళ్ళే బస్సులు డిస్ప్లే అయ్యేలా చూడాలని అక్కడ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.మేడారంలో సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టినట్టు శాశ్వత ఆర్టీసీ సముదాయ భవనాన్ని నిర్మించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మేడారం వచ్చే భక్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగించేలా హోర్డింగులు, బస్ స్టేషన్లలో, బస్సులో టీవీ ల ద్వారా ప్రచారాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీలో పెండింగ్ పనులు బస్ స్టేషన్ ల అభివృధి పనుల పురోగతి పై ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో రాబోయే కాలంలో పూర్తిస్థాయిలో ఈవి బస్సులు రానుండడంతో అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న జెబిఎస్ , ఎంజీబీఎస్ మాదిరి నగరంలో మరిన్ని బస్ టెర్మినల్ రావాల్సిన అవసరముందని దానిని స్టడీ చేయాలని ఆర్టీసీకి సంబంధించిన భూ బదలాయింపు పై జిల్లా కలెక్టర్ల తో మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న కాలని లకు ఆర్టీసీ ప్రజా రవాణాలో బాగంగా కొత్త రూట్లలో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ బస్సు మంచి సత్ఫలితాలు ఇస్తుండటంతో తెలంగాణ వ్యాప్తంగా అవసరమైన రూట్లలో బస్సులు నడిపించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విజన్ 2047 లో ఆర్టీసీ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పుడున్న బస్సుల సంఖ్యను మరింత పెంచడం , ఉద్యోగుల సంఖ్యను పెంచడం తదితర వాటిపై కార్యాచరణ తో ముందుకు పోవాలని ఆదేశించారు. సెర్ప్ ద్వారా తీసుకోవాల్సిన మిగిలిన బస్సులను త్వరగా ఆర్టీసీ లోకి తీసుకోవాలి. కింది స్థాయిలో క్షేత్ర స్థాయిలో విజిట్ చేసిన అంశాలు ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నూతనంగా నిర్మితమవుతున్న పెద్దపల్లి, ఏటూరు నాగారం బస్ డిపో ల నిర్మాణాలు వేగంగా జరగాలని ఆదేశించారు. మహా లక్ష్మీ ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నప్పటికీ మిగిలిన డిపో లు నష్టానికి గల కారణాలపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఆర్టీసీ ఈడిలు, ఆర్ఎంలు, ఇతర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

మహిళ సంఘాలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి
- స్వయం సహాయక సంఘాలకు 1,36,62,586 రూపాయల చెక్కులు అందజేత

హుజూర్ నగర్, (జనంసాక్షి): ప్రభుత్వం మహిళా సంక్షేమంలో భాగంగా మహిళ సంఘాలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం హుజూర్ నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వడ్డీ లేని రుణాలలో భాగంగా హుజూర్ నగర్ మున్సిపాలిటీలో 365 స్వయం సహాయక సంఘాలకు 1,36,62,586 రూపాయల చెక్కులను అందజేశారు. అంతేకాక సూర్యాపేట జిల్లాలోని 109 మంది దివ్యాంగులకు 1.09 కోట్ల రూపాయల వ్యయం చేసే దివ్యాంగుల పరికరాల మంజూరు అవ్వగా కోదాడ, నియోజకవర్గంలకు చెందిన 50 మందికి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత మహిళలతో పాటు పట్టణ ప్రాంత మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద చెక్కులను పంపిణీ చేస్తున్నదన్నారు. దివ్యాంగులు ట్రై సైకిల్స్, మోటర్ స్కూటీలు, లాప్ టాప్ లను ఇస్తున్నామని హుజూర్ నగర్ లో ఇంకా ఎక్కువ సంఖ్యలో పరికరాలు అవసరం అయితే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అర్హత ఉన్న వారందరికీ పరికరాలు ఇస్తామన్నారు. హుజూర్ నగర్ లో 912 మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల కింద 272 కోట్ల రూపాయలు, స్త్రీ నిధి కింద 785 సంఘాలకు 32 కోట్లు 60 లక్షలు, స్వయం ఉపాధి కింద 127 సంఘాలకు 1. 90 కోట్ల రూపాయల రుణాలను అందజేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీలో భాగంగా హుజూర్నగర్ మున్సిపాలిటీలో 7836 చీరలను పంపిణీ చేస్తున్నామని ఈనెల 22న ఇంకా అవసరమైన వారందరికీ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేయనున్నట్లు మంత్రి తెలిపారు. హుజూర్ నగర్ అభివృద్ధిలో భాగంగా అనేక కార్యక్రమాలను చేపట్టామని ప్రత్యేకించి వైద్య సహాయం అవసరమైన వారికి అవసరమైన 461 మందికి కోటి 92 లక్షల రూపాయల చెక్కులను నేడు పంపిణీ చేశామని, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇప్పటి వరకు 21 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని, రామస్వామి గుట్ట దగ్గర ఉన్న 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇండ్లు లేని నిరుపేదలకు ఇస్తామని, ఇల్లు అవసరమైన వారు రెండు రోజుల్లో దరఖాస్తుల సమర్పించాలని మంత్రి కోరారు. హుజూర్ నగర్లో డిగ్రీ, జూనియర్ కళాశాలలో నిర్మాణం, ఆసుపత్రిలో సిటీ స్కాన్, డయాలసిస్, బ్లడ్ బ్యాంకు వంటివి ఏర్పాటు చేశామని, నాగార్జునసాగర్ కింద ఇప్పటి వరకు పండించని విధంగా రెండేళ్లలో అత్యధిక పంట పండించడమే కాకుండా ఎం ఎస్ పి కి అత్యధిక ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 13,500 కోట్ల రూపాయల వ్యయంతో 3.17 కోట్ల మందికి ప్రతి ఒక్కరికి 6 కేజీల సన్నబియ్యాన్ని ఇస్తున్నామని, హుజూర్ నగర్ లో 123 కోట్ల రూపాయలతో వ్యవసాయ కళాశాల మంజూరు అయిందని ఈనెల 23న రాష్ట్ర గవర్నర్ ద్వారా వ్యవసాయ కళాశాల శంకుస్థాపనకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంస్థ కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ కే నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా దేశ్ ముఖ్, ఆర్డిఓ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్, దొంతగాని శ్రీనివాస్, కోతి సంపత్ రెడ్డి, గూడెపు శ్రీనివాస్, అజీజ్ పాషా, కోల్లపూడి యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పాలాల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

- 12మంది ప్రయాణికులకు గాయాలు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20 (జనంసాక్షి) : రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళుతున్న ట్రావెల్స్ స్లీపర్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గట్టుగూడెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. బస్సు అశ్వారావుపేట దాటి సుమారు 20 కిలోమీటర్లు వెళ్లిన తర్వాత గట్టుగూడెం వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను పోలీసు వాహనాలు, అంబులెన్సుల ద్వారా సమీప ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వేధింపుల కేసులు మీకు అలవాటు

- మీ హయాంలో నేనూ బాధితుడినే
- కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ బల్మూరి వెంకట్

హైదరాబాద్, జనవరి20 (జనంసాక్షి) : బిఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నేతలపై అనేక వేధింపు కేసులు పెట్టిన విషయం మరిచనట్లు ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం హరీశ్ రావు అవయవాలు దానం చేసినట్లు.. బామ్మర్ది పోయి బావను పరామర్శిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా కేసులు పెట్టి తనను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. 'గాంధీ భవన్ లోపలికి వచ్చి అర్ధరాత్రి నన్ను అరెస్ట్ చేశారు. నా కుటుంబ సభ్యులు సహా మా వాచ్‌మెన్ ఫోన్ కూడా ట్యాప్ చేశారు. రేవంత్ రెడ్డిపై డ్రోన్ కేసు పెట్టి 14 రోజులు జైల్లో పెట్టలేదా? గత ప్రభుత్వంలో ఎథికల్ హ్యాకర్‌ను ట్రైనింగ్ కోసం బయటి దేశాలకు పంపారా? లేదా.? నేను ఎక్కడికైనా వచ్చి ప్రమాణం చేస్తా, మీరూ వచ్చి ప్రమాణం చేస్తారా?' అని ఎమ్మెల్సీ వెంకట్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన ఆరోపణలకు బల్మూరి కౌంటర్ ఇస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తంలో స్కామ్‌లే అని కేటీఆర్ అంటున్నారని.. ఆధారాలుంటే బయటపెట్టాలని ఛాలెంజ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబ గూడుపుటానీలో కవిత భాగస్వామి అని.. అందుకే ఆమెను బయటకు పంపారన్నారు. కేటీఆర్ పదే పదే సృజన్ రెడ్డి అని ఆరోపణలు చేస్తున్నారని.. ఆయన చెప్తున్న సృజన్ రెడ్డి.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడేనని బల్మూరి వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి వెంకట్ మాట్లాడుతూ.. చక్రధర్ గౌడ్ వేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టేసిందని.. ఫోన్ ట్యాపింగ్ కేసుకు దానికి సంబంధం లేదన్నారు. ఏ విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 'లోపల జరుగుతున్న విచారణ మీకు ఎలా తెలుసు? మీకు ఎవరైనా కోవర్టులు ఉన్నారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్సీ బల్మూరి.

కార్పొరేట్ శక్తులు పార్లమెంటరీ డెమోక్రసీకి సవాల్ విసురుతున్నాయి

- ఫాసిస్టులు, క్యాపిటలిస్టులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేద్దాం
- తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇచ్చింది
- ఖమ్మంలో సిపిఐ జాతీయ సెమినార్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ఖమ్మం (జనంసాక్షి) : మతం అనే సెంటిమెంటు పేరుతో ప్రస్తుతం దేశంలో ఆర్థిక, సామాజిక అంశాలను తప్పుదోవ పట్టించి కార్పొరేట్ , ఫాసిస్టు శక్తులు పార్లమెంటరీ డెమోక్రసీకి ఛాలెంజ్ విసురుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన ఖమ్మం జిల్లా కేంద్రంలో సిపిఐ శత వసంతాల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ప్రసంగించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి చాలెంజ్ విసురుతున్న కార్పొరేట్ శక్తులను, దేశంలో ఆర్థిక సామాజిక అంశాలను తప్పుదోవ పట్టిస్తున్న ఆశక్తులను ఐక్య పోరాటాల ద్వారా అడ్డుకట్ట వేద్దాం కలసి ముందుకు పోదామని వామపక్ష పార్టీలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. దోపిడీ వర్గాలు, దోపిడీకి గురయ్యే వర్గాల మధ్య కాకుండా దేశంలో మారిన రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వామపక్షాలు ముందుకు కదలాలి అన్నారు. వర్గ పోరాటం ద్వారానే సోషలిజం సాధ్యమని కార్లు మార్క్స్ చెప్పాడు కానీ భారతదేశ మార్క్స్ అంచనాలకు మినహాయింపుగా మిగిలింది భారతదేశ సమాజం వర్గాలపై కాకుండా కులాలపై నిర్మితమైందని జర్మన్ ఫిలాసఫర్ మార్క్స్ వెబర్ స్పష్టంగా చెప్పాడని సెమినార్లో డిప్యూటీ సీఎం వివరించారు. వర్గ పోరు అనేది లేకుండా చేసి పార్లమెంటు వ్యవస్థ ప్రశ్నార్థకమైన నేపథ్యంలో కమ్యూనిస్టుల పాత్ర ఈ దేశంలో చాలా ప్రముఖమైనదని తెలిపారు. ఖమ్మం జిల్లా అనేక రకాల భావజాలాల వ్యాప్తికి ఆహ్వానం పలుకుతుంది, ఆతిథ్యానికి మారుపేరు ఖమ్మం, దేశవ్యాప్తంగా ఉన్న వామపక్షా నేతలు ఖమ్మం జిల్లాలో సమావేశం కావడానికి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నానని, అభినందిస్తున్నానని తెలిపారు. 100 సంవత్సరాల సిపిఐ చరిత్రలో ఎన్నో త్యాగాలు, ఆటుపోట్లు ఉన్నాయి ఈ దేశానికి స్వాతంత్రం సాధించడంలో సిపిఐది ప్రముఖస్థానం అన్నారు. భారతదేశం అంతటికీ 1947లో స్వాతంత్రం వస్తే తెలంగాణ ప్రాంతానికి ఒక సంవత్సరం తర్వాత స్వాతంత్రం సిద్ధించింది నిరంకుశ నిజాం రాజును వ్యతిరేకించి కమ్యూనిస్టులు చేసిన సాయుధ పోరాటం ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇచ్చింది అని వివరించారు. భూమికోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం.. దున్నేవానిదే భూమి, గ్రంథాలయ ఉద్యమం వంటి గొప్ప పోరాటాలతో తెలంగాణ విలసిల్లింది అన్నారు. ప్రధానంగా ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలో ఏ ఇంటి తలుపు తట్టిన ఒక పోరాట గాథ వినిపిస్తుంది అన్నారు. కాంగ్రెస్ పాలకులు బూర్గుల రామకృష్ణారావు 1950లో కౌలు గారి చట్టాన్ని తీసుకువచ్చారు, ఆ తర్వాత అందులో 1970లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ సంస్కరణల చట్టం, పేదల అభివృద్ధికి 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయ కరణ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం వంటి గొప్ప చట్టాలను వామపక్ష పార్టీల సహాయంతో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ దేశంలో రాష్ట్రంలో తీసుకు రాగలిగాయి అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది లేదంటే సగటుకు మనిషికి హక్కులు దక్కకుండా పోతాయి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓటు హక్కును నాశనం చేస్తుంది, రాజ్యాంగంలో మార్పుల కోసం ప్రయత్నాలు చేస్తుంది కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కలిసి ఈ దేశంలో సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గుర్తు చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370